ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 24.10.2026 | సంపుటి :13 సంచిక : 94 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# ముంచుకొస్తున్న మహాకరువు ముప్పు

## పంటలకు నీళ్లు కరువు.. విద్యుత్ సరఫరాకు గండం

- 10 నెలలు గడ్డు పరిస్థితి నెలకొననుంది
- కరువు కాటుకు ముందే మేల్కొందాం
- ప్రజల భాగస్వామ్యంతోనే గట్టెక్కుదాం
- ప్రజాప్రతినిధులంతా గ్రామాల బాట పట్టాలి



మరో 8 నెలల పాటు ఎండలు తీవ్రంగా ఉంటాయి. ప్రజల భాగస్వా మ్యం లేకుండా కరవును ఎదుర్కోలేము.మరో 8 నెలల పాటు ఎండలు తీవ్రంగా ఉంటాయి. ఎండల తీవ్రతకు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి ఉండదు కరవు, విపత్తులను మనం నిలువరించలేము. వచ్చే నాలుగు నెలలు సాగుకు చుక్కనీరు కూడా దొరకదు. తాగడానికి నీళ్లు లేవు.. ఇక వ్యవసాయానికి నీళ్లు ఎలా ఇస్తాం? తాగునీటి అవసరాలు తీర్చుకోవడం తప్ప వేరే గత్యంతరం లేదు. ఇది క్యాన్సర్ లాంటి నిజం.. ముందే ప్రజలకు చెప్పడం మంచిది. సాగు నీరే లేన ప్పుడు వ్యవసాయానికి విద్యుత్ ఇవ్వడం అసాధ్యం. రిజర్వాయర్లలో 20శాతం కూడా నీటి నిల్వలు లేవు. కృష్ణా జలాల్లో 200 టీఎంసీలు కూడా లేవు. నీటిని పొదుపుగా వాడుకోవాలి. 8 నుంచి 10 నెలలపాటు ప్రమాదకరమైన పరిస్థితులు ఎదుర్కోబోతున్నాం”

హైదరాబాద్(జనంసాక్షి):తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో జరిగే చర్చలకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 23 తర్వాత చర్చలకు ఆహ్వానిస్తానని మిగతా 2లో..

## తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌పై త్వరలోనే మహారాష్ట్రతో చర్చలు

- 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి ఒప్పించేలా వాదనలు
- చర్చలకు సానుకూలత తెలిపిన మహారాష్ట్ర సీఎం
- ఏదుల నుంచే డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీళ్లు
- పాలమూరు నీటికి గండి పడకుండా అదనపు నీటి తరలింపు
- శ్రీశైలం నుంచి ఏదుల వరకు అదనంగా 0.6 టీఎంసీల లిఫ్టింగ్
- నీటిపారుదల ప్రాజెక్టుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..




## కరువు, ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ

- జిల్లాలవారీగా రూపొందించాలి
- కలెక్టర్లకు తగిన నిధులు అందుబాటులో ఉంచాలి
- శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలి
- మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో కరువు, ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి సూచించారు. జిల్లా కలెక్టర్లకు తగిన నిధులను అందుబాటులో ఉంచడంతోపాటు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. తాగునీటి సరఫరా, సాగునీటి అవసరాలు, పంటల రక్షణ, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలకు సకాలంలో ఉపశమనం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.కరువు, ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించి నివారణ చర్యలను సిఫార్సు చేసేందుకు ఏర్పాటైన క్యాబినెట్ సబ్‌కమిటీ తొలి సమావేశం శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి మిగతా 2లో..

## సమాజానికి భద్రత, రక్షణ పునాదులు లాంటివి

- దక్షిణాది రాష్ట్రాల పరస్పర సహకారంతో నేరాలను పూర్తిగా అరికట్టవచ్చు
- తెలంగాణ పోలీస్ శాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చాం: సీఎం రేవంత్
- తెలంగాణ గ్రేహౌండ్స్‌కు మంచి పేరుంది

: డీజీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్(జనంసాక్షి): దక్షిణాది రాష్ట్రాల పరస్పర సహకారంతో నేరాలను పూర్తిగా అరికట్టవచ్చని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దక్షిణాది రాష్ట్రాల పోలీస్ ప్రాంతీయ సమన్వయ సమావేశం జరిగింది. తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ డీజీపీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

## సరిహద్దులో చైనాతో ఘర్షణలు నిజమే



ముఖ్యంగా అరుణాచల్ సరిహద్దులోని పలు ప్రాంతాల్లో గత కొన్నిరోజులుగా ఉద్రిక్తతలు

అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి

- వారి నిలువరించేందుకు ఐటీబీపీకి చెందిన శౌర్య కమాండోలు అసాధారణంగా పనిచేస్తున్నారు
- ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ డీజీ శత్రుజీత్ కపూర్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):
చైనా సరిహద్దు వెంబడి ఇప్పటికీ ప్రతిష్టంభన కొనసాగుతోందని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ డీజీ శత్రుజీత్ కపూర్ వెల్లడించారు. మరీ ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు వద్ద భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ఘర్షణలను ధ్రువీకరిస్తూ వెలువడిన తొలి ప్రకటన ఇదే కావడం గమనార్హం. “అరుణాచల్ సరిహద్దులోని పలు ప్రాంతాల్లో గత కొన్నిరోజులుగా ఘర్షణలు జరిగాయి. అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఈ ఘర్షణల సమయంలో ఐటీబీపీకి చెందిన శౌర్య కమాండోలు అసాధారణంగా పనిచేస్తున్నారు” అని శత్రుజీత్ పేర్కొన్నారు. ఐటీబీపీ సిబ్బంది సేవలను గుర్తిస్తూ ప్రతి ఏటా జరిగే సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. “పర్వత ప్రాంతంలో పోరాడే గెరిల్లా దళంగా తొలుత ఐటీబీపీని ఏర్పాటు చేశారు. 2004లో మనకు చైనా సరిహద్దు భద్రత బాధ్యతలను అప్పగించారు” అని అన్నారు. మిగతా 2లో..

### దేశానికి సమాధానం చెప్పాలి

- ఈ విషయంలో కేంద్రం మౌనం సరికాదు
- ఇంత జరుగుతున్నా చైనాకు మాత్రం రాయితీలను కొనసాగిస్తున్నారు
- ఐటీబీపీ చీఫ్ వ్యాఖ్యలపై స్పందించిన కాంగ్రెస్

2లో..

## మూడు విడతల్లో లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లు



క్యూర్ పరిధిలో నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన భూములు గుర్తించండి

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లతో మంత్రి పొంగులేటి సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి):ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదికన భూములు గుర్తించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. క్యూర్ ఇందిరమ్మ టవర్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. క్యూర్ పరిధిలో మూడు విడతల్లో లక్ష ఇందిరమ్మ ఫ్లాట్లు నిర్మించనున్నట్లు చెప్పారు. రెండో, మూడో విడత నిర్మాణాలకు కూడా భూములు గుర్తించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికను నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, లాటరీ ప్రక్రియను యూ ట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయాలని అధికారులకు సూచించారు.



## నాపై స్టింగ్ ఆపరేషన్ జరిగింది

అందుకు మెటా గ్లాసెస్ వాడారు

ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సంచలన వ్యాఖ్యలు

2లో..

## రేవంత్‌రెడ్డి హడావిడి కొన్నిరోజులే..



- ఆ తర్వాత కేసీఆరే సీఎం అవుతారు
- దేశ రాజకీయాల్లో ఆయన కీలకమయ్యే రోజులు వస్తున్నాయి

: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకమయ్యే రోజులు వస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో అంబర్‌పేట బీఆర్ఎస్ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. “రేవంత్‌రెడ్డి హడావిడి కొన్నిరోజులే.. ఆ తర్వాత కేసీఆర్ సీఎం అవుతారు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్, భాజపాయేతర పార్టీలు కీలకమవుతాయి. రాహుల గాంధీ ఏం చేసినా లాభం లేదు. మోదీ వల్ల ఏం జరిగిందో చూస్తున్నాం. కాంగ్రెస్ విఫలమైనందునే సీజేపీ పేరుతో యువత పోరాటం చేస్తోంది. తెలంగాణ ప్రయోజనాల కోసం ఒక్క ఎంపీ కూడా మిగతా 2లో..

## మాకొద్దీ అమెరికా..

### అగ్రరాజ్య కళాశాలల్లో చేరే భారతీయ విద్యార్థుల సంఖ్యలో 39% క్షీణత

న్యూఢిల్లీ(జనంసాక్షి):మాస్ డిపోర్టేషన్, అరెస్టులు, ఆంక్షలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వలసదారులపై విరుచుకుపడుతున్నారు దీంతో ఆ దేశానికి వెళ్లాలనుకునే భారత విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. గతేడాదితో పోలిస్తే ఆగస్టులో స్టూడెంట్ వీసాలపై భారతదేశం నుంచి యూఎస్‌కు వెళ్లిన విద్యార్థుల సంఖ్య 39 శాతం తగ్గింది. సాధారణంగా ఫాల్ సెమిస్టర్‌కు ముందు విదేశీ విద్యార్థుల చేరిక అత్యధికంగా ఉండే ఈ నెలలో.. వరుసగా వార్షిక క్షీణత నమోదు కావడం గమనార్హం.ఆగస్టులో ఎఫ్, ఎం కేటగిరీ వీసాలపై అగ్రరాజ్యానికి మిగతా 2లో..




## శీతల ఖండంలో భానుడి భగభగలు



### మండుతున్న అగ్నిగోళంలా యూరప్.. పిట్టల్లా రాలుతున్న జనాలు

### 3నెలల్లోనే 50వేల మంది మంది మృతి





#### మృతుల్లో ఎక్కువ శాతం వృద్ధులే

పారిస్(జనంసాక్షి):
శీతల దేశాలకు మారుపేరైన ఐరోపా ఖండం భానుడి ప్రతాపానికి అల్లాడిపోతోంది. ఎల్‌నినో ప్రభావం వల్ల రికార్డు స్థాయిలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు, వడగాలులతో యూరప్ దేశాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. వడదెబ్బకు జూన్ నుంచి ఆగస్టు మధ్యలో రికార్డు స్థాయిలో 50,000కు పైగా మరణాలు సంభవించినట్లు ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. శిలాజ ఇంధన కాలుష్యం వల్ల కలిగే వాతావరణ మార్పుల కారణంగానే వీరిలో 32,600 మంది మరణించినట్లు తెలిపారు. ఒక్క యూకేలోనే ఈ వేసవిలో 4,354 మరణాలు సంభవించగా.. మృతుల్లో ఎక్కువ మంది వృద్ధులు ఉన్నట్లు తెలుస్తోంది. బెల్జియం, ఫ్రాన్స్, జర్మనీ, నెదర్లాండ్స్, స్పెయిన్, స్విట్జర్లాండ్‌లలోనూ రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఈసారి ఐరోపా చవి చూస్తోన్న వడగాల్పులు అతి దారుణమైనవని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేశారు. మారుతున్న వాతావరణానికి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైనందువల్లే ఐరోపా ఇటువంటి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. యూరప్ మిగతా 2లో..



## ‘సర్’కు వ్యతిరేకంగా ఢిల్లీలో కొనసాగుతున్న ఆందోళనలు

- ఈసీ కార్యాలయంవైపు దూసుకెళ్లిన నిరసనకారులు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు వ్యతిరేకంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయానికి చేపట్టిన నిరసన ర్యాలీ ఉద్రిక్తంగా మారింది. దిల్లీ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నిరసనకారులు ఈసీఐ కార్యాలయం వైపు దూసుకెళ్లారు. జాతీయ జెండాలు, బ్యానర్లు చేతబట్టి.. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org

శనివారం 24.10.2026

# ముంచుకొస్తున్న మహాకరువు ముప్పు

హైదరాబాద్(జనంసాక్షి):ఎల్‌నినో కూడా కరోనా లాంటి విపత్కర పరిస్థితేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాభవన్‌లో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నేతలు.. ఎల్‌నినో ప్రభావం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, సర్.. తదితర అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు."మరో 8 నెలల పాటు ఎండలు తీవ్రంగా ఉంటాయి. ప్రజల భాగస్వామ్యం లేకుండా కరవును ఎదుర్కోలేము. కరోనా సమయంలో కేసీఆర్ ఇష్టమొచ్చినట్టు మాట్లాడారు. ఎండలకు కరోనా చచ్చిపోతుందని ఆనాడు కేసీఆర్ చెప్పారు. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు అని రాజకీయ దురుద్దేశంతో బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. 100కు పైగా దేశాలపై ఎల్‌నినో ప్రభావం ఉంది. మహారాష్ట్ర లాంటి అభివృద్ధి చెందిన రాష్ట్రంలోనూ నీటి ఎద్దడి ఉంది. ఆ రాష్ట్రంలో 20శాతం తక్కువ నీటిని వాడాలని నిర్ణయించారు. మరో 8 నెలల పాటు ఎండలు తీవ్రంగా ఉంటాయి. ఎండల తీవ్రతకు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి ఉండదు. కరవును ఎలా ఎదుర్కోవాలనే అంశంపై చర్చించాం. కరవు, విపత్తులను మనం నిలువరించలేము. కరవుపై 6 నెలల నుంచి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. 3 నెలల క్రితం ఎల్‌నినో ప్రభావం పెద్దగా లేదు. ఏదోలా వానాకాలం పంటల నుంచి బయటపడ్డాం" "ఈ ఏడాది 20వేల మెగావాట్లకు పైగా విద్యుత్ వినియోగం జరిగింది. వచ్చే నాలుగు నెలలు సాగుకు చుక్కనీరు కూడా దొరకదు. తాగడానికి నీళ్లు లేవు.. ఇక వ్యవసాయానికి నీళ్లు ఎలా



ఇస్తాం? తాగునీటి అవసరాలు తీర్చుకోవడం తప్ప వేరే గత్యంతరం లేదు. ఇది క్యాన్సర్ లాంటి నిజం.. ముందే ప్రజలకు చెప్పడం మంచిది. సాగు నీరే లేనప్పుడు వ్యవసాయానికి విద్యుత్ ఇవ్వడం అసాధ్యం. రిజర్వాయర్లలో 20శాతం కూడా నీటి నిల్వలు లేవు. కృష్ణా జలాల్లో 200 టీఎంసీలు కూడా లేవు. నీటిని పొదుపుగా వాడుకోవాలి. 8 నుంచి 10 నెలలపాటు ప్రమాదకరమైన పరిస్థితులు ఎదుర్కోబోతున్నాం""ఎక్కువ ధర పెట్టి విద్యుత్ కొందామన్నా దొరకట్లేదు. కరెంటు విషయంలో పొదుపు మంత్రం పాటించాలి. ప్రభుత్వ ఆఫీసుల్లో పగలు ఫ్యాన్లు వేయొద్దు. ఏసీల వాడకాన్ని తగ్గించుకోవాలి. సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించాలి. గడ్డుకాలం రాబోతోంది.. ప్రజలను అప్రమత్తం చేయాలి. పశుసంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. బీఆర్ఎస్ దుష్ప్రచారాన్ని ఎండగట్టే ఓపిక మన నేతలకు ఉండట్లేదు. ప్రజలకు సరిగ్గా వివరించకపోతే.. మనం రాజకీయంగా దెబ్బతింటాం. మనం వాస్తవాలు చెప్పకపోతే.. బీఆర్ఎస్ నేతల ప్రచారాన్నే జనం నమ్ముతారు" అని సీఎం వ్యాఖ్యానించారు.

ప్రజాప్రతినిధులంతా గ్రామాల బాట పట్టాలి

"ప్రతిమా శ్రీనివాసరావు కోసమే కేసీఆర్ యాదాద్రి విద్యుత్ కేంద్రం నిర్మించారు. ప్రతిమా శ్రీనివాసరావుకు 50ఏళ్లలో రూ.లక్ష కోట్ల లాభం వచ్చేలా కేసీఆర్ వ్యూహం పన్నారు. రూ.లక్ష కోట్ల అవినీతి చేసేందుకే యాదాద్రి విద్యుత్ కేంద్రం కట్టారు. నీళ్లు, నిధులు, నియామకాలు.. అన్నీ కేసీఆర్ కుటుంబానికే వచ్చాయి. నీళ్లు ఫామ్‌హౌస్‌కు వెళ్లాయి.. నిధులు బీఆర్ఎస్ పార్టీ ఖాతాకు వెళ్లాయి. చేసిన పనిని చెప్పుకోవడంలో మనం వెనుకబడ్డాం. ఎల్‌నినో సమయంలో 20వేల మెగావాట్ల విద్యుత్ ఇవ్వడం అనేది అద్భుతమైన విజయం. సంక్రాంతి పండుగ తర్వాత నుంచి మే నెలాఖరు వరకు ప్రజాప్రతినిధులంతా గ్రామాల బాట పట్టాలి. ప్రజాప్రతినిధుల ఫోన్లలో మానిటరింగ్ యాప్ పెట్టి పర్యవేక్షిస్తాం. గ్రామాల్లో, వ్యవసాయ భూముల్లో మట్టి పనుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తాం. ప్రతి మనిషికీ పని కల్పించాలి.. ప్రతి ఒక్కరికీ కడుపు నిండా అన్నం పెట్టాలి. ఇందు కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించాలి" అని సీఎం తెలిపారు.

# సమాజానికి భద్రత, రక్షణ పునాదులు లాంటివి

సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. "సమాజానికి భద్రత, రక్షణ పునాదులు లాంటివి. సమర్థ, నిష్పక్షపాత పోలీసు వ్యవస్థను ప్రజలు కోరుకుంటారు. తెలంగాణ పోలీస్ శాఖలో అనేక సంస్కరణలు తీసుకొచ్చాం. హైదరాబాద్‌ను నాలుగు కమిషనరేట్లుగా విభజించి అత్యుత్తమ సేవలందిస్తున్నాం. నార్కోటిక్స్, సైబర్ నేరాల కట్టడికి కఠిన చర్యలు చేపట్టాం. మన సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఈగల్ ఫోర్స్‌కు కేంద్ర అవార్డులు వచ్చాయి. ఆహార కల్తీ నివారణకు టీజీ సేఫ్, ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు హైడ్రా ఏర్పాటు చేశాం. పోలీస్ సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. పోలీసుల పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్స్ తీసుకొచ్చాం. పోలీసు శాఖపై పెట్టే ఖర్చును పౌరుల భద్రతకు పెట్టుబడిగా భావిస్తున్నాం"అని సీఎం అన్నారు.

**తెలంగాణ గ్రేహౌండ్స్‌కు మంచి పేరుంది: డీజీపీ సీవీ ఆనంద్**

మావోయిస్టులను ఎదుర్కొనేందుకు 1980ల్లో గ్రేహౌండ్స్ ఏర్పాటు చేసినట్లు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. " మన గ్రేహౌండ్స్ విభాగానికి దేశవ్యాప్తంగా మంచి పేరుంది. గతంలో హైదరాబాద్‌లో బాంబు పేలుళ్లు జరిగాయి. తీవ్రవాద కార్యకలాపాలు అరికట్టేందుకు ఆక్టోపస్ ఏర్పాటు చేశాం. ఇప్పుడు డ్రగ్స్ నియంత్రణకు ఈగల్ ఫోర్స్ ఏర్పాటు చేశాం. డ్రగ్స్ ముఠాలను పట్టుకునేందుకు అనేక ఆపరేషన్లు చేశాం. డ్రగ్స్ కట్టడికి చేసిన కృషికి కేంద్ర హోంశాఖ అవార్డు ఇచ్చింది. సైబర్ నేరాల కట్టడికి సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశాం. దీనికి కూడా కేంద్రం అవార్డు ఇచ్చింది. ఇటీవల జీరో నక్సల్ స్టేట్‌గా తెలంగాణ మారింది. 824 మంది నక్సల్స్ లొంగిపోయారు.. 302 ఆయుధాలు అప్పగించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా ప్రకృతి విపత్తుల్లో సమర్థంగా సేవలందించాం. పోలీసులు వాడే యాప్‌లను టీస్పార్క్ పేరుతో అప్‌డేట్ చేశాం. మహిళల భద్రతకు ప్రత్యేక విభాగం పని చేస్తోంది. దీని కోసం టీసేఫ్ యాప్ రూపొందించాం" అని డీజీపీ ఆనంద్ పేర్కొన్నారు.

## దేశానికి సమాధానం చెప్పాలి

అరుణాచల్ వద్ద చైనా సైన్యంతో ఘర్షణలు జరిగినట్లు ఐటీబీపీ చీఫ్ వెల్లడించడంపై కాంగ్రెస్ స్పందించింది. ఈ అంశంపై దేశానికి సమాధానం చెప్పకుండా కేంద్ర ప్రభుత్వం మౌనాన్ని పాటిస్తోందని విమర్శించింది. ఇలా ఘర్షణలు జరుగుతున్నప్పటికీ చైనాకు మాత్రం రాయితీలను కొనసాగిస్తున్నారని దుయ్యబట్టింది. "లద్దాఖ్‌లో మాదిరిగానే పెట్రోలింగ్ పాయింట్లు చేజారిపోయాయని స్థానికులు చెప్పారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాల పేర్లను చైనా మారుస్తూనే ఉంది. మనకు ముప్పు కలిగించే ఆనకట్టను నిర్మిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ భద్రతకు సంబంధించి స్పష్టమైన సమాధానాలు దేశానికి కావాలి" అని డిమాండ్ చేసింది.

## నాపై స్టింగ్ ఆపరేషన్ జరిగింది

**అందుకు మెటా గ్లాసెస్ వాడారు**

**ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తాజాగా మరో సంచలన వ్యాఖ్యలు**

బెంగుళూరు(జనంసాక్షి):కర్ణాటక మంత్రులపై కొందరు స్టింగ్ ఆపరేషన్ చేస్తున్నట్లు ఇప్పటికే చెప్పిన ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తాజాగా మరో సంచలన విషయం వెల్లడించారు. కేరళ సీఎం వీడీ సతీశన్‌పైనా, తనపైనా స్టింగ్ ఆపరేషన్ యత్నం జరిగిందని ఆరోపించారు. అందుకోసం మెటా గ్లాసెస్ వాడినట్లు చెప్పారు. స్థానిక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు."నన్ను కలిసేందుకు వచ్చిన ఒక వ్యాపారవేత్త మెటా స్మార్ట్ గ్లాసెస్ ధరించడంతో నాకు అనుమానం వచ్చింది. వ్యాపార సంబంధిత విషయాలు మాట్లాడే ముసుగులో రహస్యంగా వీడియో రికార్డు చేసేందుకు యత్నించారు. దాంతో ఆ వ్యక్తి కదలికలు, ఇతర రాజకీయ నాయకులతో జరిపిన సమావేశాల గురించి సమాచారం సేకరించేందుకు ప్రయత్నించాను. అతడు ఎన్డీయే నేతలను కలిసినప్పుడు మాత్రం మెటా గ్లాసెస్ ధరించలేదు. నాతో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులను లక్ష్యంగా చేసుకొని చేయబోయే భారీ స్టింగ్ ఆపరేషన్ సన్నాహాల్లో ఇది భాగంగా కనిపిస్తోంది. మంత్రులంతా అప్రమత్తంగా ఉండాలి" అని డీకే వ్యాఖ్యలు చేశారు. ఈ ఆరోపణలు కర్ణాటకలో చర్చనీయాంశంగా మారాయి. గతంలోనూ డీకే స్టింగ్ ఆపరేషన్ వ్యాఖ్యలు చేయగా.. కేంద్ర మంత్రి కుమారస్వామి విమర్శలు చేశారు. మంత్రులను గుప్పిట్లో పెట్టుకునేందుకే ముఖ్యమంత్రి 'స్టింగ్ ఆపరేషన్' నాటకాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. సిద్ధరామయ్య ప్రభుత్వంలోని మంత్రులపై ఇదే ఆపరేషన్ చేసిన డీకే శివకుమార్.. ఏకంగా సీఎం పదవిని చేజిక్కించుకున్నారని విమర్శించారు.

## అంతర్జాతీయ వేదికపై పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు

**మీ సైనికుల మృతదేహాలకు మేమే అంత్యక్రియలు చేశాం**

**ఐరాసలో పాక్‌కు భారత్ చురకలు**

**జనంసాక్షి:**అంతర్జాతీయ వేదిక మీద భారత్‌పై నిందలు వేయాలని ప్రయత్నించిన పాకిస్థాన్‌కు మళ్లీ భంగపాటు తప్పలేదు. ఐక్యరాజ్యసమితి సమావేశంలో జమ్మూకశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన దాయాదికి భారత్ గట్టిగా బుద్ధి చెప్పింది.ఐరాస సమావేశంలో పాకిస్థాన్ రాయబారి జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తగా.. భారత శాశ్వత మిషన్ తొలి కార్యదర్శి భావికా మంగళానందన్ ఖండించారు. జమ్మూకశ్మీర్ భారత్ అంతర్గత విషయమని.. దాని గురించి మాట్లాడే నైతిక హక్కు పాక్‌కు లేదని స్పష్టం చేశారు. కశ్మీర్‌పై పెట్టే శ్రద్ధ.. తన ఆక్రమణలో ఉన్న ప్రాంతాల్లోని మైనార్టీలపై పెట్టాలని సూచించారు. అనేకమంది మైనారిటీలు కనుమరుగవుతున్నారని.. నిరంతరం వారి హక్కుల ఉల్లంఘన జరుగుతోందన్నారు. మొదట ఆ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.'అసాధారణ పరిస్థితులలో అంత్యక్రియల హక్కులు.. మత విశ్వాసాలు' అనే అంశంపై చర్చలో మంగళానందన్ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. '1999లో కార్గిల్‌లో మరణించిన సొంత సైనికుల మృతదేహాలను కూడా స్వీకరించని ఒక దేశం.. విశ్వాసం, మత స్వేచ్ఛ, ఖననాల గురించి మాట్లాడటం విడ్డూరం. నేను వారికి ఒక విషయం గుర్తు చేయాలనుకుంటున్నాను. వారు తమ సైనికుల మృతదేహాలను దయనీయ పరిస్థితుల్లో వదిలేసిన సమయంలో .. వాటికి భారత సైన్యమే సైనిక లాంఛనాలతో, ఇస్లాం సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించింది.ఒక ఉగ్రవాది అమాయక ప్రజలను చంపడమే కాకుండా.. ఒక దేశ మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తాడు. అలాంటి ఉగ్రవాదుల హక్కుల కోసం ఇంత తీవ్రంగా వాదిస్తున్న పాకిస్థాన్.. ఉగ్రవాద బాధితుల హక్కుల గురించి ఆలోచించకపోవడం ఆశ్చర్యకరం' అని మంగళానందన్ పేర్కొన్నారు.

## లగ్జరీ పడవపై దాడి ఘటన.. 14 మంది భారతీయులు సురక్షితం!

**జనంసాక్షి:**యెమెన్‌లో భారతీయులున్న పడవపై దాడి ఘటనపై అక్కడి భారత రాయబార కార్యాలయం మరోసారి స్పందించింది. యెమెన్‌లోని హోడెడా పరిసర ప్రాంతాల్లో ఈ పడవ ఉందని.. అందులోని 14 మంది భారతీయులు సురక్షితంగానే ఉన్నారని వెల్లడించింది. వారికి ఎటువంటి అపాయం కలగకుండా తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని తెలిపింది.భారత పౌరులున్న లగ్జరీ పడవపై సౌదీ అరేబియా దాడి చేసిందని అక్టోబర్ 22న హూతీలు ఆరోపించిన విషయం తెలిసిందే. జబల్ జుకర్ ద్వీపం వద్ద ఈ దాడి జరిగిందని.. వారిని యెమెన్ సైన్యం రక్షించినట్లు పేర్కొన్నారు. ఇదే విషయంపై శుక్రవారం ఉదయం భారత దౌత్య కార్యాలయం స్పందిస్తూ.. విహార నౌకలో మన నావికులు ఉన్నట్లు తెలిసిందని పేర్కొంది.ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వారి గురించి కచ్చితమైన సమాచారం ప్రస్తుతానికి అందుబాటులో లేదని తెలిపింది. ఘటనకు దారితీసిన పరిస్థితుల గురించి తెలుసుకునేందుకు సంబంధిత విభాగాలతో సంప్రదింపులు చేస్తున్నామని చెప్పిన కొన్ని గంటలకే వారు సురక్షితంగా ఉన్నట్లు ప్రకటించింది. అయితే, దాడి ఎవరు చేశారనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు.ఇదిలాఉంటే, అంతర్జాతీయ నౌకా రవాణాలో భారత నావికులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సుమారు 3 లక్షలకుపైగా భారతీయ నావికులు పనిచేస్తున్నట్లు అంచనా. అయితే, ఇటీవల పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, నౌకలపై దాడుల్లో పలువురు భారత నావికులు గల్లంతు కావడం, ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది.

## 'సర్'కు వ్యతిరేకంగా ఢిల్లీలో కొనసాగుతున్న ఆందోళనలు

నినాదాలు చేశారు. పోలీసులు వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. నిరసనకారులను పోలీసులు అడ్డుకోవడంతో... వారంతా రోడ్డుపైనే బైఠాయించారు. ఎస్ఐఆర్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువకులు, రైతులతోపాటు సీపీఎం సీనియర్ నేత బృందా కారాట్, ఆల్ ఇండియా డెమొక్రాటిక్ విమెన్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా డెమొక్రాటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ సభ్యులు ఈ నిరసనల్లో పాల్గొన్నారు. వీరితోపాటు దిల్లీ, హరియాణా, ఉత్తర్‌ప్రదేశ్ నుంచి పెద్ద సంఖ్యలో నిరసనకారులు ఆందోళనల్లో పాల్గొని తమ మద్దతు తెలియజేశారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు సెంట్రల్ దిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. రాపిడ్ యాక్షన్ ఫోర్స్ దళాలను రంగంలోకి దించారు.

## సరిహద్దులో చైనాతో ఘర్షణలు నిజమే..

చైనానే అత్యంత క్లిష్టమైన సరిహద్దు అని ఆయన అంగీకరించారు. గల్వాన్ తరహా ఘర్షణలను మెరుగ్గా ఎదుర్కోవడానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని సిద్ధం చేశామని, భూగర్భ మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నామని తెలియజేశారు. చైనాతో ఉన్న 3,488 కి.మీ. పొడవైన వాస్తవాధీన రేఖ వెంబడి ఈ ఐటీబీపీ పహారా కాస్తుంటుంది. ఎత్తైన ప్రదేశంలో జరిగే ఘర్షణలను ఎదుర్కోవడం శౌర్య కమాండోల ప్రత్యేకత.

**శీతల ఖండంలో భానుడి భగభగలు**

దేశాలు ఇకనైనా సమన్వయంతో వేగవంతమైన చర్యలు తీసుకోకపోతే పరిస్థితులు మరింత దిగజారే అవకాశం ఉందని హెచ్చరించారు. సహారా ఎడారి నుంచి ఉత్తర దిశగా కదులుతున్న వేడి గాలి, ఎల్‌నినో ఎఫెక్ట్ వల్లే ఐరోపాలో ఈ హీట్‌డోమ్ పరిస్థితులు తలెత్తాయని వెల్లడించారు. ఇదీ చదవండి: టిబెట్‌లో భారీ భూకంపం.. 16 మంది మృతి

## తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌పై త్వరలోనే మహారాష్ట్రతో చర్చలు

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇటీవలే సూచనప్రాయంగా తెలియజేశారని సీఎం వెల్లడించారు. శుక్రవారం బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌తో పాటు డిండి, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులపై పీటముడిగా ఉన్న అంశాలన్నింటినీ ఈ సమావేశంలో చర్చించారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మిస్తే ఎంత నీటిని తెచ్చుకునే వీలుంది.. 150 మీటర్ల ఎత్తున ఎంత నీటిని ఎల్లంపల్లి వరకు తెచ్చుకునే వీలుందనే వివరాలను ఇరిగేషన్ ఇంజనీర్లు సీఎంకు వివరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్ర పరిధిలో ఎక్కడ కూడా గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం లేదని వివరించారు. 152 మీటర్ల ఎత్తున నిర్మిస్తే దాదాపు 2300 ఎకరాల భూములు ముంపునకు గురవుతాయని, 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే వెయ్యి ఎకరాల లోపే ముంపు ప్రభావం ఉంటుందని వివరించారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేసుకొని, సాధ్యమైనంత నీటిని తెచ్చుకునేందుకు వీలుగా ఈ బ్యారేజీ నిర్మించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కేంద్ర జల సంఘం అధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన రెండు రాష్ట్రాల అధికారుల సమావేశంలో జరిగిన వివరాలన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, సీడబ్ల్యూసీ కోరిన సమాచారాన్ని అందజేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. అటవీ, గిరిజన ప్రాంతం, అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మిస్తున్నామని సీఎం వివరించారు. అదే లక్ష్యాన్ని సాధించే సంకల్పంతో మహారాష్ట్ర ప్రభుత్వంతో సానుకూల చర్చలు, సంప్రదింపులు జరగాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. జల్ జంగిల్ జమీన్ నినాదంతో ఏళ్లకేళ్లు పోరాడిన అటవీ ప్రాంతవాసులందరికీ ఈ ప్రాజెక్టు ద్వారా మేలు జరగాలని అన్నారు. అందుకే తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత.. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజనీర్లను సీఎం ఆదేశించారు. గతంలోనే 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకునే వీల్లేదని సీఎం అన్నారు. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల వివరాలు, అక్కడ చర్చించిన అంశాలు, వాళ్లు కోరిన నివేదికలన్నీ వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలను తెలియజేసి, మన వాదనను సమర్థంగా వినిపించాలని మంత్రులకు సీఎం సూచించారు. డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీరు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమయ్యే 0.6 టీఎంసీల నీటిని శ్రీశైలం నుంచి అదనంగా సమకూర్చుకునే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు ఈ అదనపు నీటిని లిఫ్ట్ చేసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎక్కడెక్కడ పంపులు, పంప్ హౌజ్లు అమర్చాలి.. ఇప్పుడున్న కెనాల్స్, టన్నెల్ సిస్టమ్ సామర్థ్యం సరిపోతుందా.. లేదా ఎక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవాలనేది ఇరిగేషన్ విభాగం వెంటనే అధ్యయనం చేసి.. అందుకు వీలైన డిజైన్లు తయారు చేసుకోవాలని సీఎం ఆదేశించారు. దీంతో పాలమూరు ప్రాజెక్టు నీటి అవసరాలకు ఎలాంటి కోత పడదని సీఎం స్పష్టం చేశారు. పాలమూరు నీటి కేటాయింపులకు ఆటంకం లేకుండా ఏదుల నుంచి డిండి, అచ్చంపేట ప్రాజెక్టులకు నీటిని అందించేలా ఈ పనులు చేపట్టాలని ఆదేశించారు. నార్లాపూర్ నుంచి డిండికి నీటిని తీసుకోవాలా... ఏదుల నుంచి డిండికి నీటిని తీసుకోవాలనే విషయంలో మహబూబ్నగర్, నల్గొండ జిల్లాల ప్రతినిధుల అభ్యంతరాలు, విజ్ఞప్తులపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా నార్లాపూర్ నుంచి నీటిని తరలిస్తే ఎంత ఖర్చవుతుంది.. ఏదుల నుంచి నీటిని తీసుకుంటే ఎంత అంచనా వ్యయమవుతుందనే వివరాలన్నీ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనుకూలతలు, ప్రతికూలతలన్నింటినీ వివరించారు. మధ్యేమార్గంగా పాలమూరు ప్రాజెక్టు నీటికి ఢోకా లేకుండా డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీటిని లిఫ్ట్ చేసేందుకు వీలుగా అదనపు నీటిని తెచ్చుకునే పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చేసిన సూచనకు మంత్రులు మద్దతు తెలిపారు.సమావేశంలో ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్, సీఎంవో సెక్రెటరీ మాణిక్రాజ్ తో పాటు సెక్రెటరీ (టన్నెల్) కల్నల్ పరీక్షిత్ మెహ్రా తో పాటు ఇరిగేషన్ జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, అన్ని ప్రాజెక్టుల సీఈలు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి హడావిడి కొన్నిరోజులే..

పనిచేయడం లేదు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన వర్గాలన్నీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నాయి. రాష్ట్రంలో కరెంట్ లేక రైతులు గోస పెడుతున్నారు. ఎల్‌నినో ఉందని 10 నెలల ముందే నిపుణులు చెప్పారు. కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ప్రయోజనాల కోసం కాకుండా మమ్మల్ని తిట్టడమే పనిగా పెట్టుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు యువత సిద్ధంగా ఉన్నారు" అని కేటీఆర్ అన్నారు.

## మాకొద్దీ అమెరికా..

వచ్చిన భారతీయ విద్యార్థుల సంఖ్య 25,321గా అమెరికా వాణిజ్య శాఖకు చెందిన అంతర్జాతీయ వాణిజ్య పరిపాలన (ఐటీఏ) వెల్లడించింది. గతేడాది ఈ కేటగిరీ వీసాలపై 41,540 మంది వెళ్లినట్లు నివేదికలు పేర్కొన్నాయి. కొవిడ్ మహమ్మారి కారణంగా 2020లో ప్రయాణ ఆంక్షలు విధించిన సమయంలో విద్యార్థుల సంఖ్య 2,908కు పరిమితం కాగా.. మళ్లీ ఆగస్టు నెలలో నమోదైన అత్యల్ప సంఖ్య ఇదేనని తెలిపాయి. జోబైడెన్ అధికారంలో ఉన్న సమయంలోనూ విద్యార్థుల సంఖ్య కొంత మేర తగ్గినప్పటికీ.. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టినప్పటి నుంచి ఇది మరింత వేగంగా పడిపోయింది.కఠినమైన వీసా నిబంధనలు, చదువు పూర్తయిన తర్వాత ఉపాధి అవకాశాలపై అనిశ్చితి, సోషల్ మీడియా వెట్టింగ్ వంటి అంశాలే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అధిక వీసా తిరస్కరణ రేట్లు, ఉపాధి అవకాశాలు, పెరుగుతున్న విద్యావ్యయం వంటి అంశాలు కూడా భారతీయ విద్యార్థులను తమ ప్రణాళికలను పునఃపరిశీలించుకునేలా ప్రేరేపిస్తున్నాయని ఎడ్యువెలాసిటీ గ్లోబల్ మేనేజింగ్ పార్ట్‌నర్ కన్సల్టెంట్ పేర్కొన్నారు.

## కరువు, ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ

విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు.క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి, సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రతి జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలు, తలెత్తే నీటి కొరత, వ్యవసాయ అవసరాలను అంచనా వేసి, వాటిని ఎదుర్కొనేందుకు స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు నిరంతర సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.అత్యవసర పరిస్థితుల్లో కలెక్టర్లు తక్షణమే స్పందించేందుకు అవసరమైన నిధులు వారి వద్ద అందుబాటులో ఉండాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. విధానపరమైన ప్రక్రియల కారణంగా సహాయక చర్యల్లో జాప్యం జరగకుండా చూడాలన్నారు. నీటిపారుదల, గ్రామీణ తాగునీటి సరఫరా, వ్యవసాయ శాఖలతోపాటు స్థానిక యంత్రాంగం సమన్వయంతో పనిచేసి, అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.రాష్ట్రంలో వర్షపాతం లోటు, జలాశయాల్లో నీటి నిల్వలు, సాగునీటి లభ్యత, భూగర్భ జలమట్టాలు, వ్యవసాయ పరిస్థితులు, ఆయా శాఖల సన్నద్ధతను సమావేశంలో సమీక్షించారు. జిల్లాల స్థాయిలో తాగునీటి లభ్యత, సాగునీటి అవసరాలను సమన్వయంతో పర్యవేక్షించాల్సిన అవసరంపై చర్చించారు.రాష్ట్రంలోని 358 మండలాల్లో కరువు సంబంధిత సమస్యలు ఉన్నట్లు సమావేశానికి వివరించారు. వీటిలో 315 మండలాల్లో నిర్దేశిత కరువు అంచనా ప్రమాణాలకు సరిపడే పరిస్థితులు ఉన్నాయని, మరో 43 మండలాల్లో పంటనష్టం ముప్పు ఉందని తెలిపారు. ఈ అదనపు మండలాల్లో పరిస్థితులను కూడా పరిశీలించి, ఆధారాలతో కూడిన వివరాలను కేంద్రానికి సమర్పించే వినతిపత్రంలో పొందుపరచడంపై చర్చించారు. వర్తించే పథకాల కింద కేంద్ర సహాయం కోరేందుకు అవసరమైన సమాచారాన్ని సమగ్రంగా సిద్ధం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు.రాష్ట్రంలో మొత్తంగా సుమారు 24 శాతం వర్షపాతం లోటు నమోదైనట్లు సమావేశంలో సమర్పించిన అంచనాలు వెల్లడించాయి. సాగునీటి జలాశయాల్లో నిల్వలు సాధారణ స్థాయి కంటే గణనీయంగా తక్కువగా ఉన్నాయని, పలు మండలాల్లో భూగర్భ జలాలపై ఒత్తిడి నెలకొన్నట్లు వివరించారు. వ్యవసాయం, తాగునీటి సరఫరా, గ్రామీణ జీవనోపాధులపై కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు సమగ్ర ప్రణాళికలు, నిరంతర పర్యవేక్షణ, సకాలంలో వనరుల సమీకరణపై సమావేశం దృష్టి సారించింది.మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.



## ఇంట్లో బాణసంచా నిల్వ..

**భారీ పేలుడు.. ప్రమాదంలో పలువురు మృతి!**

**మరికొందరికి గాయాలు**

పాట్నా(జనంసాక్షి):బిహార్‌లోని సివాన్ జిల్లాలో బాణసంచా నిల్వ ఉంచిన ఓ ఇంట్లో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా.. మరికొంత మంది గాయపడినట్లు సమాచారం. ఘటనా స్థలికి చేరుకున్న అగ్నిమాపక బృందాలు రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. దాదాపు రెండు గంటలపాటు పేలుళ్లు కొనసాగడంతో సహాయక చర్యలకు ఆటంకం కలిగినట్లు అధికారులు వెల్లడించారు.సివాన్ జిల్లాలోని అలంపుర్ గ్రామానికి చెందిన ఓ వ్యాపారి తన ఇంట్లోనే బాణసంచా తయారీ చేపట్టడంతోపాటు నిల్వ చేస్తున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. శుక్రవారం అదే ఇంట్లో భారీ పేలుడు సంభవించింది. ఘటన సమయంలో అక్కడ అనేకమంది ఉన్నట్లు సమాచారం. వీరిలో నలుగురు ప్రాణాలు కోల్పోగా మరికొంత మంది ఆచూకీ లభ్యం కాలేదు. ఫోరెన్సిక్ బృందాలు బాధితుల నమూనాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యాయి. మరోవైపు, నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలతో ముప్పు ఉండడంతో ఘటనా స్థలికి 200 మీటర్ల దూరంలో ఉండాలని గ్రామస్థులను పోలీసులు హెచ్చరించారు.

## ఆందోళనల వేళ.. పారిస్‌లో కాల్పుల కలకలం

పారిస్(జనంసాక్షి):ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో ఆఫ్రికా జాతీయుడు మృతి చెందగా నలుగురు గాయపడ్డారు. నగర శివారు ప్రాంతమైన ట్రాప్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. దుండగుడు కారులో నుంచే పలు ప్రాంతాలపై కాల్పులు జరుపుతూ బీభత్సం సృష్టించినట్లు సమాచారం. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. కొద్ది సమయంలోనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. దాడికి గల కారణాలు మాత్రం తెలియలేదు. సామూహిక మారణహోమానికి పాల్పడే ఉద్దేశంతోనే దుండగుడు ఈ చర్యకు దిగినట్లు అనుమానిస్తున్నారు. దాడి నేపథ్యంలో స్థానికంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ఫ్రాన్స్ జాతీయ ఉగ్రవాద వ్యతిరేక విభాగం వెల్లడించింది.ధరల పెరుగుదల, దుర్భరంగా మారిన జీవన వ్యయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కొన్ని రోజులుగా ఫ్రాన్స్ నగరాల్లో ఆందోళనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇటీవల తీవ్రరూపం దాల్చిన ఆ ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. దుకాణాల లూటీలు, వాహన, భవనాల దహనాలతో పారిస్ సహా పలు నగరాలు అట్టుడుకుతున్నాయి. శనివారం మరోసారి ఆందోళనలకు సిద్ధమవుతున్న సమయంలోనే కాల్పుల ఘటన చోటుచేసుకుంది. మరోవైపు, ఆందోళనల నేపథ్యంలో అక్టోబరు 24న నగరంలోని ప్రధాన మ్యూజియాలు మూతపడనున్నట్లు అధికారులు వెల్లడించారు.



# వరంగల్ అభివృద్ధికి ప్రత్యేక చొరవ

- రూ.382 కోట్లతో ఐదు ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు
- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 23 (జనం సాక్షి)** : హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేస్తానని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీకి అనుగుణంగా, నగర అభివృద్ధికి రూ. 382 కోట్ల అంచనా వ్యయంతో ఐదు కీలక ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు కుడా కు మంజూరు చేయడం పట్ల కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కుడా, వరంగల్ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ చారిత్రక వైభవాన్ని కాపాడుతూ, ఆధునిక మౌలిక సదుపాయాలతో నగరాన్ని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ సంకల్పానికి ఈ అనుమతులు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. కుడా ఆధ్వర్యంలో వరంగల్ కోట కందకాల పునరుద్ధరణ, హనుమకొండ సెంట్రల్ ప్లాజా అభివృద్ధి, ఇంటిగ్రేటెడ్ బస్ టెర్మినల్ కమ్ కమర్షియల్ కాంప్లెక్స్, వేయి స్తంభాల గుడి పరిసరాల్లో అభివృద్ధి పనులు, మ్యూజికల్ గార్డెన్ ఏర్పాటు వంటి ప్రాజెక్టులు నగరానికి కొత్త రూపురేఖలను తీసుకురానున్నాయని తెలిపారు. వీటితో పర్యాటక రంగం అభివృద్ధి చెందడమే కాకుండా, వాణిజ్య కార్యకలాపాలు, స్థానిక ఉపాధి అవకాశాలకు మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ అభివృద్ధి ప్రాజెక్టుల నిధుల మంజూరికి సహకరించిన ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి, రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి కి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యకి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కి, కుడా వైస్ చైర్‌పర్సన్‌కు, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు గుండు సుధారాణి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయడం వల్ల నగర అభివృద్ధి లక్ష్యాలను మరింత వేగంగా సాధించగలమని పేర్కొన్నారు. వరంగల్ అభివృద్ధిపై ముఖ్యమంత్రి చూపుతున్న ప్రత్యేక చొరవ నగర ప్రజల్లో కొత్త ఆశలను నింపుతోందని, నగరానికి ఇచ్చిన హామీకి అనుగుణంగా కీలక ప్రాజెక్టులకు అనుమ తులు మంజూరు చేయడం పట్ల వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజే స్తున్నానని, ఈ ప్రాజెక్టులు సాకారమై వరంగల్ చారిత్రక వారసత్వాన్ని కాపాడు కుంటూ, ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చెందిన నగరంగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షిస్తున్నాను' అని కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి తెలిపారు.

## హైదరాబాద్‌లో నేటి నుంచి రెండు రోజుల
# మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు

- 21 రాష్ట్రాల నుంచి హాజరుకానున్న ప్రతినిధులు




**హైదరాబాద్ (జనంసాక్షి)** : ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (ఎంఈఎఫ్ఐ) సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 24, 25 తేదీల్లో హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు 'జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సు' నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ఆతిథ్యం ఇస్తోంది. బేగంపేటలోని తెలంగాణ పర్యాటక శాఖ హోటల్ 'ది ప్లాజా'లో ఈ సదస్సు జరగనుంది. 21 రాష్ట్రాల నుంచి మహిళా జర్నలిస్టులు ప్రతినిధులుగా హాజరుకానున్నారు.

### సదస్సును ప్రారంభించనున్న హైకోర్టు జస్టిస్

శనివారం జరిగే సదస్సు ప్రారంభ సమావేశానికి తెలంగాణ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు జస్టిస్ జి. రాధారాణి ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం చేస్తారు. గౌరవ అతిథులుగా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారు. ప్రత్యేక అతిథులుగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా ఖానమ్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి హాజరవుతారు. విశిష్ట అతిథులుగా ఎంఈఎఫ్ఐ మేనేజింగ్ ట్రస్టీ, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, ఐజేయూ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్ము, సెక్రటరీ జనరల్ . సోమసుందర్, ఐజేయూ మాజీ అధ్యక్షుడు ఎస్.ఎన్. సిన్హా పాల్గొంటారు.

రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో మొత్తం ఐదు ప్రత్యేక సెషన్లు ఉంటాయి. మీడియా రంగంలో పనిచేస్తున్న మహిళలు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సవాళ్లు, పని ప్రదేశాల్లో భద్రత, లింగ వివక్ష, పని పరిస్థితులు, సమాన అవకాశాలు, సరైన ప్రాతినిధ్యం మరియు జర్నలిజంలో మహిళల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. ఈ సెషన్లలో సీనియర్ జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త గీతా శేషు, న్యూస్‌మీటర్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కనిజా గరారి, సీనియర్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ మాలిని సుబ్రమణ్యం, ప్రముఖ జర్నలిస్ట్ ఉమా సుధీర్, ఉస్మానియా విశ్వ విద్యాలయ జర్నలిజం విభాగం మాజీ అధిపతి ప్రొఫెసర్ పద్మజా షా తదితరులు ప్రసంగిస్తారు. అక్టోబర్ 25 మధ్యాహ్నం జరిగే ముగింపు సమావేశానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రోడ్లు భవనాల శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన హాజరవుతారు.

# మైసమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లులకు బోనం

- సమర్పించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త దంపతులు
- బాటిల్ కంపెనీలో ఘనంగా ఆధ్యాత్మిక కార్యక్రమం పనిచేసే ఎంప్లాయీస్‌కు వస్త్రాల పంపిణీ





**హైదరాబాద్ (జనంసాక్షి)** : గౌరెల్లి, హయత్‌నగర్, మర్పల్లి ప్రాంతాల్లోని బాటిల్ కంపెనీలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త దంపతులు పాల్గొని మైసమ్మ తల్లి, ఎల్లమ్మ తల్లులకు భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిప్రపత్తులతో మొక్కులు చెల్లించుకున్నారు. కంపెనీ నిరంతరం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, అందరికీ అమ్మవార్ల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ ఆధ్యాత్మికతను, భక్తిభావాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. అనంతరం కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉప్పల శ్రీనివాస్ గుప్త వస్త్రాలను అందజేశారు. ఉద్యోగుల శ్రమను గుర్తిస్తూ, వారితో ఆత్మీయంగా మెలుగుతూ వస్త్రాలను పంపిణీ చేయడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంస్థ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని, వారి కృషి, అంకితభావం సంస్థ పురోగతికి పునాదులుగా నిలుస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు పరస్పర ఆత్మీయతను, ఐక్యతను పెంపొందిస్తాయని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. అమ్మవార్ల ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన సతీమణి ఉప్పల స్వప్న, పెద్ద కుమారుడు ఉప్పల సాయి కిరణ్ ,చిన్న కుమారుడు సాయి తేజ కంపెనీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## సిఎంఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల ప్రతినిధి, అక్టోబర్ 23, (జనంసాక్షి)** : ప్రజా సంక్షేమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల సమత రైస్ మిల్ ను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... రైస్ మిల్లుకు కేటాయించిన వరి ధాన్యం లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని, సి.ఎం.ఆర్. ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. మండలంలోని మద్దికల్ గ్రామాన్ని ఉప తహసిల్దార్ అంజమ్మ తో కలిసి సందర్శించి గ్రామంలో చేపట్టే రీ సర్వే ప్రక్రియను ఉదయం సమయంలో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఉద్యోగుల హాజరు పట్టిక, భూభారతి దరఖాస్తుల పరిశీలన, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ అంశాలను పరిశీలించారు. అధికారులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. భూభారతి దరఖాస్తులను రికార్డులతో సరిచూసి నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు.

# నకిలీ సమ్మిట్లు వద్దు..

- యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి
- టీఆర్‌ఎస్ అధినేత్రి కవిత



**హైదరాబాద్ (జనంసాక్షి)** : నకిలీ సమ్మిట్లు వద్దని, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని టీఆర్‌ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మియాపూర్ నరేన్ గార్డెన్స్ లో టీఆర్‌ఎస్ రాజధాని రణభేరి సభలో ఆమె మాట్లాడుతూ.. తంగేడు పువ్వు జెండా కోసం కష్టపడితే ఎంపీలు, ఎమ్మెల్యేలు అవుతారని చెప్పారు. తమ పార్టీ జెండాలో ఉన్నది పసుపు రంగు కాదని, అది తంగేడు రంగు అని తెలిపారు. హైదరాబాద్‌కు గుర్తింపు తెచ్చిన ఐటీ ఎంప్లాయీస్ మేధస్సుకు, నాలెడ్జ్‌కు సెల్యూట్ అని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో గానీ, కేంద్రంలో గానీ సరైన ఐటీ పాలసీ ఎందుకు లేదని ప్రశ్నించారు. రాష్ట్రానికి నకిలీ సమ్మిట్‌లు వద్దని, యువతకు ఉద్యోగాలు, ప్రజలకు ఉపాధి కల్పించే కార్యక్రమాలు కావాలని కవిత డిమాండ్ చేశారు. సమ్మిట్‌ల పేరుతో రైతుల భూములను తీసుకుం టున్నారని, కానీ ఉద్యోగాలు కల్పించడం లేదని ఆరోపించారు. సేకరించిన భూములన్నింటినీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి పేరు మీద చేర్చుకున్నారని ఆరోపించారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను అడ్డుకుంటామని చెప్పారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఎవరికివారు తామే గొప్పవాళ్లమని చెప్పుకుంటున్నారని, కానీ జంగల్‌లో షేర్ లు ఎన్ని ఉన్నా శికారి ఒక్కడే ఉంటాడని అన్నారు. ఇప్పుడు ఆ సింహాలన్నింటినీ బోనులో బంధించే సమయం వచ్చిందని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓట్లు వేసేటప్పుడు ప్రతివెయ్యి ఓట్లకు ఒక బూత్ ఉంటుందని, మరి ప్రతి వెయ్యి ఓట్లకు ఒక ఆస్పత్రి ఎందుకు ఉండదని ప్రశ్నించారు. ప్రతి వెయ్యి మందికి ఎందుకు మందులు అందుబాటులో ఉండవని అన్నారు. రాబోయే బల్దియా ఎన్నికల్లో టీఆర్‌ఎస్ జెండా ఎగరేస్తామని, ప్రతి డివిజన్‌లో ఒక ఆసుపత్రి నిర్మిస్తామని చెప్పారు. 24/7 వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

# అధికారం కోసం రాజ్యాంగ వ్యవస్థల నిర్వీర్యం

- ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలి.. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి
- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్




**హైదరాబాద్ (జనంసాక్షి)** : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తోందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ.విజయరాఘవన్ విమర్శించారు. విపక్షాలను ఏకం చేసి ప్రజాస్వామిక హక్కులు, ప్రజల జీవనోపాధి పరిరక్షణకు పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్ పేరుతో నిజమైన ఓటర్లను జాబితాల నుంచి తొలగించే ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని, కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. యువతపై అణచివేత పెరిగేకొద్దీ పోరాటాలు మరింత తీవ్రతరం అవుతాయని హెచ్చరించారు. దర్యాప్తు సంస్థలను విపక్షాలపై అక్రమ కేసులకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. దేశ సమైక్యతకు భంగం కలిగిస్తున్నది కేంద్ర పాలకులేనని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గించడం, మణిపూర్ ఘర్షణలు, ఎన్నికల వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లడం ప్రమాదకరమన్నారు. ఓటర్ల తొలగింపు ప్రజాస్వామ్యంపై దాడి అని, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రాంతీయ పార్టీలతో సహా అన్ని శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ కూడా ఈ అంశంపై ఉద్యమించాలని కోరారు.

### కరువుపై రూ.50 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలి

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో ఏర్పడుతున్న కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం రూ. 50 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఆరుతడి పంటలకు గిట్టుబాటు ధరలు, పంటల రక్షణకు నిరంతర విద్యుత్ అందించాలని కోరారు. రేషన్‌పై ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం, 14 రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలని, ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచాలని, రైతు భరోసాను రెట్టింపు చేసి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. భూ ఆక్రమణలను అరికట్టి పేదలకు ప్రభుత్వ భూములు పంచాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. దసరా వేడుకల్లో కుల దురహంకార చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

## కొమురం భీమ్ వర్ధంతికి పటిష్ట ఏర్పాట్లు

- జోడేఘాట్‌లో ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ హరిత, ఎమ్మెల్యే కోవ లక్ష్మి



**కెరమెరి, అక్టోబర్ 23 (జనంసాక్షి)** : ఆదివాసీ పోరాటయోధుడు కొమురం భీమ్ 86వ వర్ధంతిని ఈ నెల 26న ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు. శుక్రవారం జోడేఘాట్ లోని కొమురం భీమ్ మ్యూజియం సమావేశ మందిరంలో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఐటీడీఏ పీఓ మంద మకరందుతో కలిసి వర్ధంతి ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జల్, జంగల్, జమీన్ నినాదంతో గిరిజన హక్కుల కోసం పోరాడిన కొమురం భీమ్ వర్ధంతికి పెద్ద సంఖ్యలో ఆదివాసీ ప్రజలు, గిరిజన సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున తాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, విద్యుత్, వైద్యం, ట్రాఫిక్, పార్కింగ్, భద్రత వంటి అంశాల్లో ఎలాంటి లోటు రాకుండా ముందస్తు ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కొమురం భీమ్ త్యాగం, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని, ఆదివాసీ సంస్కృతి, చరిత్రను పరిరక్షిస్తూ ఆయన ఆశయాలను భావితరాలకు అందించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# ఫుడ్ డెలివరీ ముసుగులో దందా!




**మంచాల (జనంసాక్షి)** : ఫుడ్ డెలివరీ బ్యాగుల ముసుగులో గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మహేశ్వరం ఎస్ఓటీ, మంచాల పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 1.1 కిలోల గంజాయి, ద్విచక్ర వాహనం, డిజిటల్ వేయింగ్ మెషిన్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అరకు ప్రాంతానికి చెందిన ప్రదీప్ నుంచి నిందితులు విజయవాడ కేంద్రంగా గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు సమాచారం. పోలీసుల నిఘా నుంచి తప్పించుకునేందుకు ఫుడ్ డెలివరీ సిబ్బంది తరహాలో స్విగ్గీ బ్యాగులను ఉపయోగించినట్లు తెలుస్తోంది. పరిచయమున్న వినియోగదారులకు గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. గంజాయిని తూకం వేసి చిన్న ప్యాకెట్ల రూపంలో విక్రయించేందుకు డిజిటల్ వేయింగ్ మెషిన్‌ను ఉపయోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఫుడ్ డెలివరీ ముసుగులో మత్తు పదార్థాలు సరఫరా చేస్తున్నారన్న సమాచారంతో నిఘా పెట్టిన మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులు, మంచాల పోలీసులతో కలిసి దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రధాన సరఫరాదారుగా పేర్కొంటున్న ప్రదీప్ ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితులతో సంబంధాలున్న వ్యక్తులు, గంజాయి కొనుగోలు చేస్తున్న వారి వివరాలపై దర్యాప్తు కొనసాగుతోంది. మంచాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు, ఈ వ్యవహారంలో ఇతరుల ప్రమేయంపై ఆరా తీస్తున్నారు. దర్యాప్తు పూర్తయితే మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే హామీని వ్యతిరేకిస్తున్నాం

- బీసీ-ఏ కులాల ఐక్యవేదిక

**నల్లగొండ రూరల్, అక్టోబర్ 23 (జనంసాక్షి)** : ముదిరాజ్ కులాన్ని బీసీ-డీ నుండి బీసీ-ఏలోకి మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని వ్యతిరేకిస్తున్నట్లు బీసీ-ఏ కులాల ఐక్యవేదిక నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. రవీంద్రభారతిలో పండుగ సాయన్న జయంతి వేడుకల సందర్భంగా ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే బీసీ-ఏ వర్గాలకు అమలవుతున్న 7 శాతం రిజర్వేషన్లను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ముదిరాజ్‌లకు అదనపు రిజర్వేషన్లు కల్పించాలనుకుంటే బీసీ-ఏకు వేరుగా ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని సూచించారు. గతంలో ఇలాంటి ప్రయత్నాలను న్యాయస్థానాలు కొట్టివేసిన విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. అమలు సాధ్యం కాని హామీలతో బీసీ కులాల మధ్య విభేదాలు సృష్టించవద్దని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కంది సూర్యనారాయణ, సింగం రాంమోహన్, లకడాపురం వెంకటేశ్వర్లు, నేలపట్ల సత్యనారాయణ, గుండు వెంకటేశ్వర్లు, యలిజాల వెంకన్న, తడం సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

- 4వ బెటాలియన్‌లో ఘనంగా బైక్ ర్యాలీ



**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 23 (జనం సాక్షి)** : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మామునూరులోని 4వ బెటాలియన్ లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు జెండా ఊపి ఈ ర్యాలీని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ భారీ బైక్ ర్యాలీ ఎజి-1 గేట్ నుండి ప్రారంభమై, మిల్స్ కాలనీ వరకు సాగింది. అక్కడి నుండి తిరిగి బొల్లికుంటలోని వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీ వరకు వెళ్లి, తిరిగి బెటాలియన్ ప్రాంగణానికి చేరుకుంది. ఈ బైక్ ర్యాలీ సందర్భంగా కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.... దేశ శాంతిభద్రతల రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. వారి స్మృత్యర్థం నిర్వహిస్తున్న ఈ వారోత్సవాల్లో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ బైక్ ర్యాలీని చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ పోలీస్ అమరవీరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజు, ఆర్ఐలుకార్తీక్,రాజ్ కుమార్, కృష్ణ ఆర్ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
24 అక్టోబర్ 2026

# గడ్డు కరువు ముంగిట దేశం

సంపాదకీయం

ఎల్‌నినో ప్రభావంతో దేశం మరో కఠిన పరీక్షను ఎదుర్కోబోతోంది. వర్షాలు కురవాల్సిన కాలంలో మేఘాలు ముఖం చాటేస్తే, అది కేవలం వాతావరణ మార్పుగా మిగలదు; పొలాల నుంచి వంటిళ్ల వరకు, గ్రామాల నుంచి నగరాల వరకు ప్రతి జీవితాన్నీ తాకే సంక్షోభంగా మారుతుంది. రాబోయే పది నెలలు దేశానికి మహా గండమేనన్న హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇది భయపెట్టడానికి కాదు, అప్రమత్తం చేయడానికే అని పాలకులు గుర్తించాలి.

భారత వ్యవసాయం ఇప్పటికీ రుతుపవనాల జూదమే. సాగుభూమిలో సగానికి పైగా వర్షాధారమే. నైరుతి రుతుపవనాలు బలహీనపడితే ఖరీఫ్ దిగుబడి దెబ్బతింటుంది; జలాశయాల్లో నిల్వలు తగ్గితే రబీకి నీళ్లు దొరకవు. వరి, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చెరకు, పత్తి వంటి పంటలపై ప్రభావం పడి ధరలు ఎగబాకే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఆహార ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న సామాన్యుడికి ఇది మరో భారం. గ్రామీణ ఆదాయాలు పడిపోతే, ట్రాక్టర్ల నుంచి సబ్బుల వరకు అన్ని రంగాల డిమాండ్ మందగించి ఆర్థిక వృద్ధికే బ్రేకులు పడతాయి.

తాగునీటి సంక్షోభం ఇంకా తీవ్రమైనది. భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాల్లో వేసవి రాకముందే బోర్లు ఎండిపోతాయి. పశుగ్రాసం కొరత రైతులను పశువులను అమ్ముకునే దుస్థితికి నెడుతుంది. ఉపాధి కోసం వలసలు పెరుగుతాయి. గత కరువుల అనుభవాలు చెప్పేదేమిటంటే, నష్టం మొదట పేదలకే, అందులోనూ కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు, మహిళలకు, పిల్లలకు ఎక్కువగా తగులుతుంది.

అయితే ఈసారి దేశం పూర్తిగా నిస్సహాయ స్థితిలో లేదు. ఆహారధాన్యాల నిల్వలు గణనీయంగా ఉన్నాయి. వాతావరణ అంచనాలు గతంకన్నా కచ్చితంగా అందుతున్నాయి. ఉపాధి హామీ పథకం, ప్రజా పంపిణీ వ్యవస్థ, నేరుగా నగదు బదిలీ వంటి సామాజిక భద్రత వలలు అందుబాటులో ఉన్నాయి. వీటిని సమయానికి, సమర్థంగా వినియోగించుకోవడమే అసలు సవాలు. ఉపాధి హామీ పనిదినాలను పెంచి, చెల్లింపులు ఆలస్యం కాకుండా చూడాలి. కరవు ప్రభావిత మండలాలను ముందుగానే గుర్తించి సహాయ చర్యలు ప్రారంభించాలి; నష్టం జరిగిన తర్వాత కమిటీలు వేయడం వల్ల ప్రయోజనం లేదు.

రైతులకు తక్షణ మార్గదర్శనం అవసరం. తక్కువ నీటితో పండే మిల్లెట్లు, పప్పుధాన్యాల వైపు మళ్లేలా విత్తనాలు, సలహాలు అందించాలి. పంటల బీమా పరిహారం త్వరగా, పారదర్శకంగా చేతికి అందాలి. విద్యుత్ సరఫరా, డీజిల్, ఎరువుల లభ్యతలో అంతరాయాలు లేకుండా చూడాలి. ధరల నియంత్రణ కోసం నిల్వల విడుదల, ఎగుమతి ఆంక్షలపై వివేకంతో కూడిన నిర్ణయాలు తీసుకోవాలి; అదే సమయంలో బ్లాక్ మార్కెట్, నిల్వల పేరిట జరిగే దోపిడీని కఠినంగా అరికట్టాలి.

దీర్ఘకాలిక దృష్టీ అంతే ముఖ్యం. ప్రతి కరువు తర్వాత చెరువుల పూడికతీత, వాటర్‌షెడ్ పనులు, భూగర్భ జల పునరుద్ధరణ గురించి మాట్లాడటం, వర్షం రాగానే మర్చిపోవడం మన అలవాటుగా మారింది. బిందు, తుంపర సేద్యాన్ని విస్తృతం చేయడం, నీటి వినియోగ సామర్థ్యం పెంచడం, పట్టణాల్లో వర్షపు నీటి సంరక్షణను తప్పనిసరి చేయడం వంటివి ఇకనైనా ప్రాధాన్యంగా మారాలి. వాతావరణ మార్పుల కారణంగా ఇలాంటి సంక్షోభాలు మరింత తరచుగా వచ్చే అవకాశం ఉందన్న వాస్తవాన్ని విధానకర్తలు విస్మరించరాదు.

ఈ పరీక్షలో రాష్ట్రాలు, కేంద్రం సమన్వయంతో పనిచేయాలి. రాజకీయ విభేదాలు సహాయ నిధుల విడుదలకు అడ్డంకి కారాదు. ప్రజలు కూడా నీటి వృథాను అరికట్టి, బాధ్యతగా వ్యవహరించాలి. ప్రకృతిని మనం అదుపు చేయలేం, కానీ సిద్ధంగా ఉండటం మన చేతుల్లోనే ఉంది. ముందస్తు ప్రణాళిక, పారదర్శక పాలన, బలహీన వర్గాలకు రక్షణ అనే మూడు సూత్రాలే ఈ పది నెలల గండాన్ని దాటించగలవు. ఎల్ నినో వస్తుంది, వెళ్తుంది; కానీ ఆ సమయంలో మనం చూపే సన్నద్ధతే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

# మాతృభాష పరిరక్షణకు మాటలు చాలవు - చేతలు కావాలి



మాతృభాష అనేది కేవలం మాట్లాడుకోవడానికి ఉపయోగించే సాధనం మాత్రమే కాదు . అది ఒక జాతి చరిత్రకు, సంస్కృతికి, ఆలోచనా విధానానికి, సామూహిక జ్ఞాపకాలకు జీవనాడి. ఒక భాష బలహీనపడితే దానితోపాటు ఒక సమాజపు అనుభవ సంపద, సృజనాత్మకత, సాంస్కృతిక వైవిధ్యం కూడా క్రమంగా క్షీణిస్తాయి. తెలుగు భాషను, సాహిత్యాన్ని, కళలను పరిరక్షించాలన్న ఆలోచనకు ఈ ప్రాథమిక సత్యమే పునాది కావాలి. భాషా ప్రాధాన్యం, మాతృభాషలో విద్య, తెలుగు సాహిత్య పరిరక్షణ వంటి అంశాలు ఆహ్వానించదగినవే. అయితే, భాషాభిమానాన్ని కేవలం ప్రశంసలకే పరిమితం చేయకుండా, ఆచరణలో ఫలితాలు సాధించే విధానాలుగా మార్చినప్పుడే వాటికి నిజమైన సార్థకత లభిస్తుంది.

తెలుగు భాషకు వెయ్యేళ్లకుపైగా విస్తరించిన సాహిత్య చరిత్ర ఉంది. నన్నయ, తిక్కన, ఎర్రనల మహాభారతం నుంచి వేమన పద్యాలు, గురజాడ రచనలు, ఆధునిక కవిత్వం, కథలు, నవలల వరకు తెలుగు సాహిత్యం సమాజ పరిణామాలను, ప్రజల ఆకాంక్షలను, సంఘర్షణలను ప్రతిబింబించింది. ఈ వారసత్వాన్ని కాపాడుకోవడం అంటే పాత రచనలను గ్రంథాలయాల్లో భద్రపరచడం మాత్రమే కాదు. వాటిని కొత్త తరాలకు పరిచయం చేయడం, సమకాలీన జీవితంతో అనుసంధానించడం, కొత్త రచనలకు ప్రోత్సాహం కల్పించడం కూడా. అవసరం. గత వైభవాన్ని పదేపదే గుర్తుచేసుకుంటూ వర్తమానంలో భాష ఎదుర్కొంటున్న సమస్యలను విస్మరిస్తే, వారసత్వ పరిరక్షణ కేవలం ఒక సంప్రదాయ ఆచారపు తంతుగా మిగిలిపోతుంది.

చిన్నయసూరి గొప్పతనం కేవలం ఆయన రచించిన గ్రంథాల సంఖ్యకు మాత్రమే పరిమితమైలేదు. తెలుగు భాషకు క్రమబద్ధమైన వ్యాకరణ రూపాన్ని అందించడం, గద్యరచనకు ఒక ప్రామాణిక శైలిని అభివృద్ధి చేయడం, విద్యార్థులకు భాషాబోధన సులభమయ్యేలా పాఠ్యగ్రంథాలను రూపొందించడం ఆయన కృషిలోని ప్రధానాంశాలు. 19వ శతాబ్దంలో జీవించిన ఆయన రచించిన 'బాలవ్యాకరణం', 'నీతిచంద్రిక' తెలుగు భాషా వికాసంలో విశేషమైన స్థానం సంపాదించాయి. 'పద్యానికి నన్నయ, గద్యానికి చిన్నయ' అనే లోకోక్తి ఆయన ప్రభావాన్ని తెలియజేస్తుంది. అయితే, ఆధునిక భాషాశాస్త్ర దృష్టితో ఆయన రచనలను పునఃపరిశీలించడం, వాటి చారిత్రక పరిమితులను గుర్తించడం కూడా అంతే అవసరం. ఒక మహనీయుడిని గౌరవించడం అంటే ఆయన రచనలను విమర్శకు అతీతంగా చూడటం కాదు. ఆయన సాధించిన విజయా లను అర్థం చేసుకుంటూనే, మారుతున్న సామాజిక పరిస్థితుల్లో భాషా పరిణామానికి అనుగుణంగా కొత్త అధ్యయనాలకు మార్గం వేయాలి. ఈ నేపథ్యంలో చిన్నయసూరి జీవితానికి సంబంధించిన కొన్ని వివరాలు ఇప్పటికీ స్పష్టంగా లేవన్న అంశం ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఆయన జీవిత విశేషాలను, సాహిత్య సేవలను సమగ్రంగా వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో చెన్నపురి తెలుగు అకాడమీ చొరవతో రూపొందుతున్న 'తెలుగు వ్యాకరణభేరి - పరవస్తు చిన్నయసూరి' గ్రంథం ఒక ముఖ్యమైన ప్రయత్నం. తూమాటి సంజీవరావు రచనకు, పరవస్తు నాగసాయి సూరి సహకారం తోడవడం ఈ కృషిలో భాగం. ఇటువంటి గ్రంథాల విలువ వాటిలోని ప్రశంసలతో కొలవలేం. ప్రాథమిక ఆధారాలు, పాత తాళ పత్రాలు, సమకాలీనుల రచనలు, గ్రంథాల ప్రచురణ చరిత్ర, భిన్నాభిప్రాయాల పరిశీలన ఎంత సమగ్రంగా ఉంటాయన్నదే వాటి పరిశోధనాత్మక విలువను నిర్ణయిస్తుంది.

చిన్నయసూరి వంటి వ్యక్తుల జీవితచరిత్రల రచనలో మరో సమస్య కూడా ఉంది. కాలక్రమంలో ప్రచారంలోకి వచ్చిన కథనాలు, ఆధారాలతో నిర్ధారించిన వాస్తవాలు ఒకదానితో ఒకటి కలిసిపోవడం వల్ల చరిత్రకూ పురాణీకరణకూ మధ్య సరిహద్దు చెరిగిపోయే ప్రమాదం కూడా ఉంది. ఆయన జనన, మరణ సంవత్సరాల విషయంలోనే వివిధ గ్రంథాల్లో భిన్నమైన వివరాలు కనిపిస్తాయి. అలాంటప్పుడు పరిశోధకులు అందుబాటులో ఉన్న ఆధారాలను పోల్చి, ఏది నిర్ధారిత సమాచారం, ఏది పరిశీలనకు నోచుకోవాల్సిన అంశమో స్పష్టంగా చెప్పాలి. తెలియని విషయాలను ఊహలతో నింపడం కంటే, అవి ఇంకా తెలియవని నిజాయితీగా అంగీకరించడం మెరుగైన చరిత్ర రచనకు సంకేతం. పుస్తక ప్రచురణకర్తలు, పరిశోధకులు ఈ ప్రమాణాలను పాటించినప్పుడే ఇటువంటి రచనలు భవిష్యత్తు తరాలకు విశ్వసనీయమైన ఆధారాలుగా నిలుస్తాయి.

అయితే, ఒక మహనీయుడి జీవితాన్ని పుస్తకంలో భద్రపరచడం మాత్రమే భాషా పరిరక్షణకు సరిపోదు. చిన్నయసూరి రచనలను నేటి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి. పాత గ్రంథాలకు సరళమైన వ్యాఖ్యానాలు, ఆధునిక తెలుగు వివరణలు, ఆంగ్ల అనువాదాలు రూపొందించాలి. ముద్రిత ప్రతులు దొరకని అరుదైన రచనలను డిజిటల్ రూపంలో ఉచితంగా చదివే సదుపాయం కల్పించాలి. విశ్వవిద్యాలయాలు, గ్రంథాలయాలు, పరిశోధనా సంస్థలు పరస్పరం సహకరించుకొని ప్రామాణిక డిజిటల్ భాండాగారాలను ఏర్పాటు చేయాలి. చిన్నయసూరి వ్యాకరణ సంప్రదాయాన్ని ఆధునిక భాషాశాస్త్రంతో పోల్చే పరిశోధనలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలి. భాషా వారసత్వం పట్ల గౌరవం పరిశోధనకు అడ్డంకి కాకూడదు; దానికి ప్రేరణ కావాలి.

విద్యారంగంలోనూ ఈ బాధ్యతను విస్మరించలేం. జాతీయ విద్యావిధానం-2020 ప్రకారం, సాధ్యమైన చోట కనీసం ఐదో తరగతి వరకు, ప్రాధాన్యంగా ఎనిమిదో తరగతి వరకు, అంతకంటే ఆపై కూడా మాతృభాష లేదా స్థానిక భాషలో బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని అనేక మంది మేధావులు గతంలోనే సూచించారు. యునెస్కో 2025లో విడుదల చేసిన భారత విద్యా నివేదిక కూడా పిల్లలు తమకు అర్థమయ్యే భాషలో నేర్చుకోవడం విద్యలో సమాన అవకాశాలకు, మెరుగైన అవగాహనకు కీలకమని స్పష్టం చేసింది. ఈ విధానాలను అమలు చేయడానికి తెలుగు మాధ్యమ పాఠశాలల్లో నాణ్యమైన పాఠ్యపుస్తకాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, ఆధునిక విజ్ఞానానికి సంబంధించిన తెలుగు పరిభాష, డిజిటల్ అభ్యసన వనరులు అవసరం. మాతృభాషలో చదివితే ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయనే అపోహను తొలగించడంతోపాటు, తెలుగు నేర్చుకున్న విద్యార్థులు ఆంగ్లంతో సహా ఇతర భాషల్లోనూ నైపుణ్యం సాధించేలా బహుభాషా విద్యను అభివృద్ధి చేయాలి.

తెలుగు పరిరక్షణలో ప్రభుత్వాల బాధ్యత కూడా కీలకమైనది. సాహిత్య అకాడమీలు, భాషా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, గ్రంథాలయాలకు తగిన నిధులు కేటాయించాలి. పురాతన గ్రంథాల సేకరణ, సంపాదకత్వం, అనువాదం, పరిశోధన, ప్రచురణకు కొరకు నిరంతర ప్రణాళికలు రూపొందించుకోవాలి. రచయితలకు, అనువాదకులకు, యువ పరిశోధకులకు పారదర్శకమైన ప్రోత్సాహకాలు కల్పించాలి. ప్రభుత్వ కార్యక్రమాల్లో తెలుగు వినియోగం బాగా పెరగాలి; న్యాయ, పరిపాలన, సాంకేతిక రంగాల్లో తెలుగులో సేవలు పొందే అవకాశాలను విస్తరించాలి. కేవలం తెలుగు భాషా దినోత్సవాలు నిర్వహించడం, మహనీయుల జయంతులు జరపడం, ప్రసంగాల్లో భాషా వైభవాన్ని కొనియాడడం వల్ల మాత్రమే ఆశించిన ఉత్తమ మార్పు రాదు. విధానాలు, నిధులు, అమలు, ఫలితాల సమీక్ష ఈ నాలుగింటికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలి.

చిన్నయసూరి వారసత్వం మనకు అందించే ప్రధాన సందేశం ఇదే. భాషను ప్రేమించడం అంటే దాని గతాన్ని మాత్రమే కీర్తించడం కాదు, వర్తమానంలో అమలు చేయడం, దాని భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయడం కూడా. ఆయన పేరుతో వెలువడే పుస్తకాలు పరిశోధనకు కొత్త తలుపులు తెరవాలి. ఆయన రచనలు పాఠకులకు చేరాలి. తెలుగు విద్యకు నూతన సాంకేతికత తోడవాలి. మాతృభాషను కంటికి రెప్పలా కాపాడుకోవాలన్న పిలుపు ఆచరణలోకి దిగినప్పుడే అర్థవంతమవుతుంది. సంస్కృతిని కాపాడేది స్మృతులు మాత్రమే కాదు, నిరంతర సృజన; భాషను బతికించేది నినాదాలు కాదు, దాని సజీవ వినియోగం. చిన్నయసూరికి నిజమైన నివాళి ఆయన విగ్రహాలకు పూలమాలలు వేయడంలో లేదు. ఆయన భాషా సేవను అధ్యయనం చేసి, తెలుగు భాషను భావితరాల జ్ఞానభాషగా తీర్చిదిద్దడంలో ఉంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# ఉత్పత్తి శాశ్వతం-కార్మికుడి ఉద్యోగం తాత్కాలికం



దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఆటోమొబైల్, బొగ్గు వంటి రంగాల్లో ఉత్పత్తి నిరంతరం కొనసాగుతోంది. పరిశ్రమలు లాభాలు ఆర్జిస్తున్నాయి. కానీ ఆ ఉత్పత్తికి పునాదిగా నిలిచే కార్మికుడి ఉద్యోగం మాత్రం రోజురోజుకూ అస్థిరమవుతోంది. కంపెనీలకు కార్మికుడి శ్రమ శాశ్వతంగా కావాలి; కార్మికుడికి మాత్రం శాశ్వత ఉద్యోగం ఇవ్వడానికి యాజమాన్యాలు సిద్ధంగా లేవు.ఆటోమొబైల్ రంగంలో దేశీయ, విదేశీ సంస్థలు సాధారణ ఉత్పత్తి పనులకే భారీ సంఖ్యలో కాంట్రాక్ట్, తాత్కాలిక కార్మికులను ఉపయోగిస్తున్నాయి. ఆటోమొబైల్ విడిభాగాల పరిశ్రమలో ఈ ఆధారపడటం మరింత ఎక్కువగా ఉంది. మారుతీ సుజుకి విషయంలో 2022-23లో మొత్తం ఉద్యోగుల్లో తాత్కాలిక కార్మికుల వాటా 71 శాతంగా ఉండగా, తరువాతి నాలుగేళ్లలో అది 87 శాతానికి పెరిగిందని అందుబాటులో ఉన్న గణాంకాలు పేర్కొంటున్నాయి.ఇదే ధోరణి బొగ్గు రంగంలోనూ కనిపిస్తోంది. బొగ్గు ఉత్పత్తి, ఓవర్‌బర్డెన్ తొలగింపు, రవాణా, యంత్రాల నిర్వహణ, వర్క్‌షాప్‌లు, ఇతర అనుబంధ పనుల్లో కాంట్రాక్ట్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారు. దేశ విద్యుత్, ఉక్కు, పారిశ్రామిక రంగాలకు అవసరమైన బొగ్గును వెలికితీసే పనిలో వారి శ్రమ అత్యంత కీలకం. అయినప్పటికీ అనేక మంది కాంట్రాక్ట్ కార్మికులకు శాశ్వత ఉద్యోగులకు లభించే స్థాయి వేతనాలు, సౌకర్యాలు, ఉద్యోగ భద్రత అందడం లేదన్నది కార్మిక సంఘాల ప్రధాన ఆందోళన.బొగ్గు గని కార్మికుడి పని సాధారణ ఉద్యోగం కాదు. భూగర్భంలోనైనా, ఓపెన్‌కాస్ట్ గనుల్లోనైనా ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేయాల్సి ఉంటుంది. దుమ్ము, శబ్దం, భారీ యంత్రాలు, పేలుళ్లు, కొండచరియలు, వృత్తిపరమైన ఆరోగ్య ప్రమాదాలు-ఇవన్నీ వారి రోజువారీ పనిలో భాగం. ఇలాంటి ప్రమాదకర పనిని చేసే కార్మికుడికి ఉద్యోగ భద్రత లేకపోవడం మరింత తీవ్రమైన విషయం.కాంట్రాక్ట్ కార్మికుడి సమస్య తక్కువ వేతనంతోనే ముగియదు. ఉద్యోగం ఎప్పుడు పోతుందో తెలియకపోవడం అతిపెద్ద సమస్య. కాంట్రాక్టర్ మారితే ఉద్యోగ పరిస్థితులు మారవచ్చు. కాంట్రాక్ట్ ముగిస్తే ఉపాధి కోల్పోవచ్చు. హక్కుల కోసం గొంతెత్తితే పని కోల్పోతామన్న భయం ఉంటుంది. ఈ పరిస్థితి కార్మికుడి బేరసారాల శక్తిని బలహీనపరుస్తుంది.ఒకే గనిలో, ఒకే ప్రదేశంలో, ఒకే ప్రమాదకర వాతావరణంలో పనిచేస్తున్న కార్మికుల మధ్య ఉద్యోగ హోదా ఆధారంగా వేతనాలు, సౌకర్యాలు, సామాజిక భద్రతలో వ్యత్యాసం ఉండటం తీవ్రమైన ప్రశ్న. బొగ్గు ఉత్పత్తి విలువైనదైతే, ఆ బొగ్గును వెలికితీసే కార్మికుడి శ్రమ కూడా అంతే విలువైనదిగా గుర్తించాలి.కాంట్రాక్ట్ కార్మిక వ్యవస్థను నియంత్రించేందుకు 1970లో చట్టం తీసుకొచ్చినా, శాశ్వత స్వభావం ఉన్న పనుల్లో కూడా కాంట్రాక్ట్ కార్మికుల వినియోగం కొనసాగుతోందనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలు కూడా కాంట్రాక్ట్ విధానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తున్న పరిస్థితిలో, చట్టాల అమలు, కార్మికుల హక్కుల పరిరక్షణపై మరింత అవసరం.ఆటోమొబైల్ ఫ్యాక్టరీలో కారు తయారు చేసే కార్మికుడైనా, బొగ్గు గనిలో దేశానికి ఇంధనాన్ని అందించే కార్మికుడైనా సమస్య ఒకటే-శ్రమ శాశ్వతం, కానీ ఉద్యోగం తాత్కాలికం. పరిశ్రమల ఉత్పత్తి లక్ష్యాలు పెరుగుతున్న కొద్దీ కార్మికులపై పని ఒత్తిడి పెరుగుతుంది. కానీ వారి వేతనాలు, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత అదే స్థాయిలో పెరగకపోతే పారిశ్రామిక అభివృద్ధి ఎవరి కోసం అన్న ప్రశ్న తలెత్తుతుంది. అందువల్ల శాశ్వత స్వభావం ఉన్న పనులకు కాంట్రాక్ట్ కార్మికుల వినియోగాన్ని కఠినంగా నియంత్రించాలి. దీర్ఘకాలంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పరిస్థితిని సమీక్షించి, న్యాయబద్ధమైన శాశ్వతీకరణ విధానం రూపొందించాలి. సమాన పనికి సమాన వేతనం, సామాజిక భద్రత, సురక్షితమైన పని పరిస్థితులు, చట్టబద్ధమైన ప్రయోజనాలు అందేలా ప్రభుత్వాలు పర్యవేక్షించాలి.బొగ్గు గనుల్లో ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు భద్రతా ప్రమాణాలు మరింత కఠినంగా అమలు చేయాలి. ప్రమాదం జరిగిన తర్వాత పరిహారం కోసం ఎదురు చూసే పరిస్థితి కాకుండా, ప్రమాదం జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు ఉండాలి.ఉత్పత్తి శాశ్వతమైనప్పుడు కార్మికుడి ఉద్యోగం ఎందుకు తాత్కాలికం? దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకైన కార్మికుడి హక్కులు ఎందుకు కాంట్రాక్టుకు పరిమితం కావాలి? అనే ప్రశ్న తలెత్తుతుంది



ఆళవందార్ వేణు మాధవ్
8686051752,హైదరాబాద్

# ఎల్‌నినో ముప్పు.. జలభద్రతకు చెరువులే రక్ష!

**వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అస్థిర వర్షపాతం నేపథ్యంలో గ్రామీణ జలవనరుల పరిరక్షణ అత్యవసరం**



వాతావరణ మార్పులు ప్రపంచవ్యాప్తంగా నీటి వనరుల నిర్వహణకు కొత్త సవాళ్లు విసురుతున్నాయి. ఎల్‌నినో ప్రభావాలు, అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో హెచ్చుతగ్గులు వ్యవసాయంతోపాటు తాగునీటి సరఫరాపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎల్‌నినో ఏర్పడిన ప్రతిసారీ తెలంగాణలో కచ్చితంగా కరవు వస్తుందని చెప్పలేం. అయినప్పటికీ దాని ప్రభావాలు, వాతావరణ మార్పుల వల్ల పెరుగుతున్న అనిశ్చితిని దృష్టిలో ఉంచుకొని నీటి వనరుల సంరక్షణకు ముందస్తు ప్రణాళిక అవసరం.

అధిక ఉష్ణోగ్రతలతో నీటి ఆవిరీకరణ పెరిగే అవకాశం ఉంది. వర్షాలు ఆలస్యంగా కురవడం, దీర్ఘకాలిక విరామాలు ఏర్పడటం లేదా తక్కువ సమయంలో భారీ వర్షాలు కురవడం వంటి పరిస్థితులు నీటి నిల్వల నిర్వహణను క్లిష్టతరం చేస్తాయి. వర్షం కురిసినప్పుడు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం లేకపోతే, విలువైన వర్షపు నీరు వాగులు, కాలువల ద్వారా వేగంగా బయటకు వెళ్లిపోతుంది. మరోవైపు వర్షాలు తగ్గినప్పుడు చెరువులు, బావులు, బోరుబావుల్లో నీటి లభ్యత పడిపోవచ్చు.

**తాగునీటి భద్రతకు ముందస్తు చర్యలు**

నీటి కొరత తీవ్రతరమైతే గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ప్రధాన సమస్యగా మారుతుంది. బోరుబావులపై అధికంగా ఆధారపడే గ్రామాల్లో భూగర్భ జలాలు తగ్గిపోతే ప్రజలు దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. వేసవిలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడం వంటి తాత్కాలిక చర్యలతోపాటు, దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి పెట్టాలి. గ్రామాల వారీగా తాగునీటి వనరులను గుర్తించడం, వాటి నీటి మట్టాలు, నాణ్యతను పర్యవేక్షించడం, లీకేజీలను అరికట్టడం, వర్షపు నీటిని ఒడిసిపట్టే నిర్మాణాలను అభివృద్ధి చేయడం అవసరం.

చెరువుల పునరుద్ధరణతో జలవనరులకు బలం

తెలంగాణలోని గ్రామీణ చెరువులు వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంలో, కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాల పునర్భరణకు తోడ్పడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. పూడిక తొలగింపు, కట్టలు, తూములు, మత్తడుల మరమ్మతులు, నీరు చేరే కాలువల పునరుద్ధరణతో చెరువుల పనితీరును మెరుగుపరచవచ్చు. కాకతీయుల గొలుసుకట్టు చెరువుల వ్యవస్థను సమగ్రంగా పరిశీలించి, ఎగువ నుంచి దిగువకు నీటి ప్రవాహం సజావుగా సాగేలా చర్యలు చేపట్టాలి. చెరువు భూముల ఆక్రమణలను అరికట్టి, సహజ నీటి ప్రవాహ మార్గాలను పరిరక్షించాలి.

అయితే చెరువులను లోతు చేయడం ఒక్కటే నీటి సంక్షోభానికి పరిష్కారం కాదు. వర్షపు నీరు చెరువులకు చేరేలా చూడటం, నీటి నాణ్యతను కాపాడటం, భూగర్భ జలాల వినియోగాన్ని నియంత్రించడం, పంటల ఎంపికలో నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకోవడం కూడా అంతే ముఖ్యం. చెరువు మట్టిని రైతులకు అందించే ముందు నాణ్యత పరీక్షలు నిర్వహించాలి. తాగునీటి వనరులు కలుషితం కాకుండా ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలి.

**చెరువు మట్టి రైతులకు వరం కావాలి**

చెరువుల్లో పేరుకున్న మట్టిని పరీక్షించి, వ్యవసాయానికి అనుకూలంగా ఉన్నదాన్ని రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి. నేల స్వభావాన్ని బట్టి ఈ మట్టి భూసారాన్ని, నేల నిర్మాణాన్ని మెరుగుపరచడానికి తోడ్పడవచ్చు. అయితే ప్రతి చెరువు మట్టి ఒకే విధంగా ఉండదు. అందువల్ల పరీక్షలు నిర్వహించిన తర్వాతే పొలాల్లో వినియోగించాలి. మట్టిని తరలించే విధానం పారదర్శకంగా ఉండాలి. రవాణా ఖర్చులు రైతులకు భారంగా మారకుండా స్థానికంగా తగిన ఏర్పాట్లు చేయాలి.

చెరువుల పునరుద్ధరణతో భూగర్భ జలాల పునర్భరణకు అనుకూల పరిస్థితులు ఏర్పడవచ్చు. బావులు, బోరుబావుల్లో నీటి లభ్యతకు తోడ్పడటంతోపాటు పశువులకు నీరు, మత్స్యకారులకు ఉపాధి వంటి ప్రయోజనాలూ కలగవచ్చు. అయితే ఈ ఫలితాలు చెరువులోకి చేరే నీరు, నేల స్వభావం, స్థానిక భౌగోళిక పరిస్థితులు, నీటి వినియోగంపై ఆధారపడి ఉంటాయి. అందుకే ప్రతి ప్రాంతానికి అనుగుణంగా చర్యలు చేపట్టాలి.

**సంక్షోభం వచ్చిన తర్వాత కాదు.. ముందే కార్యాచరణ**

ఎల్‌నినో ప్రభావాలు ఎలా ఉన్నా, వాతావరణ పరిస్థితులు ఏ దిశగా మారినా ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. అందుకు ప్రతి గ్రామానికి నీటి భద్రత ప్రణాళిక రూపొందించాలి. చెరువులు, కుంటలు, బావులు, వర్షపు నీటి నిల్వ వ్యవస్థల స్థితిని అంచనా వేసి, అవసరమైన పనులకు ప్రాధాన్య క్రమంలో నిధులు కేటాయించాలి. గ్రామ పంచాయతీలు, సంబంధిత శాఖలు, రైతులు, మహిళా సంఘాలు, స్థానిక ప్రజలు సమన్వయంతో పనిచేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

వర్షాభావం వచ్చినప్పుడు మాత్రమే నీటి సమస్యపై దృష్టి పెట్టడం కాకుండా, వర్షాలు కురిసే కాలంలో ప్రతి చుక్కను నిల్వ చేసుకునేలా చర్యలు చేపట్టాలి. వాతావరణ మార్పులను పూర్తిగా నియంత్రించలేకపోయినా, వాటి ప్రభావాలను తగ్గించుకునే సన్నద్ధత మన చేతుల్లోనే ఉంది. నీటి వనరులను కాపాడటం, వర్షపు నీటిని సంరక్షించడం, అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించడం ద్వారా భవిష్యత్తు సంక్షోభ తీవ్రతను తగ్గించవచ్చు.

చెరువులను కాపాడటం అంటే కేవలం వ్యవసాయానికి నీరందించడం కాదు; తాగునీటి భద్రతను బలోపేతం చేయడం, గ్రామీణ జీవనోపాధులను రక్షించడం, భూగర్భ జలాలను సంరక్షించడం కూడా. ఎల్‌నినో, అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాత అనిశ్చితి వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు తాత్కాలిక ఉపశమన చర్యలకంటే శాశ్వత జలవనరుల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలి. చెరువు బతికితే గ్రామానికి నీటి భరోసా ఉంటుంది; నీటి భరోసా ఉంటేనే వ్యవసాయం, గ్రామీణ జీవితం సుస్థిరంగా కొనసాగుతాయి.

చెరువుల పునరుద్ధరణ అనేది కేవలం నీటి నిల్వ పెంపు కార్యక్రమం కాదు. అది రైతుకు భరోసా, గ్రామీణ ఉపాధికి అండ, భూగర్భ జలాలకు రక్షణ, పర్యావరణ సమతుల్యతకు పునాది. వర్షాభావాన్ని సంక్షోభంగా మాత్రమే కాకుండా జలవనరుల పునరుద్ధరణకు వచ్చిన అవకాశంగా ప్రభుత్వం వినియోగించుకోవాలి. కాకతీయుల జలవనరుల నిర్వహణ స్ఫూర్తిని ఆధునిక శాస్త్రీయ పద్ధతులతో అనుసంధానించి అమలు చేయాలి. చెరువు బతికితే గ్రామం బతుకుతుంది; గ్రామం బతికితే వ్యవసాయం బతుకుతుంది. తెలంగాణ భవిష్యత్తుకు జలభద్రత కల్పించాలంటే గ్రామీణ చెరువుల పరిరక్షణకు ఇప్పుడే కార్యాచరణ మొదలుకావాలి.



-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## బొద్దింకల భారతం



ఇవి నిరుపేద
కట్టెపొయ్యినుండి
దౌర్జన్యంగా దోచుకొని
ధన దాహపు వంట
గదులలో గుట్టుగా
దాచిపెట్టిన
దోపిడి ధాన్యాన్ని బయటకు
ఈడ్చుకొచ్చే బొద్దింకలు
పసిపిల్లల పాఠశాలల్లో
మరుగుదొడ్ల మల మూత్రపు నాణేలను
ప్రసాదంలా పంచుకునే ధర్మ రక్షణ అవతారపు
పొగరుబోతు పందికొక్కులను తరిమికొట్టే బొద్దింకలు
కోట్ల ఓటు కాగితాలను చెత్తకుండీలకు చేరవేస్తే
ఛలో నడు ఢిల్లీ అంటూ వెన్నులో వణుకు పుట్టించి
ఎన్నికల అక్రమాలు వెలికితీసిన బొద్దింకలు
చీకట్లో చలాకీగా చైతన్యంతో నడుచుకుంటూ ఢిల్లీ
గల్లీల్లో చేరి
మనువాదపు మదము అణచి మానవత్వపు గుడ్లు
పెట్టే మేలు జాతి బొద్దింకలు
అర్బన్ నక్సలంటూ అడ్డగించి అణచివేస్తే
బారికేడ్ల అంతుచూసి గొంతెత్తి నినదించి
గెలుపు రక్తంతో దేహమంతా ఎరుపెక్కిన బొద్దింకలు
అధికారపు బకాసురులు మత హింసను ఆరగిస్తే
అంధ భక్తి బంధువులకు అర్థవంతంగా వివరించి
రాజ్యాంగ రక్షణ రణంలో రాజకీయ రాక్షసులకు
ఆస్తమా తెప్పించిన యువ భారత బొద్దింకలు.



నేపా సంతోష్ అచ్యుత్
కుమార్,
అసిస్టెంట్ ప్రొఫెసర్,
కాళోజీ ప్రతిభా పురస్కార
గ్రహీత
8639442397.

## నేరాల కట్టడికి పోలీసుల ఉక్కుపాదం..

- ఉప్పల్‌లో విస్తృత తనిఖీలు
- ఎన్‌జీఆర్‌ఐ మెట్రో స్టేషన్ వద్ద నాకాబందీ



**ఉప్పల్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజలకు మెరుగైన భద్రత కల్పించడమే లక్ష్యంగా మల్కాజిగిరి పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఆపరేషన్ సీల్–ఎంలో భాగంగా ఉప్పల్‌లోని ఎన్‌జీఆర్‌ఐ మెట్రో స్టేషన్ వద్ద పోలీసులు నాకాబందీ నిర్వహిస్తూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రధాన రహదారులపై రాకపోకలు సాగించే వాహనాలను ఆపి అవసరమైన వివరాలను పరిశీలిస్తూ తనిఖీలను ముమ్మరం చేశారు. నేరాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా ఉంచేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రహదారులపై ప్రయాణించే వాహనదారుల వివరాలను పరిశీలిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించారు. నేరాల నియంత్రణలో భాగంగా చేపట్టిన ఈ తనిఖీల ద్వారా ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు. మల్కాజిగిరి పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆపరేషన్ సీల్–ఎంలో భాగంగా చేపట్టిన నాకాబందీ, వాహన తనిఖీలు స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారు.

### నేరాల నియంత్రణకు నిరంతర నిఘా

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అదే సమయంలో నేరాలకు పాల్పడే వ్యక్తుల కదలికలను గుర్తించేలా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో భద్రతను పటిష్ఠం చేసే చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆపరేషన్ సీల్–ఎంలో భాగంగా పోలీసుల తనిఖీలు నేరాల నియంత్రణకు దోహదపడనున్నాయి.

## రాష్ట్ర ప్రగతిలో ఎస్పీఎఫ్ కీలక పాత్ర

- ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క
- అమీన్‌పూర్‌లో ఘనంగా ఎస్పీఎఫ్ ఆవిర్భావ వేడుకలు

**అమీనపూర్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రగతిలో తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం (ఎస్పీఎఫ్) కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం అమీన్పూర్ ఎస్పీఎఫ్ శిక్షణ కేంద్రంలో ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లక్రా ఆధ్వర్యంలో ఎస్పీఎఫ్ 36వ ఆవిర్భావ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన గౌరవ పోలీసు వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కీలక ప్రభుత్వ సంస్థలకు భద్రత కల్పిస్తూ, వాటి నిరంతరాయ కార్యకలాపాలకు విశేష సేవలందిస్తున్న ప్రత్యేక రక్షణ దళం అధికారులు, సిబ్బందికి 36వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 1991 అక్టోబర్ 23న ఏర్పాటైన తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం, ప్రస్తుతం రాష్ట్రంలోని 67 కీలక సంస్థలకు దాదాపు 2 వేల మంది సిబ్బందితో భద్రత కల్పిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ఇళ్లలో వెలుగులు నింపే విద్యుత్ కేంద్రాలను కాపాడటంలో భద్రతా సిబ్బంది కృషి వెలకట్టలేనిదని కొనియాడారు.

### 'ప్రగతికి రక్షణ' నినాదం ఎంతో అర్థవంతమైనది

'ప్రగతికి రక్షణ' అనే ఎస్పిఎఫ్ నినాదం రాష్ట్ర అభివృద్ధిలో భద్రత



ప్రాధాన్యతను చాటిచెబుతోందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థల భవనాలను కాపాడటమే కాకుండా, వాటి ద్వారా అందే సేవలకు భరోసా కల్పించడం, ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడం కూడా భద్రతా వ్యవస్థ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజల్లో భయాన్ని కలిగించడం కాదు.. భరోసా కల్పించడమే మంచి భద్రతా వ్యవస్థ లక్ష్యంగా ఉండాలని సూచించారు.

ప్రస్తుతం డ్రోన్లు, కృత్రిమ మేధ, సైబర్ సాంకేతికత వంటి రంగాల్లో వస్తున్న మార్పులు భద్రతా వ్యవస్థలకు కొత్త సవాళ్లను విసురుతున్నాయని భట్టి విక్రమార్క అన్నారు. ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు భద్రతా సిబ్బందికి శారీరక దృఢత్వంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరమని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నిరంతర శిక్షణ అందించడం ద్వారా భద్రతా వ్యవస్థలను మరింత పటిష్టం చేయాలని సూచించారు. అమీన్‌పూర్‌లో ప్రత్యేక శిక్షణ అకాడమీ ఉండటం సంతోషకరమని పేర్కొంటూ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సిబ్బంది వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. భద్రతా విధుల్లో ఆయుధాల వినియోగం ఎంత ముఖ్యమో, క్రమశిక్షణ, నిజాయితీ, బాధ్యత, అప్రమత్తత కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. సిబ్బంది సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని తెలిపారు. తెలంగాణను సురక్షితమైన, సమృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రత్యేక రక్షణ దళం సేవలు మరింత కీలకమని పేర్కొంటూ, రాష్ట్రంలోని కీలక సంస్థలతో పాటు తెలంగాణ ప్రగతిని కాపాడుతున్న ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది భవిష్యత్తులోనూ ఇదే అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా భద్రత సిబ్బంది చేసిన విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి షికా గోయల్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీఎఫ్ వ్యవస్థాపక డిజి (విశ్రాంత అధికారి) స్వర్ణజిత్సేన్, మాజీ డిజీ తేజ్ దీప్ కౌర్, ఎస్పీఎఫ్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ త్రినాథ్, వైస్ ప్రిన్సిపల్ కృష్ణయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్విగ్గీ, జోమాటోలో గంజాయి దందా..

- రూటు మార్చిన గంజాయి వ్యాపారం
- ప్రముఖ సంస్థల లేబుల్స్ వాడకం
- డోర్ డెలివరీ చేస్తున్న ఇద్దరి అరెస్ట్
- విజయవాడ టూ హైదరాబాద్‌కు
- గుట్టుచప్పుడు కాకుండా అక్రమ రవాణా
- డిజిటల్ వేయింగ్ మెషిన్‌తో తూకం వేసి విక్రయాలు
- మహేశ్వరం ఎస్ఓటీ, మంచాల పోలీసుల సంయుక్త దాడి




**రంగారెడ్డి, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** ఆహారాన్ని అందించాల్సిన ఫుడ్ డెలివరీ బ్యాగులు ఇప్పుడు మత్తు పదార్థాలను చేరవేసే అస్త్రాలుగా మారుతున్నాయి. స్విగ్గీ, జోమాటో వంటి ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థల ముసుగులో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న భారీ గంజాయి దందా గుట్టును ఫ్యూచర్ సిటీ పోలీసులు రట్టు చేశారు. మహేశ్వరం ఎస్ఓటీ, మంచాల పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఇద్దరు నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్ చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లోని అరకు ప్రాంతానికి చెందిన ప్రదీప్ అనే ప్రధాన నిందితుడి నుంచి ఈ ముఠా విజయవాడ కేంద్రంగా గంజాయిని కొనుగోలు చేస్తోంది. అక్కడి నుంచి ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా హైదరాబాద్ నగర శివారు ప్రాంతాలకు తరలిస్తున్నారు. పోలీసుల నిఘాను తప్పించుకునేందుకు ఏకంగా ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థలైన స్విగ్గీ, జోమాటోల డెలివరీ బ్యాగులను, బైక్‌లను సాధనంగా ఎంచుకున్నారు. ఫుడ్ బాయ్స్‌లా దుస్తులు ధరించి, బ్యాగులు వేసుకుని కాలనీల్లో దర్జాగా తిరుగుతూ.. తమ నెట్‌వర్క్‌లోని కస్టమర్ల గుమ్మం వద్దకు నేరుగా గంజాయిని డోర్ డెలివరీ చేస్తున్నారు.

### డిజిటల్ వేయింగ్ మెషిన్‌తో తూకం..

ఈ అక్రమ వ్యాపారాన్ని అత్యంత ప్రొఫెషనల్‌గా నిర్వహిస్తున్నారు నిందితులు.. తమ వద్దే ఒక డిజిటల్ వేయింగ్ మెషిన్‌ను ఉంచుకుంటున్నారు. కస్టమర్ అడిగిన పరిమాణాన్ని బట్టి అక్కడికక్కడే తూకం వేసి ప్యాకెట్లు కట్టి చేరవేస్తున్నారు. ఈ వ్యాపారం ఒక చైన్ సిస్టంలా కొనసాగుతుంది పల్లె, ఆలయ తేడా లేకుండా మారుమూలపల్లె గల్లి గల్లికి చేరుతుంది. అమాయక యువకులను టార్గెట్గా తీసుకొని నీ వద్దకు బానిసలను చేస్తున్నాను. లాబార్జనే ధ్యేయంగా వ్యాపారులు తెగిస్తున్నారు.

### నిఘా పెట్టి పక్కాగా దెబ్బ కొట్టిన పోలీసులు..

నగర శివారు ప్రాంతాల్లో ఫుడ్ డెలివరీ ముసుగులో అసాధారణ కార్యకలాపాలు జరుగుతున్నట్లు మహేశ్వరం ఎస్ఓటీ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో వారు ప్రత్యేక నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో మంచాల పోలీసులతో కలిసి ఉమ్మడిగా నిర్వహించిన దాడిలో నిందితులు గోద్మురు సుకేష్ బాబు(28), గంటపోగు రవి(29) పోలీసులకు చిక్కారు. ఈ రాకెట్‌కు ప్రధాన మూలమైన సరఫరాదారు ప్రదీప్ ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

### స్వాధీనం చేసుకున్న సొత్తు..

నిందితుల వద్ద నుంచి పోలీసులు 1.1 కిలోల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం (బైక్), డిజిటల్ వేయింగ్ మెషిన్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై మంచాల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ రాకెట్‌కు ప్రధాన మూలమైన సరఫరాదారు ప్రదీప్ ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. అలాగే, ఈ ముఠా నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్న రెగ్యులర్ వినియోగదారుల నెట్‌వర్క్‌ను గుర్తించేందుకు మొబైల్ కాల్ డేటా ఆధారంగా లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు.

## దళితుడిపై దాడిని ఖండించిన ఎమ్మార్పీఎస్

- భాస్కర్‌ను పరామర్శించిన ఎమ్మార్పీఎస్ నాయకులు



**చేవెళ్ల, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** చేవెళ్ల మండల పరిధిలో దళితుడైన భాస్కర్‌పై జరిగిన దాడిని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) తీవ్రంగా ఖండించింది. దాడికి గురైన భాస్కర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకుల బృందం పరామర్శించి, ఆయనకు అండగా ఉంటామని భరోసా కల్పించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళితులపై దాడులకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భాస్కర్‌పై దాడికి పాల్పడిన నిందితులను పోలీసులు వెంటనే అరెస్టు చేసి, బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును నీరుగార్చే ఉద్దేశంతో కౌంటర్ కేసులు పెట్టే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. బాధితుడిని భయభ్రాంతులకు గురిచేయడం, కేసు దర్యాప్తును ప్రభావితం చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌంటర్ కేసు తప్పుడు ఉద్దేశంతో నమోదు చేసినట్లు తేలితే బాధ్యులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దళితులపై దాడులు జరిగినప్పుడు బాధితులకు అండగా నిలబడి, వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేయడం ఎమ్మార్పీఎస్ బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. దళితులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. భాస్కర్‌పై దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని, లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. బాధితుడికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటన్పోల్ల నరసింహ మాదిగ, ఎంఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షులు రావుగల్ల బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కాడిగల్ల ప్రవీణ్ కుమార్ మాదిగ, ఊరెంట ప్రవీణ్, చేవెళ్ల మండల అధ్యక్షులు కొండాపూర్ మల్లేష్, శంకర్‌పల్లి మండల అధ్యక్షులు లింగం సాయి, మొయినాబాద్ మండల అధ్యక్షులు రామగల్ల కుమార్, షాబాద్ మండల అధ్యక్షులు మల్కి ప్రవీణ్, మాజీ మండల అధ్యక్షులు కొడిగారి మహేందర్‌తో పాటు రవి, ఈదులపల్లి రాములు మాదిగ, మల్లికార్జున్, వెంకటేష్, కృష్ణ, రాజేందర్, విజయ్, కుమార్, చింటూ, వినోద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వనస్థలిపురంలో జోయాలుక్కాస్ డైమండ్ జ్యువెలరీ షో ప్రారంభం



**హయత్ నగర్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** వనస్థలిపురంలోని జోయాలుక్కాస్ షోరూమ్‌లో 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' ప్రారంభమైంది. ఈ ప్రదర్శనలో వివాహ వేడుకలకు ప్రత్యేకంగా రూపొందించిన ఆభరణాల సెట్లు, ఆధునిక డిజైన్లతో కూడిన వజ్రాభరణాలను వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. అక్టోబర్ 23 నుంచి పరిమిత కాలం పాటు ఈ ప్రదర్శన కొనసాగనుంది. ఈ సందర్భంగా రూ.లక్ష లేదా అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభరణాలను కొనుగోలు చేసే వినియోగదారులకు ఉచితంగా బంగారు నాణెం అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. వివాహాలు, ప్రత్యేక వేడుకలకు అనువైన విభిన్న డిజైన్లలో ఆభరణాలను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

## తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి

- ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి
- సీఐటీయూ డిమాండ్

**హయత్‌నగర్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** దేశవ్యాప్తంగా తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల అఖిల భారత కమిటీల పిలుపులో భాగంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్బీనగర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించి, ఎన్నికల ప్రధాన అధికారి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జాజాల రుద్రకుమార్, సీఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా కోశాధికారి కవిత మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 13 కోట్ల 37 లక్షల ఓట్లు తొలగించబడ్డాయని, తెలంగాణ రాష్ట్రంలోనూ పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించారని ఆరోపించారు. రంగారెడ్డి జిల్లాలో కూడా ఓట్ల తొలగింపు జరిగిందని పేర్కొంటూ, తొలగించిన ఓట్లన్నింటినీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన పేద ప్రజల ఓట్లను తొలగిస్తోందని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని పేర్కొన్నారు. తొలగించిన ఓట్లను గతంలో ఉన్న విధానంలోనే పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని సీఐటీయూ నాయకులు విమర్శించారు.



ఆయన వెంటనే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో రాజీనామా చేసే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మల్లెపాక వీరయ్య, హయత్‌నగర్ సర్కిల్ కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య, మత్స్య కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు తడబోయిన కృష్ణమూర్తి, ఎల్బీనగర్ అడ్డా అధ్యక్షుడు సీహెచ్ మున్నా, కార్యదర్శి లాట్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు గంగరాజు, సహాయ కార్యదర్శి లింగయ్య, కోశాధికారి ఆంధ్ర శీను, పి. జోసెఫ్, భాస్కర్, ఈ. ఎల్లయ్య, వెంకన్న, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు. అడ్డా కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఈత కోసం వెళ్లి ఇద్దరు విద్యార్థుల దుర్మరణం

- కర్ణాటక రాష్ట్రం కుంచారం గ్రామానికి చెందినవారుగా గుర్తింపు
- బోపునారం గ్రామ క్వారీలో ఘటన
- బంటారం పోలీసుల విచారణ

**వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 23 (జనం సాక్షి) :** దసరా పండుగకు ముందు సెలవులు వచ్చాయంటే చాలు.. ఏదో ఒక కుటుంబంలో విషాదం చోటు చేసుకుంటుంది. సరదా కోసం ఈతకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు క్వారీలో ఉన్న నీటిలో మునిగి మృత్యువాత పడ్డారు. పండగ తర్వాత సంతోషంగా ఉన్న ఇంట్లో విషాదాన్ని మిగిల్చింది. వికారాబాద్ జిల్లా బంట్వారం మండల పరిధిలో శుక్రవారం నాడు తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని బొపునారం గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న ఒక మైనింగ్ క్వారీలో ఈత కోసం వెళ్లి ఇద్దరు విద్యార్థులు నీటి లో మునిగి మృతి చెందారు. వీరు కర్ణాటక రాష్ట్రం కుంచారం గ్రామానికి చెందిన సురేందర్ (14) అజయ్(13) వారుగా బంటారం పోలీసులు గుర్తించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుంచారంలో సురేందర్ 9వ తరగతి అజయ్ 8వ తరగతి చదువుతున్నారు. వీరికి దసరా సెలవులు రావడంతో సరదాగా ఈత కోసం తెలంగాణ రాష్ట్రం బోపునారం గ్రామంలో ఉన్న క్వారీల లో ఈతకు వెళ్లి నీటిలో మునిగి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే చుట్టుపక్కల ప్రజలు ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. మైనింగ్ క్వారీలు ఉన్న ప్రాంతంలో తగిన భద్రతా చర్యలు లేకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారిని కర్ణాటక రాష్ట్రంలోని కుంచారం గ్రామానికి చెందిన వ్యక్తులుగా స్థానిక వర్గాలు ప్రాథమికంగా గుర్తించాయి. అయితే వారు ఈ ప్రాంతానికి ఏ పనిపై వచ్చారు, అసలు ఆ మైనింగ్ క్వారీ లోపలికి ఎందుకు వెళ్ళాల్సి వచ్చింది అనే విషయాలపై ప్రస్తుతం స్పష్టత రాలేదు. సదరు వ్యక్తులు క్వారీ వద్ద నడుచుకుంటూ వెళు ండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడ్డారా లేదా ఏదైనా ఇతర కారణాలు ఉన్నాయా అనే కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్వారీ లోతు ఎక్కువగా ఉండటంతో పాటు నీరు చేరి ఉండటంతో ప్రమా తీవ్రత పెరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే బోపునారం శివారులోని మైనింగ్ క్వారీ వద్దకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను వెలికితీసేందుకు



చర్యలు చేపట్టిన పోలీసులు, వాటిని పంచనామా నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో సమగ్ర విచారణ ప్రారంభించారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు కర్ణాటక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని బంటారం ఎస్సై పుండ్లిక్ సేకరిస్తున్నారు. మృతుల తల్లి రాములమ్మ నుంచి పోలీసులు ఫిర్యాదు తీసుకునే అవకాశం ఉంది. దర్యాప్తు జరుగుతుంది.

## చర్లపల్లి డివిజన్ అభివృద్దే లక్ష్యం..

- మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్

**కాప్రా, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** చర్లపల్లి డివిజన్ అభివృద్ధి తమ దయమని మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్ కాలనీలో కాలనీవాసులతో కలిసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీ చాలా కాలంగా ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలకు ఈ నూతన పైప్‌లైన్ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని బొంతు శ్రీదేవి యాదవ్ తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు,కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభు గౌడ్ కాలనీ జనరల్ సెక్రటరీ అశోక్ , గణేష్ గౌడ్, రమేష్ , మహేష్ , అనిల్,మహేష్ యాదవ్, శ్రీనివాస్, క్రాంతి, దత్తయ్య, వరలక్ష్మి, అనిత ,స్థానిక నాయకులు, మహిళలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



# మాచిరెడ్డిపల్లిలో శివాజీ విగ్రహ ఏర్పాటుపై పోలీసులకు ఫిర్యాదు

- మస్జిద్ సమీపంలో రోడ్డుపై విగ్రహం ఏర్పాటు చేశారని మస్జిద్ కమిటీ అభ్యంతరం..
- శాంతిభద్రతలు కాపాడాలని అధికారులకు విజ్ఞప్తి



**కోహిర్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం మాచిరెడ్డిపల్లి గ్రామంలో శివాజీ విగ్రహ ఏర్పాటు అంశం చర్చనీయాంశంగా మారింది. మస్జిద్‌కు సమీపంలో, ముస్లింలు నివసించే ప్రాంతంలో రోడ్డుపై విగ్రహాన్ని ఏర్పాటు చేశారంటూ మస్జిద్ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 20న కొందరు గ్రామస్తులు మస్జిద్ సమీపంలోని రోడ్డుపై శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. విగ్రహం ఏర్పాటుపై తమకు వ్యక్తిగతంగా అభ్యంతరం లేదని, అయితే రహదారిపై ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్తులో రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న నిర్మాణం భవిష్యత్తులో విస్తరించినట్లయితే రహదారి మరింత ఇరుకుగా మారి ప్రజలకు అసౌకర్యం కలిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

**శాంతిభద్రతలపై ఆందోళన**

గ్రామంలో అన్ని మతాలు, వర్గాలకు చెందిన ప్రజలు సోదరభావంతో జీవిస్తున్నారని, అలాంటి ప్రశాంత వాతావరణానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మస్జిద్ కమిటీ సభ్యులు కోరారు. మతపరమైన నినాదాలు, ఇతర అంశాల కారణంగా అపార్థాలు తలెత్తి ఉద్రిక్తతలకు దారితీయకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

**అధికారులు స్పందించాలని విజ్ఞప్తి**

విగ్రహం ఏర్పాటు చేసిన ప్రదేశాన్ని పరిశీలించి, రహదారిపై రాకపోకలకు ఇబ్బందులు ఉన్నాయా అనే అంశాన్ని అధికారులు పరిశీలించాలని కమిటీ సభ్యులు కోరినట్లు తెలిసింది. అవసరమైతే నిబంధనలకు అనుగుణంగా, వివాదాలకు తావులేని అనువైన ప్రదేశంలో విగ్రహం ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై మండల తహసీల్దార్ సుప్రియ, ఎంపీడీవోతో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని కోరారు.

**గ్రామంలో సామరస్యమే ముఖ్యం**

మాచిరెడ్డిపల్లిలో అన్ని వర్గాల ప్రజల మధ్య పరస్పర గౌరవం, సోదరభావం కొనసాగాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా, మతపరమైన భావాలు దెబ్బతినకుండా, చట్ట నిబంధనలకు అనుగుణంగా అధికారులు సమస్యను పరిష్కరించాలని ఫిర్యాదుదారులు కోరారు. ఈ అంశంపై సంబంధిత పోలీసు, రెవెన్యూ అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాల్సి ఉంది. పోలీసుల అధికారిక స్పందన, తదుపరి చర్యల వివరాలు తెలియాల్సి ఉంది.

# రేపు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ సదస్సు



**మక్తల్, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** ఈ నెల 25వ తేదీ ఆదివారం రోజు నారాయణపేట జిల్లా కేంద్రంలో జరగనున్న బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆవిర్భావ సదస్సును విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు తోట్ల రాఘవేంద్ర ముదిరాజ్ పిలుపునిచ్చారు. మక్తల్ పట్టణంలోని ఐబీ అతిథి గృహం వద్ద శుక్రవారం సన్నాహక కార్యక్రమంలో పాల్గొని సభ్యులకు పలు కీలక సూచనలు చేశారు. బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ అన్ని వర్గాల సంక్షేమం కోసం పని చేస్తుందని, ఆవిర్భావ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడిని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రాజశేఖర్ ముదిరాజ్, జిల్లా కో- కన్వీనర్ బలిజ వీరేష్, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ జిల్లా నాయకులు ఈశ్వర్ గువ్వల శివరాజ్, పొర్ల డేవిడ్, ట్రెజరరీ కృష్ణ మాదిగ జాగృతి జిల్లా అధ్యక్షులు మల్లికార్జున మహారాజ్, ప్రవీణ్ ,శ్రీనివాస్, విజయ్ , నరేష్ ముదిరాజ్, వేణు రాజు, పెద్దింటి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# పన్నుల భారంతో బార్ల బంద్

- అదనపు ప్రివిలేజ్ ట్యాక్స్ తగ్గించాలని డిమాండ్
- లేదంటే లైసెన్సుల సరెండర్
- యజమానుల హెచ్చరిక




**వనపర్తి, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** అదనపు పన్నులు, ఫీజుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తూ వనపర్తి జిల్లావ్యాప్తంగా బార్ అండ్ రెస్టారెంట్ యజమానులు శుక్రవారం బంద్ పాటించారు. తెలంగాణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ పిలుపు మేరకు చేపట్టిన నిరసనలో భాగంగా విలేకరులతో మాట్లాడారు. లైసెన్స్ ఫీజులపై 8 నుంచి 16 శాతం ప్రివిలేజ్ ట్యాక్స్ విధించడంతో వ్యాపార నిర్వహణ భారంగా మారిందన్నారు. పెరిగిన అద్దెలు, కార్మికుల వేతనాలకు తోడు అదనపు పన్నులు ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్ట్ షాపులను నియంత్రించాలని కోరారు. ఒక్కో బార్‌పై 20 నుంచి 40 కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక బంద్‌తోపాటు లైసెన్సులు సరెండర్ చేస్తామని హెచ్చరించారు. చెల్లించిన రెంటల్ ఫీజులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సబ్బిరెడ్డి వెంకటరెడ్డి, నిరంజన్‌గౌడ్, వేణుగోపాల్‌గౌడ్, రాహుల్, సురేష్‌గౌడ్, బండారు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కరెంటు కోతలతో ఎండిపోతున్న పంటలు

- సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన
- మహబూబ్‌నగర్‌లో పంటల బీభత్సం
- హన్వాడలో ఎండిన పంటలను పరిశీలించిన మాజీ మంత్రి డాక్టర్ శ్రీ వి. శ్రీనివాస్ గౌడ్

**హన్వాడ, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** హన్వాడ మండల పరిధిలోని హన్వాడ, మాదారం, కొమ్మిరెడ్డిపల్లి, మునిమోక్షం గ్రామాల్లో కరెంటు కోతలతో ఎండిపోయిన పంటలను మాజీ మంత్రివర్యులు డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ స్వయంగా పరిశీలించారు. అనంతరం మునిమోక్షం సబ్ స్టేషన్ ఎదుట రైతులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. వ్యవసాయం మీదనే ఆధారపడింది మహబూబ్‌నగర్ జిల్లా. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వలస పోయిన వారు వెనక్కి వచ్చి వ్యవసాయం చేసుకున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కరెంటు లేక పంటలు ఎండుతున్నాయి. తిరిగి మళ్ళీ వలసలు వెళ్లే పరిస్థితిని ఈ ప్రభుత్వం తీసుకువచ్చింది. కాలువలు తడుస్తున్నాయి.. మడులు ఎండుతున్నాయి:లి కోతల కరెంటు కారణంగా కాలువలు తడుస్తున్నాయి తప్ప.. మడుల్లోకి నీరు రావడం లేదు. వరి పంట కోసం ఎకరానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు రైతులు అప్పు చేసుకున్నారు. ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించాలి. పిండి సంచులు బ్లాక్ లో తెచ్చుకున్నారు.. నకిలీ డీఏపీ ఇచ్చారు. మేము అధికారంలో ఉన్నప్పుడు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మిన వాళ్లపై పీడీ యాక్ట్ పెట్టాము. బొగ్గు ఉంది, కరెంటు ఉత్పత్తి లేదు. జూరాల కింద నీరు ఉంది.. పంటలకు నీరు ఇవ్వడం లేదు. ఆంధ్రప్రదేశ్‌కి నీళ్లు పోతున్నాయి. కానీ మహబూబ్‌నగర్ రైతులకు సాగునీరు లేదు. పాలమూరును పట్టించుకోని కాంగ్రెస్ పాలమూరు ప్రాజెక్ట్ కాలువలు పూర్తి చేసి ఉంటే రైతుల పొలాల్లోకి నీళ్లు వచ్చేవి. రెండవ పంట వేయవద్దు అంటున్నారు.. ఇప్పుడు ఎండిన పంటలకు నష్ట పరిహారం గురించి మాత్రం మాట్లాడటం లేదు. ఐఏఎస్ అధికారుల బృందాన్ని జిల్లాలకు పంపి ఎండిన పంటల వివరాలు సేకరించాలి. ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం ఇవ్వాలి. కొన్ని చోట్ల 10-20 ఎకరాలు వేసిన వారికి కేవలం ఒకటి, రెండు ఎకరాలు మాత్రమే మిగిలాయి. సరిగ్గా కరెంటు ఇవ్వకుంటే అది కూడా చేతికి రాకుండా పోతుంది. రైతుల ఇండ్లలో తినేందుకు బియ్యం కూడా లేకుండా పోతాయి. గ్రామాల్లో పశువులు, మేకలు తాగేందుకు నీరు కూడా లేని పరిస్థితి ఉంది. తాగడానికి నీళ్లు లేని పరిస్థితి కొన్ని గ్రామాల్లో నెలకొంది. ఈ కార్యక్రమంలో హన్వాడ మండల పార్టీ అధ్యక్షులు కరుణాకర్ గౌడ్ మాజీ ఎంపీపీ బాలరాజ్ పీఏసీఎస్ చైర్మన్ కృష్ణయ్య గౌడ్ వైస్ చైర్మన్ శ్రీనివాసులు మునిమోక్షం సర్పంచ్ రామేశ్వరి కిష్టంపల్లి సర్పంచ్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి



**ఝరాసంగం, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** జాతీయ ఎలక్షన్ కమిషన్ చైర్మన్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని సిపిఐ ఎం మండల కార్యదర్శి కే. చంద్రన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఎస్ఐఆర్ ప్రక్రియను నిరసిస్తూ పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రన్న మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ చైర్మన్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్లను తొలగించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరునికి ఓటు హక్కు కల్పించాలని రాజ్యాంగం చెబుతున్న విరుద్ధంగా ఈ ప్రక్రియను చేపట్టి ఓట్లను తొలగించడం అన్యాయం అన్నారు. రహదారిపై జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, బాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

# భూ రీసర్వేలో తప్పులకు తావివ్వొద్దు

- గడువులోగా పూర్తి చేయాలి
- పట్టా భూముల సర్వేకు ముందు రైతులకు సమాచారం ఇవ్వాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి
- ప్రభుత్వ భూముల ఆక్రమణలను గుర్తించి స్వాధీనం చేసుకోవాలి



**వనపర్తి, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** భూ రీసర్వే పనులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్దేశిత గడువులోగా పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వనపర్తి మండలం జక్కంపల్లి రెవెన్యూ శివారులో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్‌తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రీసర్వే పనుల పురోగతిని తనిఖీ చేసిన కలెక్టర్.. పట్టా భూముల సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు ముందస్తుగా సమాచారం అందించాలని సూచించారు. భూముల సరిహద్దులను క్షేత్రస్థాయిలో కచ్చితంగా గుర్తించి, ఎలాంటి వివాదాలకు అవకాశం లేకుండా హద్దులను నిర్ధారించాలని స్పష్టం చేశారు. ప్రతి రైతు భూమి సర్వే పూర్తయిన అనంతరం సర్వే వివరాలను వారికి స్పష్టంగా తెలియజేయాలని, సర్వే పూర్తయినట్లు సంబంధిత రైతుల సంతకాలను తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. భూమి విస్తీర్ణం, సరిహద్దులకు సంబంధించిన వివరాల్లో స్పష్టత ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించి తమ ఆధీనంలో ఉంచుకున్నట్లయితే, వాటిని గుర్తించి నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. భూ రీసర్వే ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో సర్వే ఏడీ శ్రీనివాసులు, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి

- ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా జర్నలిస్టులు నిలవాలి
- బీఆర్ఎస్ నేత గుర్రపు మచ్చేందర్



**నారాయణఖేడ్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నేత గుర్రపు మచ్చేందర్ అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలోని స్వర్ణకార సంఘం భవనంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుర్రపు మచ్చేందర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ప్రజల ముందుకు తీసుకురావడంతోపాటు సంబంధిత అధికారుల దృష్టికి చేర్చి పరిష్కారానికి కృషి చేయడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ, ప్రజల గొంతుకగా నిలుస్తున్న జర్నలిస్టుల సేవలను గుర్తించి వారిని గౌరవించడం అభినందనీయమన్నారు. ప్రజాసేవలో భాగంగా మీడియా మిత్రులకు అండగా నిలవాలనే సదుద్దేశంతో జీఎంఆర్ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అనంతరం జర్నలిస్టులకు బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిగేల మాణిక్ ప్రభు, నారాయణఖేడ్ అధ్యక్షుడు సంజీవ్ కుమార్, కార్య నిర్వహణ అధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి కైసర్, వెంకటేశం, జీవన్ పటేల్ , ఇబ్రహీంఖాన్ ఉపాధ్యక్షులు శరణప్ప,,తెలంగాణ రాష్ట్ర మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ అనుముల మారుతి, కంగ్టి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గంగారం, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బసవరాజు పటేల్, నాయకులు తుకారాంతో పాటు పలువురు జర్నలిస్టులు, నాయకులు పాల్గొన్నారు.

# రబీలో రైతులు ఎట్టి పరిస్థితుల్లో వరి సాగు చేయొద్దు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 23 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున జిల్లాలోని రిజర్వాయర్లలో నీళ్లు డెడ్ స్టోరేజీలో ఉన్నందున రైతులు రబీలో వరి ఎట్టి పరిస్థితుల్లో వేయవద్దని, ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వెబ్ ఎక్స్ ద్వారా జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లాలో మొత్తం పంట ఏరియా 319470 ఎకరాలు ఉండగా వరితోపాటు పత్తి, మిరప, వేరుశనగ, కందులు, తదితర పంటల పరిస్థితిపై మాట్లాడారు. వర్షాలు తక్కువగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు మొదటి నుంచి చెబుతున్నప్పటికీ జిల్లాలోని పలువురు రైతులు ఖరీఫ్ సీజన్ లో వరి సాగు చేశారని, ఆ పంటలను బతికించేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి వారబందీ విధానంలో కాలువలకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

**వరి వద్దు - ఆరుతడే ముద్దు**

రబీ సీజన్‌లో రైతులు ఎట్టి పరిస్థితుల్లో వరి సాగు చేయకుండా ముందస్తుగానే గ్రామసభలు నిర్వహించి అవగాహన కలిగించాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులపై ఉందన్నారు. బోరు, బావుల వద్ద నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటలు సాగు చేయవచ్చని సూచించారు. వ్యవసాయానికి ప్రస్తుతం విద్యుత్ సరఫరాలో కొంత అంతరాయం ఉన్నందున భవిష్యత్తులో ఆ సమస్య పెరిగితే పంటలను బతికించుకోవడం కష్టతరమవుతుందన్నారు. కాబట్టి రైతులు తక్కువ నీటితో పండే పంటలను ఎన్నుకోవాల్సిందిగా కోరారు.

**ఖేతి బచావో అభియాన్‌పై అవగాహన అవసరం**

ఖేతి బచావో అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో జయప్రదంగా నిర్వహించాలని, వాటితోపాటు గ్రామసభలలో కరువు పరిస్థితులు, పంటల ఎంపిక, పశుగ్రాసం, ఉపాధి హామీ పనులపై అవగాహన కల్పించాలన్నారు. సర్పంచులు, ఎంపీవోలు, ఏఈవోలు, మండల ప్రత్యేక అధికారులు, తసిల్దారులు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామ సభలలో పాల్గొనేలా చూడాలన్నారు. ప్రతి క్లస్టర్‌లోని గ్రామాల వారిగా సమావేశాల షెడ్యూల్ తయారుచేసి జిల్లా వ్యవసాయ అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. రైతులకు పంపిణీ చేయడానికి జిల్లా, మండల స్థాయిలో పంటల సలహా పత్రాలు రూపొందించాలన్నారు. ఖేతి బచావో అభియాన్ అనేది భారత దేశంలో వ్యవసాయ భూముల పరిరక్షణ మరియు రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఒక దేశవ్యాప్త అవగాహన ఉద్యమం అని పేర్కొన్నారు.

ఈ అభియాన్ (ఉద్యమం) యొక్క ప్రధాన ఉద్దేశాలు నేల ఆరోగ్యాన్ని కాపాడటం, రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగం వల్ల దెబ్బతింటున్న నేల సారాన్ని, భూమి ఆరోగ్యాన్ని కాపాడటం ప్రధానమని తెలిపారు. పంట దిగుబడి పేరుతో రైతులు విపరీతంగా యూరియా, ఇతర రసాయనాలు వాడకుండా “సాయిల్ హెల్త్ కార్డ్” ఆధారంగా నేల పరీక్షలు చేయించుకుని, ఎంత మోతాదులో ఎరువులు అవసరమో అంతే వాడేలా రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అవసరానికి మించి రసాయనాలు వాడటం వల్ల రైతులపై ఆర్థిక భారం పడుతుంది కాబట్టి సరైన పద్ధతిలో ఎరువులు వాడటం ద్వారా పెట్టుబడి ఖర్చును తగ్గించి, లాభాలు పెంచడం అవసరమన్నారు. సహజ, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ముఖ్యమని పేర్కొన్నారు. రసాయనిక ఎరువులకు బదులుగా బయో-ఫెర్టిలైజర్స్ (జీవ ఎరువులు), పచ్చి రొట్ట ఎరువులు, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించేలా రైతులను ప్రోత్సహించడం, నీటి వృథాను అరికట్టడానికి జల సంరక్షణ పద్ధతులు, ఆధునిక సాగు పద్ధతులు మరియు శాస్త్రీయ పంట నిర్వహణ గురించి గ్రామస్థాయిలో రైతులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. నకిలీ ఎరువులు, పురుగుమందుల వలన నష్టపోకుండా రైతులను అప్రమత్తం చేయడం, వ్యవసాయంలో సరికొత్త సాంకేతికతను పరిచయం చేయడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 22 నుంచి నవంబర్ 31 తేదీ వరకు ప్రతి నియోజకవర్గానికి 30 సమావేశాలను నిర్వహించి రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిందిగా జిల్లా కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

- ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**నర్సాపూర్, అక్టోబరు 23 (జనం సాక్షి) :** రానున్న రబీ సీజన్‌లో నీటి వినియోగాన్ని తగ్గించే ఆరుతడి పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని, పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శుక్రవారం నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామంలో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. నీటి అవసరం అధికంగా ఉండే వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. ఎండల ప్రభావంతో పంటలు దెబ్బతినకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కుసుమ, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రభుత్వం సబ్సిడీలు, వివిధ పథకాల ద్వారా ప్రోత్సహిస్తోందని కలెక్టర్ వివరించారు. ఆయిల్‌పామ్ సాగులో అంతర పంటలను పండించడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల పంటలకు కలిగే నష్టాలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్‌కుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్‌సింగ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, చిన్నచింతకుంట సర్పంచ్ సరిత మహేశ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రబీలో ఆరుతడి పంటల సాగుకు పెద్దపీట

- రైతులకు మార్కెటింగ్, మద్దతు ధరలో ఇబ్బందులు లేకుండా చూడాలి
- కలెక్టర్ రాజర్షి షా




**నెరడిగొండ, అక్టోబర్ 23 (జనంసాక్షి):** రాబోయే రబీ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు, నీటి లభ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు నష్టపోకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రబీ సీజన్ సాగు,వాతావరణ పరిస్థితులపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడాతు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు పంట చేతికొచ్చిన తర్వాత మార్కెటింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.పంటల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మద్దతు ధర,గిట్టుబాటు ధరల కల్పనలో జాప్యం జరగకూడదన్నారు. వ్యవసాయ,మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేసి రబీ ప్రారంభం నుంచే కొనుగోళ్లు సజావుగా జరిగేలా పకడ్బందీ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు,గోనె సంచులు తదితర ఏర్పాట్లపై ముందుగానే దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ యార్డుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడతామని, కొనుగోలు కేంద్రాల్లో ప్రాథమికసదుపాయాలకు లోటు లేకుండా చూస్తామని చెప్పారు.వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ రైతులు పండించిన పంటలకు తగిన మద్దతు ధర లభించేలా మార్కెట్ కమిటీ సహకరిస్తుందని వివరించారు.ఈ సమావేశంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ,జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్,ఏడీ మార్కెటింగ్ అధికారి గజానన్,ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ కె. హరిత



**కెరమెరి, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం సావర్ఖేడ్ పంచాయతీ నాగపూర్ గ్రామంలో చేపడుతున్న రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి రైతుకు ముందుగా సమాచారం ఇచ్చి, టామ్ టామ్ ద్వారా చాటింపు వేయించి రీ సర్వేలో ప్రతి రైతు హాజరయ్యేలా చూడాలని సూచించారు. రీ సర్వే పూర్తయితే భవిష్యత్తులో గెట్టు పంచాయితీలు, భూ వివాదాలకు తావు ఉండదని తెలిపారు. సర్వే కోసం ప్రతి మండలానికి 2 బృందాలను ఏర్పాటు చేశామని, ఖచ్చితమైన కొలతల కోసం ఆధునిక రోవర్లను తెప్పించామని, వీటి ద్వారా కచ్చితమైన సర్వే జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సర్వే అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తులసిరామ్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ శ్రావణ్, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## జనాభా గణన బ్లాకులను పటిష్టంగా ఏర్పాటు చేయాలి

- ముగిసిన జనాభా గణన-2027 రెండవ దశ శిక్షణ
- జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు



**ములుగు ప్రతినిధి, అక్టోబర్ 23(జనంసాక్షి) :** జనాభా గణన-2027లో భాగంగా గణన బ్లాకులు, ఉప గణన బ్లాకులను పటిష్టంగా ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు సూచించారు. ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జనాభా గణన-2027 రెండవ దశకు సంబంధించి గణన బ్లాకులు, ఉప గణన బ్లాకుల ఏర్పాటుపై నిర్వహించిన రెండు రోజుల శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జనాభా గణనలోని 40 ప్రశ్నలు, స్వీయ గణన, సీఎంఎంఎస్ పోర్టల్‌పై అవగాహన కల్పించారు. హైదరాబాద్‌లోని జనాభా గణన సంచాలకుల కార్యాలయం నుంచి వచ్చిన అధికారులు యువేందర్ బాబు, నాయుడు రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా, జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సీహెచ్ మహేందర్, ఆర్డీఓ కృష్ణవేణి, ఛార్జ్ అధికారులైన తహసీల్దార్లు, అదనపు ఛార్జ్ అధికారులైన మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ముఖ్య ప్రణాళిక అధికారి బి జవహర్ లాల్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, గణాంక అధికారులు భూక్యా లాల్ నాయక్, ఎం రమేష్ బాబు, ఈడీఎం దేవేందర్ పాల్గొన్నారు.

## గుంత చిన్నదే అనుకుంటే.. ఖర్చు పెద్దగానే అయింది!

- రాయల్ ఎన్‌ఫీల్డ్ మరమ్మతులకు రూ.10 వేలు..
- గుంతలో పడి పలువురు వాహనదారులకు గాయాలు..





**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** జాతీయ రహదారిపై కుందయ్యపల్లి వద్ద ఏర్పడిన చిన్న గుంత వాహనదారులకు చుక్కలు చూపిస్తోంది. గణపురం మండలం చెల్పూర్ శివారులోని ఈ గుంతలో పడి పలువురు ద్విచక్ర వాహనదారులు గాయపడినట్లు బాధితులు చెబుతున్నారు. చిట్యాల మండలం నైన్‌పాకకు చెందిన శ్రీను అనే సెల్‌ఫోన్ షాపు యజమాని రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై వెళ్తుండగా గుంతలో పడి బైక్ ముందు భాగంలోని షాక్ అబ్జార్బర్లు దెబ్బతిన్నాయి. మరమ్మతులకు సుమారు రూ.10 వేలు ఖర్చయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరో వాహనదారుడి సెల్‌ఫోన్ గుంతలో పడగా, వెనుక వచ్చిన లారీ తొక్కడంతో ధ్వంసమైంది. చిన్న గుంత కారణంగా వాహనదారులు గాయ పడటంతోపాటు ఆర్థికంగా నష్టపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చి ప్రమాదాలను నివారించాలని డిమాండ్ చేస్తున్నారు.

# సమన్వయంతోనే పుష్కర పనులు పూర్తి కావాలి

- కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి బాసరలో పర్యటించిన కమిషనర్



**బాసర, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** బాసరలో జరగనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లను గడువులోగా, నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి బాసర క్షేత్రంలో పర్యటించారు. ముందుగా శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, గోదావరి నది తీరంలో చేపడుతున్న పుష్కర ఘాట్ల నిర్మాణ పనులు, ఇతర అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పుష్కరాలకు వేలాది మంది భక్తులు పుణ్యస్నానాల కోసం తరలివస్తారని, వారి రద్దీకి అనుగుణంగా విశాలమైన ఘాట్లను నిర్మించాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, నీడ, పార్కింగ్ తదితర అన్ని వసతులు కల్పించాలని సూచించారు. పుష్కరాల పనులు కేవలం ఒక శాఖకు సంబంధించినవి కాదని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని స్పష్టం చేశారు.

**పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం : కలెక్టర్ భవేశ్ మిశ్రా**

బాసర పుష్కర పనులను తాము నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. ప్రతి వారం బాసరలోనే పుష్కర పనులపై సమీక్షా సమావేశం నిర్వహిస్తూ, అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నామన్నారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఇన్‌ఛార్జ్ అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, భైంసా సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఆర్ అండ్ బి ఈఈ సుభాష్, ఆలయ ఈవో అంజనా దేవి, తహసిల్దార్ పవన్ చంద్ర తదితర అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రతిభ, మెరిట్, అర్హత ఆధారంగా నియామక ప్రక్రియ

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 23 (జనంసాక్షి) :** ప్రభుత్వ వైద్య కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తూ, అభ్యర్థుల ప్రతిభ, మెరిట్, అర్హతల ఆధారంగా ఎంపిక చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలంలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో దంత వైద్య విభాగంలో అధ్యాపకుల కొరకు నిర్వహించిన నియామక ప్రక్రియకు కళాశాల ప్రిన్సిపల్ దేవాజి, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు అశోక్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియామక ప్రక్రియలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నిబంధనల ప్రకారం పారదర్శకంగా చేపట్టడం జరిగిందని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక కోసం రాత పరీక్ష, పి.జి. మార్కులు, ఇంటర్వ్యూలో సాధించిన మార్కులను పరిగణనలోకి తీసుకొని, అభ్యర్థుల విద్యార్హతలు, ప్రతిభ, అనుభవం తదితర అంశాలను పరిశీలించి మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఇంటర్వ్యూలో అభ్యర్థులు సాధించిన మార్కులతో పాటు, పి.జి. మార్కులకు నిర్దేశించిన వెయిటేజీని పరిగణనలోకి తీసుకొని తుది మెరిట్‌ను నిర్ణయించడం జరిగిందని, ఈ ప్రక్రియలో అభిషేక్ అత్యుత్తమ ప్రతిభ కనబరచగా, ఎంపిక చేసేందుకు కమిటీ నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థి త్వరలో విధులలో చేరేలా నియామక ఉత్తర్వులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కళాశాల మైదానం అభివృద్ధి, క్రీడా వసతుల కల్పన, త్రాగునీటి సదుపాయం, ఇంటర్నెట్ సౌకర్యాల మెరుగుదలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు కన్నెపల్లి పంప్‌హౌస్‌కు బీఆర్ఎస్ బృందం

**కాళేశ్వరం, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** గోదావరి జలాల వినియోగంపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం లోని కన్నెపల్లి పంప్ హౌస్ సందర్శనకు హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల బి ఆర్ ఎస్ నాయకుల బృందం శనివారం రానున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.ఇప్పటికే 794 టీఎంసీల నీళ్లు కిందికి వదిలేశారని, ఇప్పటికైనా నీటిని లిఫ్ట్ చేయాలని సీనియర్ ఇంజనీర్లు చెప్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది.గ్రేటర్ హైదరాబాద్ తాగునీటి సమస్యతో పాటు, రైతులకు కూడా నీళ్లు అందించవచ్చని, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకే కన్నెపల్లి పంప్ హౌస్ సందర్శనకు వెళ్తున్నట్టు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు.

## అనుమానస్పదంగా వ్యక్తి మృతి

**బచ్చన్నపేట (జనంసాక్షి) :** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడవటూరు గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన మిన్నలాపురం సిద్దయ్య (60) మృతి చెందారు. వ్యవసాయ పనుల్లో భాగంగా తన పొలం వద్దకు వెళ్లిన ఆయన, బర్రె పాలు పిండేందుకు వెళ్లిన సమయంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. వ్యవసాయ బావి సమీపంలో ఉన్న సిద్దయ్యపై ఎలుగుబంటి ఒక్కసారిగా దాడి చేయవచ్చని అనుమానం వ్యక్తపరిచారు. ఈ ఘటనతో కొడవటూరు గ్రామంలో విషాదం నెలకొంది. రైతు మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ విషయంపై హత్య. జంతువుల దాడ అనే కోణంలో విచారణ జరుగుతున్నట్లు సీఐ. స్థానిక ఎస్సై ఏ శ్రీకాంత్ తెలిపారు

## పదవి ఆమెది... పెత్తనం ఆయనది

- వెంకటాపూర్ మండలంలో సర్పంచ్ భర్తల దౌర్జన్యం..?
- గ్రామ కార్యదర్శిపై ఓ సర్పంచ్ భర్త బూతు పురాణం..!
- పోలీసులకు కార్యదర్శుల ఫిర్యాదు



**వెంకటాపూర్,అక్టోబర్ 23 (జనం సాక్షి):-** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని కొన్ని గ్రామాల్లో మహిళా సర్పంచ్ భర్తల పెత్తనం భరించలేకుండా ఉంది. మహిళలకు 50% రిజర్వేషన్ కల్పించి సాధికారత కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యం వెంకటాపూర్ మండలంలో మాత్రం నీరుగారిపోతోంది. తాజాగా మండలంలోని ఓ గ్రామంలో సర్పంచ్ భర్త ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శిపై అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు బెదిరింపులకు పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది.

**అసలేం జరిగింది..?**

సదురు గ్రామ పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శిపై సర్పంచ్ భర్త అకారణంగా దూషించారని తెలిసింది. పంచాయతీలో ఏ పని జరిగినా తన అనుమతి తీసుకోవటం తోపాటు తను చెప్పిందే చేయాలంటూ సదురు కార్యదర్శికి హుకుం జారీ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే కార్యదర్శి మాత్రం నిబంధనల ప్రకారం పని చేస్తుంటే, సర్పంచ్ భర్త అడ్డుకుంటున్నారని సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆగ్రహానికి గురైన సర్పంచ్ భర్త సదురు గ్రామ పంచాయతీ కార్యదర్శి పై దుర్భాషలాడినట్లు తెలిసింది. అసలు ఆ గ్రామంలో ఏం జరిగిందో అధికారుల విచారణలో తెలియాల్సి ఉంది.

**రెండు కోణాల్లో కొనసాగుతున్న చర్చ**

పంచాయతీ కార్యదర్శి పై సర్పంచ్ భర్త దుర్భాషలాడిన ఘటనపై గ్రామంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కార్యదర్శికి కనీస గౌరవం ఇవ్వకుండా సర్పంచ్ భర్త పెత్తనం చేస్తున్నట్లు గ్రామస్థులు కొందరు ఆరోపిస్తే, సర్పంచ్ మాట వినకుండా కార్యదర్శి ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తున్నందుకే సర్పంచ్ భర్త ఆగ్రహం వ్యక్తం చేశారని మరి కొంతమంది గ్రామస్తులు పేర్కొంటున్నారు.

**పోలీస్ స్టేషన్ లో కార్యదర్శుల ఫిర్యాదు**

కార్యదర్శి పై సర్పంచ్ భర్త దుర్భాషలాడంతో పాటు బెదిరింపు చర్యలపై సదురు పంచాయతీ కార్యదర్శి తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలిసింది. వెంకటాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న తోటి పంచాయతీ కార్యదర్శి లతో కలిసి సదురు పంచాయతీ కార్యదర్శి ఇటీవల వెంకటాపూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో వెంకటాపూర్ మండలంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

**మిగితా కార్యదర్శుల్లో మొదలైన ఆందోళన**

వెంకటాపూర్ మండలంలోని ఓ గ్రామంలో నెలకొన్న ఈ ఘటనతో మండలంలోని ఇతర గ్రామ పంచాయతీ కార్యదర్శుల్లోనూ ఆందోళన మొదలైంది. ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచ్ ల స్థానంలో వారి భర్తలు పెత్తనం చెలాయించడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం సర్పంచ్ కి మాత్రమే అధికారం ఉంటుందని , భర్తలు జోక్యం చేసుకోవడం చట్టవిరుద్ధమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సర్పంచ్ భర్తల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని వారు కోరుతున్నారు.

## నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కలకలం..!

- తహసీల్దార్ సంతకం ఫోర్జరీ.. ప్రభుత్వ సీలు దుర్వినియోగం
- భూముల మ్యుటేషన్‌కు యత్నం..
- మిల్స్ కాలనీ పోలీసుల కేసు నమోదు



**వరంగల్ బ్యూరో, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** ఖిలా వరంగల్ మండలంలో నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వ్యవహారం వెలుగుచూసింది. తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేయడంతోపాటు ప్రభుత్వ కార్యాలయ సీలును దుర్వినియోగం చేసి నకిలీ ధ్రువీకరణ పత్రం సృష్టించినట్లు ఆరోపణలు నమోదయ్యాయి.

ఎఫ్ఐఆర్ వివరాల ప్రకారం.. మెహరున్నిసా బేగం పేరిట 2026 జనవరి 8న జారీ చేసినట్లు పేర్కొంటూ జ/3223/2026 డి.డిస్ నంబర్‌తో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ రూపొందించారు. ఈ పత్రం నిజమైనదో కాదో పరిశీలించాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల తహసీల్దార్ కోరడంతో ఖిలా వరంగల్ కార్యాలయ అధికారులు రికార్డులను తనిఖీ చేశారు. అయితే, సంబంధిత నంబరుతో ఎలాంటి సర్టిఫికెట్ జారీ చేయలేదని కార్యాలయ రికార్డులు, డిస్ట్రిబ్యూషన్ రిజిస్టర్ పరిశీలనలో తేలినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి సంబంధించిన అసలు సభ్యులందరి వివరాలను పొందుపరచకుండా నకిలీ పత్రాన్ని సృష్టించి, వ్యవసాయ భూముల మ్యుటేషన్‌కు ప్రయత్నించినట్లు ఫిర్యాదులో ఆరోపించారు. తహసీల్దార్ సంతకం ఫోర్జరీతోపాటు ప్రభుత్వ కార్యాలయ సీలును ఉపయోగించిన అంశాలపై విచారణ జరపాలని కోరారు.

ఖిలా వరంగల్ తహసీల్దార్ ఎం.డి. ఇక్బాల్ ఫిర్యాదు మేరకు ఏజే మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌లో అక్టోబర్ 17న ఎఫ్ఐఆర్ నంబర్ 780/2026 నమోదైంది. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 318(4), 336(3), 340(2), 337 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివరాత్రి మహేశ్ దర్యాప్తు చేపట్టారు.

## యువతి ఆత్మహత్య..

- యువకుడిపై కేసు నమోదు



**హనుమకొండ ప్రతినిధి /దామెర, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** దామెర మండలం ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన కట్ట స్నేహ (22) శుక్రవారం తెల్లవారు జామున నల్లాల బావిలో దూకి మృతి చెందినట్లు దామెర పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. అదే గ్రామానికి చెందిన జీడిమెట్ల శ్రీధర్ తనను వివాహం చేసుకోవాలని కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తూ, బెదిరింపులకు పాల్పడుతూ బ్లాక్‌మెయిల్ చేశాడని పేర్కొన్నారు. ఈ వేధింపులతో మనస్తాపానికి గురైన స్నేహ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న దామెర ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతురాలి తండ్రి కట్ట ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీడిమెట్ల శ్రీధర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
24 అక్టోబర్ 2026

# నీటి పొదుపు, భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

**● జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్**

**చందంపేట, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** రైతుల భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో ముఖాముఖి మాట్లాడి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. భూములకు సంబంధించిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని ఆయన సూచించారు. మహిళా సంఘాలు బంజరు భూముల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకొని విద్యుత్‌ను విక్రయించడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, పశువుల ద్వారా గోబర్ గ్యాస్ తయారీని ప్రోత్సహించాలని తెలిపారు. చందంపేట మండలం, పొగిళ్ల, కంబాలపల్లి గ్రామాల్లో భూ సర్వే నిర్వహించిన ప్రాంతాలను సందర్శించారు. శుక్రవారం సూర్యోదయానికి ముందే క్షేత్రస్థాయికి చేరుకున్న ఆయన రైతులతో నేరుగా మాట్లాడి భూ సర్వే వివరాలు, భూముల విస్తీర్ణం, రికార్డులు, అభ్యంతరాల గురించి అడిగి తెలుసుకున్నారు. పొగిళ్ల గ్రామంలో సర్వే నంబర్ 2లో 1,066 ఎకరాల భూమిని సర్వే చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. గ్రామంలో వాస్తవంగా సాగులో ఉన్న భూమి, అసైన్డ్ భూములు , భూములపై హక్కులు కలిగిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూ సర్వేకు సంబంధించిన వివరాలను గ్రామంలో ప్రదర్శించాలని, అవసరమైతే గ్రామసభలో చదివి వినిపించాలని ఆదేశించారు. ఇప్పటివరకు వచ్చిన అభ్యంతరాలు , వాటి పరిష్కారానికి



తీసుకున్న చర్యలేమిటని అధికారులను ప్రశ్నించారు. మొత్తం 30 అభ్యంతరాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. భూముల రికార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు, పహాణీ వివరాలు, క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణాన్ని సరిపోల్చి పరిశీలించాలని సూచించారు. భూములపై అభ్యంతరాలు వ్యక్తం చేసే రైతులు తమకు సంబంధించిన ధ్రువపత్రాలను చూపించాలని తెలిపారు. అసైన్డ్ భూములను చట్టవిరుద్ధంగా అమ్మడం, కొనడం చేయకూడదని స్పష్టం చేశారు. సర్వే వివరాలను పారదర్శకంగా ప్రజలకు తెలియజేసి, అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రైతులతో చర్చించి భూ సమస్యలను పరిష్కరించేందుకు కంబాలపల్లి రైతు వేదికలో రైతులతో కలెక్టర్ సమావేశమయ్యారు. సర్వే నంబర్ల వారీగా భూ సర్వే ఎంతవరకు పూర్తయింది, ఖక్షేత్రస్థాయిలో పరిశీలన జరిగిందా, ఇంకా ఎన్ని సర్వేలు చేయాల్సి ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే నంబర్ 37, 50లకు సంబంధించిన సర్వే వివరాలను పరిశీలించి, పూర్తయిన సర్వే వివరాలను గ్రామసభల్లో ప్రదర్శించాలని సూచించారు. సర్వే రికార్డుల్లో ఉన్న వివరాలు, పహాణీలో నమోదైన పేర్లు, వాస్తవంగా భూములు అనుభవిస్తున్న రైతుల వివరాలను సరిపోల్చాలని ఆదేశించారు. వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి, మిగిలిన సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.
భూముల విస్తీర్ణంలో హెచ్చుతగ్గులు ఉన్నా, రికార్డుల్లో తేడాలు కనిపించినా సంబంధిత రైతులు, అధికారులు కలిసి చర్చించుకోవాలని సూచించారు. అలాగే పశువుల పేడతో గోబర్ గ్యాస్ తయారు చేసుకొని ఇంధన అవసరాలను తీర్చుకోవడంతో పాటు వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. రైతులు, గ్రామీణ ప్రజలు అనవసర ఖర్చులను తగ్గించుకొని, పొదుపు అలవాటును పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలియన్ చింగ్ థియాన్ మావి, ల్యాండ్ సర్వే ఏడి దేవరాజ్ , తహసిల్దార్ సత్యనారాయణ, సర్పంచ్ జటా జైహింద్ నాయక్ , మండల సర్వేయర్లు శ్రీనివాస్,హరీష్, కంబాలపల్లి సర్పంచ్ గోవిందు, రైతులు, గ్రామస్తులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## పాల్వంచలో అంబులెన్స్‌కూ తప్పని తిప్పలు




**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపాల్వంచ పట్టణంలోని రద్దీ ప్రాంతమైన అంబేద్కర్ సెంటర్‌లో జరుగుతున్న రోడ్డు మరమ్మతుల పనులు ప్రయాణికులకు, స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ క్రమంలో జరిగిన ఘటన ప్రాణాల మీదికి తెచ్చేంత ప్రమాదకరంగా మారింది.

**ట్రాఫిక్‌లో చిక్కుకున్న అత్యవసర అంబులెన్స్**

శుక్రవారం అంబేద్కర్ సెంటర్ ప్రాంతంలో రోడ్డు పనులు జరుగుతుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సరిగ్గా అదే సమయంలో, ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక రోగిని అత్యవసరంగా ఆసుపత్రికి తరలిస్తున్న అంబులెన్స్ ఆ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. అంబులెన్స్ సిబ్బంది ఎంతగా సైరన్ మోగించినప్పటికీ, రహదారి ఇరుకుగా మారడం మరియు వాహనాలు బంపర్-టు-బంపర్ నిలిచిపోవడంతో వెంటనే దారి దొరకలేదు. నిమిషాల్లో చేరాల్సిన గమ్యస్థానానికి వెళ్లేందుకు అంబులెన్స్ నానా తంటాలు పడాల్సి వచ్చింది. దీన్ని చూసిన స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

**స్థానికుల ఆందోళన.. అధికారులకు విజ్ఞప్తి**

వైద్య అత్యవసర సమయాల్లో "ప్రతి నిమిషం ఎంతో విలువైనది" అని, ఇలాంటి జాప్యాలు రోగి ప్రాణాలకే ముప్పు తెస్తాయని స్థానికులు వాపోతున్నారు.

# విద్యుత్ తీగలు తగిలి గడ్డివాము దగ్ధం

**● త్రుటిలో తప్పిన ప్రమాదం**



**మాడుగులపల్లి, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల పరిధిలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది కల్వలపాలెం గ్రామంలో ఎండుగడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు లో-టెన్షన్ విద్యుత్ తీగలు తగలడంతో గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇందుగుల గ్రామానికి చెందిన రైతు మల్లెల వినోద్ (తండ్రి: శ్రీను) సమీపంలోని కల్వలపాలెం గ్రామంలో ఎండుగడ్డిని కొనుగోలు చేశాడు కల్వలపాలెం నుండి తన స్వగ్రామమైన ఇందుగులకు ట్రాక్టర్‌పై గడ్డి లోడును తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో రహదారిపై ప్రమాదకరంగా కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు ట్రాక్టర్‌పై ఉన్న గడ్డివాముకు తగిలాయి. విద్యుత్ వైర్లు తాకడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఒక్కసారిగా నిప్పురవ్వలు ఎగసిపడి ఎండుగడ్డికి మంటలు అంటుకున్నాయి. గడ్డి నుంచి పొగలు, మంటలు రావడం గమనించిన ట్రాక్టర్ డ్రైవర్, కూలీలు వెంటనే కిందకు దూకి సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో పెద్ద ప్రాణాపాయం తప్పింది. క్షణాల వ్యవధిలోనే మంటలు తీవ్రమై ట్రాక్టర్‌పై ఉన్న గడ్డివాము పూర్తిగా కాలి బూడిదైంది స్థానికులు వెంటనే స్పందించి మంటలు ట్రాక్టర్ ఇంజిన్‌కు వ్యాపించకుండా అదుపు చేయడంతో మరింత నష్టం వాటిల్లకుండా మిగిలింది ఈ ప్రమాదంలో కొనుగోలు చేసిన గడ్డితో పాటు శ్రమ అంతా బూడిదైపోవడంతో రైతు మల్లెల వినోద్ తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూశాడు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రమాదకరంగా వంగి ఉన్న విద్యుత్ వైర్లను సరిచేయాలని పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానిక రైతులు మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వేలాడుతున్న వైర్లను సరిచేయాలని, ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన రైతు వినోద్‌ను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలి

**భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ భద్రతా చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో జిల్లాలో నమోదైన రోడ్డు ప్రమాదాలు, మరణాలు, గాయపడిన వారి వివరాలతో పాటు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. జిల్లాలో జనవరి 1 నుంచి అక్టోబర్ 15 వరకు మొత్తం 410 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని అధికారులు వివరించారు. వీటిలో 179 ప్రాణాంతక ప్రమాదాలు కాగా, 231 ప్రాణాపాయం లేని ప్రమాదాలుగా నమోదయ్యాయి. ఈ ప్రమాదాల్లో 191 మంది ప్రాణాలు కోల్పోగా, 26 మంది తీవ్రంగా, 383 మంది స్వల్పంగా గాయపడ్డారు. నమోదైన మొత్తం 410 ప్రమాదాలకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. రోడ్డు ప్రమాదాల కారణంగా విలువైన ప్రాణాలు కోల్పోతుండటంపై ఆందోళన వ్యక్తం చేసిన డీఆర్వో, ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. రహదారుల వారీగా ప్రమాదాల వివరాలను పరిశీలిస్తే జాతీయ రహదారులపై అత్యధికంగా 177 ప్రమాదాలు జరిగి 75 మంది మృతి చెందారు. గ్రామీణ రహదారులపై 71 ప్రమాదాల్లో 41 మంది, ఇతర జిల్లా రహదారులపై 66 ప్రమాదాల్లో 33 మంది, రాష్ట్ర రహదారులపై 54 ప్రమాదాల్లో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. స్థానిక రహదారులపై 31 ప్రమాదాల్లో 16 మంది, ప్రధాన జిల్లా రహదారులపై ఆరు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందినట్లు అధికారులు వివరించారు. ప్రమాదాలు అధికంగా నమోదవుతున్న రహదారులను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని డీఆర్వో ఆదేశించారు. అక్టోబర్ 1 నుంచి 15 వరకు జిల్లాలో 21 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా, వీటిలో 10 ప్రాణాంతక ప్రమాదాలు నమోదయ్యాయి. ఈ పదిహేను రోజుల వ్యవధిలోనే 10 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల జరిగిన ప్రమాదాలకు గల కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీఆర్వో సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్‌లు, రిఫ్లెక్టర్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదకర మలుపులు, కూడళ్లు, రహదారులపై ఉన్న ఇతర సమస్యలను గుర్తించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు. రహదారుల భద్రతకు సంబంధించిన పనుల్లో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఆర్వో పద్మావతి సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు తదితర వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై పోలీస్, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లాలో నమోదైన హిట్ అండ్ రన్ కేసుల వివరాలను అధికారులు సమావేశంలో వివరించారు.



మొత్తం ఎనిమిది కేసులు నమోదు కాగా, బూర్గంపహాడ్, టేకులపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండేసి కేసులు, అన్నపురెడ్డిపల్లి, దమ్మపేట, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కొక్క కేసు నమోదైనట్లు తెలిపారు. ఇటువంటి ఘటనలపై తగిన చర్యలు తీసుకుంటూ, బాధితులకు సకాలంలో సహాయం అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని డీఆర్వో అన్నారు . ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటికి గల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రోడ్డు ప్రమాదాలు, మరణాలు, గాయాల సంఖ్యను తగ్గించే దిశగా కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి భూషిత్ రెడ్డి, డీఆర్ఎం జి. బాలాజీ, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి సిహెచ్ వెంకటేశ్వర్లు,డీఎస్పీ వెంకన్న బాబు, జిల్లా వైద్య శాఖ అధికారులు , ఆర్అండ్‌బీ ఈఈ, ట్రాఫిక్ ఎస్ఐ, కలెక్టరేట్ సీ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్లను సందర్శించిన ఎస్పీ రోహిత్ రాజు

**కొత్తగూడెం క్రైమ్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ కరకగూడెం పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం తనిఖీ చేశారు . ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందించి ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, కార్యాలయ నిర్వహణ, రికార్డులు, స్టేషన్ ప్రాపర్టీ, ఆయుధాల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణతో పాటు సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. విధి నిర్వహణకు అవసరమైన కిట్ ఆర్టికల్స్‌ను సక్రమంగా నిర్వహించుకోవాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తుల పురోగతి, నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలపై తక్షణమే స్పందించి త్వరితగతిన పరిష్కారం చూపాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లోని ఆయుధాలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ సక్రమంగా నిర్వహించాలని, స్టేషన్ ప్రాపర్టీకి సంబంధించిన రికార్డులను క్రమబద్ధంగా నిర్వహిస్తూ వాటి భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు విధుల నిర్వహణలో క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పనితీరును కనబరచాలని సూచించారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల వివరాలు, దర్యాప్తు పురోగతి తదితర సమాచారాన్ని సకాలంలో నమోదు చేయాలని, ప్రతి ఒక్కరూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు సైబర్



నేరాల బారిన పడకుండా గ్రామాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.జూదం, కోడిపందాలు, పేకాట, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఏడుళ్ల బయ్యారం, మణుగూరు పోలీస్ స్టేషన్లను సందర్శించి, అక్కడ నిర్మాణంలో ఉన్న పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్లలో అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ, సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, సిఐ నాగబాబు, ఎస్సై పి.వి.ఎన్. రావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గీత కార్మికుడు మృతి

**వలిగొండ, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** మండలంలోని రెడ్ల రేపాక గ్రామానికి చెందిన గీత కార్మికుడు కొండం శంకరయ్య గౌడ్ శుక్రవారం ఉదయం కళ్ళు గీసేందుకు తాటి చెట్టు ఎక్కగా, ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.తాటి చెట్లు ఎక్కి కల్లు గీయడం ద్వారా కుటుంబాలను పోషించుకునే గీత కార్మికులు నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి జీవనం సాగిస్తున్నారు. వారి శ్రమకు తగిన గుర్తింపు, భద్రత, సంక్షేమ భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది. శంకరయ్య గౌడ్ మృతి గీత వృత్తిపై ఆధారపడిన కుటుంబాల కష్టాలను మరోసారి వెలుగులోకి తెచ్చింది. ప్రభుత్వం గీత కార్మికుల కుటుంబాలకు అండగా నిలిచి, వారి జీవన భద్రతకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## ఆందోల్‌లో అలయ్ బలయ్ సందడి..



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే విజయదశమి పండుగను పురస్కరించుకుని ఆందోల్ నియోజకవర్గ స్థాయిలో అలయ్ బలయ్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో చౌటుకూరు మండలం తడ్దాన్‌పల్లిలోని ఎం.ఎస్. ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 12 గంటలకు కార్యక్రమం ప్రారంభమైంది. నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి మంత్రికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ... ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆందోల్ నియోజకవర్గంలో రూ.3 వేల కోట్లకు పైగా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, పీసీసీ సభ్యుడు కిషన్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు జగన్‌మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, లక్ష్మి శేషారెడ్డి, ఆందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, మాజీ చైర్మన్ సురేందర్ గౌడ్ పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

**● అధికారులను ఆదేశించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** ఎల్‌నినో ప్రభావాలు, వాతావరణ మార్పులు, అధి క ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు, తాగునీటి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికా రులను ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో సమాచార,పౌరసంబంధాల శాఖ, తెలం గాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించా రు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సమాచార శాఖ అధికారులు, సాంస్కృతిక సారథి కళాకారులకు నిర్వహించిన అవగాహన సదస్సు లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడా రు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే 20 శాతానికి పైగా తక్కువ వర్షపాతం నమో దైందని, పంటల సాగు విస్తీర్ణం సుమారు 20 శాతం తగ్గిందని తెలిపారు. దీంతో ధాన్యం, పశు గ్రాసం లభ్యతపై ప్రభావం పడిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర రిజర్వాయర్లలో 30 నుంచి 40 శాతం మేర మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయని,ఈ నేపథ్యంలో వచ్చే జూలై వరకు తాగునీటికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. గత మూడు నెలలుగా విద్యుత్ వినియోగం పెరిగి, గరిష్ఠంగా 20 వేల మెగావాట్లకు చేరిందని వెల్లడించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, అవుట్‌డోర్, సోషల్ మీడియా తో పాటు జానపద కళారూపాల ద్వారా ప్రజలకు సందేశాలను చేరవేయాలని సూచించారు.జిల్లా పౌరసంబంధాల అధికారులు, తెలంగాణ సాంస్కృ తిక సారథి కళాకారులు క్షేత్రస్థాయిలో చురుకుగా పాల్గొని ప్రజలను చైతన్యపరచాలన్నారు.నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడం, ఎండల సమయంలో తగినంత నీరు తాగడం, అత్యవసర మైతే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లకపోవడం వంటి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వృద్ధులు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించా రు. నీటి వనరుల సమర్థ నిర్వహణతో పాటు వ్యవసాయ, విద్యుత్, పశుసంవర్ధక, రెవెన్యూ, విపత్తుల




నిర్వహణ శాఖల సమన్వయంతో ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార, పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డాక్టర్ జి.ముకుంద రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఎ.నరసింహ రెడ్డి, అదనపు సంచాలకులు డి.ఎస్.జగన్, సంయుక్త సంచాలకులు కె.వెంకట రమణ, శ్రీనివాస్, మధుసూదన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, జిల్లా పౌరసంబంధాల అధికారులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో బియ్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

**ఖమ్మం కార్పొరేషన్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం ఖమ్మం నగరంలోని ప్రకాష్ నగర్, చర్చి కాంపౌండ్, శ్రీనివాస్ నగర్ ప్రాంతాల్లో ఉన్న బియ్యం వ్యాపారుల దుకాణాల్లో డిప్యూటీ తహశీల్దార్లతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్ తెలిపారు. తనిఖీల్లో భాగంగా, వ్యాపారులు సూర్యాపేట, కరీంనగర్ జిల్లాల నుండి కొనుగోలు చేసిన బియ్యానికి సంబంధించిన బిల్లులు, వే బిల్లులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం ప్రతి దుకాణం ప్రధాన ద్వారం వద్ద అందుబాటులో ఉన్న బియ్యం నిల్వల పరిమాణం, వాటి ధరల వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని వ్యాపారులను ఆదేశించారు. బియ్యాన్ని అధిక ధరలకు విక్రయించడం గానీ, మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించడం గానీ చేయరాదని జిల్లా పౌరసరఫరాల అధికారి స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించే వ్యాపారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# గడువులోగా పుష్కరాల పనులు

## నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలి

- ప్రత్యేక అధికారి హనుమంత రావు
- కలెక్టర్‌తో కలిసి కందకుర్తి పుష్కర ఘాట్ సందర్శన



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి(జనంసాక్షి): గోదావరి పుష్కరాల పనులను వేగవంతం చేయాలని ప్రత్యేక అధికారి, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు సూచించారు. శుక్రవారం ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు ఇతర అధికారులతో కలిసి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన నిజామాబాద్ జిల్లా కందకుర్తి పుష్కర ఘాట్ ను సందర్శించారు. దేవాదాయ, నీటిపారుదల, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను పరిశీలించి అధికారులకు కీలక సూచనలు చేశారు. పుష్కరాల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండాలన్నారు. ఒక్కో శాఖ వారీగా చేపట్టిన పనుల వివరాలు సమీక్షించి, మార్పులు చేర్పులకు సంబంధించి దిశా నిర్దేశం చేశారు. ఆలయాల అభివృద్ధి, నవీకరణ, నూతన పుష్కర ఘాట్ల నిర్మాణం, ఘాట్ల మరమ్మతులు, రోడ్ల నిర్మాణం, తాగునీటి వసతి, పార్కింగ్, వీ.ఐ.పీ ఘాట్ నిర్మాణం తదితర పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. గత పుష్కరాల సమయంలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడ్డాయా అన్నది తెలుసుకుని, ప్రస్తుతం అలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. పుష్కర ఘాట్లకు ఇరువైపులా ర్యాంప్ లు నిర్మించాలన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భద్రతా చర్యల్లో భాగంగా వాచ్ టవర్, చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలోని కందకుర్తి, యంచ తదితర గోదావరి పరీవాహక పుణ్యక్షేత్రాల వద్ద పుష్కరాలు నిర్వహించే అన్ని ప్రాంతాల్లో పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. ప్రముఖులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న కందకుర్తి పుణ్యక్షేత్రం వద్ద పుష్కరాల పనులను క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. కందకుర్తి వద్ద గోదావరిలో నీటి ప్రవాహం ఉన్నందున కొత్త పుష్కరఘాట్ నిర్మాణానికి మరికొంత సమయం పడుతుందని అన్నారు. నీటి మట్టం తగ్గిన మీదట పుష్కర ఘాట్ పనులు చేపట్టి రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. మిగితా పనులను వెంటదివెంట చేపట్టి, మైల్ స్టోన్ ప్రకారం పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని, మార్చి నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తయ్యేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్తున్నామని అన్నారు. స్పెషల్ ఆఫీసర్ వెంట బోధన్ ఆర్డీఓ విజయకుమారి, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, ఎండోమెంట్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య

**అదే ప్రభుత్వ లక్ష్యం:ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

వేములవాడ రూరల్, అక్టోబర్ 23 (జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం వేములవాడ రూరల్ మండలం మల్లారంలోని ప్రభుత్వ పాఠశాలలో "సేవా సంకల్ప అభియాన్" కింద నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ), డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చి భవిష్యత్తు నైపుణ్యాలను పెంపొందిస్తున్నామన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తరహాలో రూపుదిద్దుకుంటున్న తెలంగాణ పబ్లిక్ స్కూళ్లకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని, కొండ్రాపోలులో 1,500 మంది విద్యార్థుల సామర్థ్యంతో పాఠశాలను ప్రారంభించామని చెప్పారు. .గ్రామ సమగ్ర అభివృద్ధికి, విద్యా రంగ పరిపుష్టికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగంపల్లి రాజు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతీ పనికి గడువు విధించుకుని వేగంగా పూర్తిచేయాలి

**రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, బద్ది పోచమ్మ ఆలయం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్**

వేములవాడ (జనంసాక్షి): రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రతి దానికి గడువు విధించాలని, నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆద్వర్యంలో రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు, అన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి.. ప్రతి పనికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసు కొని..అధికారులకు సూచనలు చేశారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో దేవాదాయ శాఖ, మున్సిపల్, ఆర్ అండ్ బీ, ఎన్పీడీసీఎల్, రెవెన్యూ, పర్యాటక శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ శ్రీ రాజరాజేశ్వర దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులను అధికా రులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి పని చేయాలని సూచించారు. బద్దిపోచమ్మ ఆలయ విస్తరణ పనులను ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్మికుల సంఖ్య మరింత పెంచాలని ఆదేశించారు. రాజన్న ప్రధాన ఆలయం నుంచి తిప్పాపూర్ బ్రిడ్జి వరకు చేపడుతున్న 80 ఫీట్ల రహదారి విస్తరణ పనులు గడువులోగా పూర్తి చేయాలని, విద్యుత్ టవర్లు తదితర పనులు చేపట్టాలని సూచించారు. గుడిచెరువు బండ్ పార్క్ లో టాయిలెట్ల నిర్మాణం, నిర్వహణ తదితర అంశాలపై వేములవాడ మున్సిపల్ అధికారులకు సూచనలు చేశారు. పరిశీలనలో ఆలయ ఈవో రమాదేవి, ఆర్డీవో కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, ఎన్ పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాస్, ఆలయ ఈఈ రాజేష్, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్, వీ టీ ఏ డీ ఏ, పర్యాటక అధికారులు పాల్గొన్నారు.

# ఫామ్‌పాండ్లతో భూగర్భ జలాల పెంపు

**ఫామ్ పాండ్లలో చేపల పెంపకం చేపట్టి రైతులు అదనపు ఆదాయం పొందొచ్చు:కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి): ఫామ్ పాండ్ల నిర్మాణంతో వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు భూగర్భ జలాలను పెంచుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలో రైతు కందూరి భూలక్ష్మి పొలంలో నిర్మిస్తున్న ఫామ్ పాండ్ పనులను ఆయన పరిశీలించారు. ఫామ్ పాండ్లలో చేపల పెంపకం చేపట్టి రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు, భూగర్భ జలాల తగ్గుదల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. నీటి సంరక్షణ చర్యలు చేపట్టి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకుని మెరుగైన ఆదాయం పొందవచ్చున్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ దామోదర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఎంపీడీవో నాగేశ్వర్, తహశీల్దార్ ఉమలత, ఏఈలు సురేష్, విష్ణువర్ధన్, సుధాకర్, ఏపీవో ధర్మారెడ్డి, సర్పంచ్ కిషన్ యాదవ్, ఉపసర్పంచ్ మధుకర్, పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి పాల్గొన్నారు.

**వన మహోత్సవ మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత**

**మొక్కలకు నీరు పోసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, ఆరోగ్యంగా పెరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన మొక్కలకు నీరు పోసే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మొక్కలకు నీరు పోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటి సంరక్షణ కూడా అంతే ముఖ్యమన్నారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించి, ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డి ఆర్ డి ఓ దామోదర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఎంపీడీవో నాగేశ్వర్, తహశీల్దార్ ఉమలత, ఏఈలు పీఆర్ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ విష్ణువర్ధన్, ట్రాన్స్‌కో సుధాకర్, ఏపీవో ధర్మారెడ్డి, సర్పంచ్ కిషన్ యాదవ్, ఉప సర్పంచ్ మధుకర్, పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ మహాధర్నాకు పారిశుద్ధ్య కార్మికులు

గంభీరావుపేట(జనంసాక్షి):గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 26న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాలో పాల్గొనేందుకు మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు సిద్ధమయ్యారు. ఈ మేరకు గ్రామ సర్పం చ్, పంచాయతీ కార్యదర్శులకు సెలవు మంజూరు చేసి, ధర్నాలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల ను సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. రక్షణ పరికరాలు, కనీస వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు. తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించే చలో హైదరాబాద్ మహాధర్నాలో పాల్గొని తమ డిమాండ్ల సాధనకు కృషి చేస్తామని కార్మికులు తెలిపారు. మండల అధ్యక్షులు బరిగెల బిక్షపతి. భగవంతు నవీన్. అంజా గౌడ్ నాందేడ్ రవి. ఎల్లవ్వ. కృష్ణ జెల్ల రాజనర్స్. కార్మికులు పాల్గొన్నారు



## వివాహితపై హత్యాచారయత్నం

**అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు**



కథలాపూర్ (జనంసాక్షి): కతలాపూర్ మండలంలోని గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన వివాహిత మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడి, ఆమెను హత్య చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కోరుట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కొమ్ము తిరుపతి తెలిపారు. గ్రామానికి చెందిన ఏనుగుల మధు అనే వ్యక్తి తేదీ 21.10.2026 రోజున సాయంత్రం పూట ఓ వివాహిత మహిళకు మాయమాటలు చెప్పి, తన బైక్‌పై ఊరి బయట ఉన్న బతుకమ్మ కుంట వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడగా, బాధితురాలు ప్రతిఘటిస్తూ కేకలు వేసింది. దీంతో నిందితుడు ఆమెను హత్య చేసేందుకు తలపై బండ రాయి తో కొట్టి చంపడానికి ప్రయత్నించగా బాధితురాలు ఆమె కేకలు విని అటుగా వెళ్తున్న గ్రామస్థులు అక్కడికి చేరుకునేలోపే నిందితుడు మహిళ ఒంటి మీద ఉన్న బంగారు ఆభరణాలు,పర్సు మరియు సెల్ ఫోన్ లాక్కొని మధు అక్కడి నుంచి పరారయ్యాడు.బాధితురాలి ఫిర్యాదు మేరకు తేదీ 21-10-2026 రోజున కథలాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు ఏనుగుల మధును శుక్రవారం రోజు అనగా తేదీ 23-10-2026 రోజున గంభీర్పూర్ శివారు వద్ద అరెస్టు చేసి నేరం చేయడానికి ఉపయోగించిన మోటార్ సైకిల్ , సెల్ ఫోన్ మరియు పర్సు స్వాధీనం చేసుకొని నిందితుడుని రిమాండ్‌కు తరలించినట్లు కోరుట్ల సీఐ కొమ్ము తిరుపతి తెలిపారు ఈ దర్యాప్తు లో కథలాపూర్ ఎస్సై రవి కిరణ్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## పోలీస్‌స్టేషన్‌లో 'ఓపెన్ హౌస్'

వేములవాడ రూరల్ (జనంసాక్షి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాల (ఫ్లాగ్ డే) సందర్భంగా వేములవాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం 'ఓపెన్ హౌస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. చెక్కపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో అమర పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రతి ఒక్కరూ చట్టాలను, రోడ్డు నిబంధనలను గౌరవించాలని రూరల్ ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోలీస్ స్టేషన్ పనితీరుతో పాటు సీసీ కెమెరాల ఉపయోగాలు, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ పరికరాలు, రోడ్డు భద్రతా నిబంధనలు మరియు సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. అలాగే గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ.. అత్యవసర సహాయం కోసం డయల్ 112, సైబర్ నేరాల ఫిర్యాదుల కోసం 1930 టోల్ ఫ్రీ నంబర్లను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కిషన్, ఉపాధ్యాయులు, ఏఎస్ఐ రవీందర్ రెడ్డి, బాపు రెడ్డి, హెడ్ కానిస్టేబుల్, రిసెప్షన్ కానిస్టేబుల్ రేఖా, సైబర్ క్రైమ్ కానిస్టేబుళ్లు రాజశేఖర్, మనోహర్, దేవరాజు, అసిస్టెంట్ రైటర్ లహరి ప్రియ తదితరులు పాల్గొన్నారు

## బ్యాంక్ రుణాలు వ్యాపారాభివృద్ధికి వినియోగించాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 23 (జనంసాక్షి): బ్యాంక్ రుణాలు వ్యాపారాభివృద్ధికి వినియోగించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆద్వర్యంలో ఎంఎస్ఎంఈ సంవాద్ పేరిట సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎంఈ సంవాద్ కార్యక్రమం ద్వారా చేనేత, పవర్‌లూమ్ రంగాలకు చెందిన యజమానులు, ఆసాములు, కార్మికులకు సంస్థాగత రుణాలపై అవగాహన కల్పించడం, బ్యాంకింగ్ సేవలను వినియోగించుకునేలా ప్రోత్సహించడం, ఉత్పత్తులకు విలువ ఆధారిత ప్రక్రియలను జోడించడం ద్వారా ఆదాయం, ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవడానికి మార్గనిర్దేశం ఆర్బీఐ ఎల్డీఓ శ్రీ చేతన్ సంస్థాగత రుణాల ప్రాధాన్యత, బ్యాంకుల ద్వారా లభించే రుణ సదుపాయాలు, ఆర్థిక క్రమశిక్షణ, రుణాల సక్రమ వినియోగంపై అవగాహన కల్పించారు. వీవర్లు వివిధ మార్గాల్లో రుణాలు తీసుకోవడం వల్ల ఎదురవుతున్న ఆర్థిక సమస్యలను వివరించి, అనధికారిక రుణాలపై ఆధారపడకుండా బ్యాంకులను సంప్రదించి, తమ అవసరాలకు అనుగుణంగా తగిన రుణ సదుపాయాలను పొందాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ యజమానులు, ఆసాములు, కార్మికులు బ్యాంకుల ద్వారా సంస్థాగత రుణాలు పొందుతూ, వాటిని తమ వ్యాపారాభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. ఆర్థికంగా ఎదిగి మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని ఆకాక్షించారు. చేనేత పవర్‌లూమ్‌ల ద్వారా ఉత్పత్తి చేస్తున్న వస్త్రాలకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మరింత నాణ్యమైన, ఆకర్షణీయమైన ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. దీంతో ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించడంతో పాటు, వీవర్లు, యూనిట్ యజమానులు అధిక ఆదాయం పొందేందుకు, ఉపాధి అవకాశాలను పెంపొందించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మార్కెట్‌తో పోటీ పడాలని, ప్రభుత్వ ఆర్డర్లతో ప్రైవేట్ ఆర్డర్లు తయారు చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. చేనేత వస్త్రాల తయారీ వైపు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రతినిధులు మార్పు చెందాలని, సిరిసిల్ల ఖ్యాతిని మరింత చాటాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్డీఓ చేతన్, నాబార్డ్ డీ డీ ఎం దిలీప్ చంద్ర, ఎల్ డీ ఎం రాజీవ్ కుమార్, ఇండస్ట్రీస్‌నీ జీఎం హనుమంతు, హ్యాండ్ లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ సంతోష్ కుమార్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, చేనేత, పవర్‌లూమ్ యూనిట్ యజమానులు, వీవర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు నీటమునిగి పంచాయతీ కార్యదర్శి మృతి

- భార్యను కాపాడిన స్థానికులు
- ముత్తారం మండలం ఓడేడు మానేరు వాగు వద్ద ఘటన



మంథని, అక్టోబర్ 23, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పరిధిలోని ఓడేడు మానేరు వాగులో ప్రమాదవశాత్తు నీట మునిగి పెద్దపల్లి జిల్లా మంథని మండలం సూరయ్యపల్లి పంచాయతీ కార్యదర్శి శనిగరపు జైపాల్ (36) మృతి చెందాడు. పంచాయతీ కార్యదర్శి మృతితో మంథని మండలంలో, మండల పరిషత్ లో విషాదఛాయలు అలుముకున్నాయి. కార్యదర్శి జైపాల్ చిట్యాల మండలం టేకుమట్లలోని వారి అత్తగారింటికి వెళ్లి తిరిగి వస్తుండగా శుక్రవారం ఓడేడు మానేరు వద్ద స్నానం చేసేందుకు వెళ్లి భార్య భర్తలు ఇద్దరు ప్రమాదవశాత్తు నీట మునగగా.. స్థానికులు గమనించి పంచాయతీ కార్యదర్శి భార్యను రక్షించారు. అయితే అప్పటికే పంచాయతీ కార్యదర్శి జైపాల్ నీటిలో మునిగిపోయాడు. జైపాల్ స్వస్థలం జమ్మికుంట కాగా.. ప్రస్తుతం రామగిరి మండలం బేగంపేట క్రాస్ రోడ్డులో ఫ్యామిలీతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతని భార్య గోదావరిఖని ప్రభుత్వ వైద్యశాలలో నర్సింగ్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి రెండు సంవత్సరాల పాప ఉంది. ఆమెకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య సేవల నిమిత్తం కరీంనగర్ కి తరలించారు. ముత్తారం పోలీసులు కేసు నమోదు చేసుకొని కార్యదర్శి జైపాల్ మృతదేహాన్ని మంథనికి పోస్టుమార్టం తరలించారు. పంచాయతీ కార్యదర్శి జైపాల్ మృతి పట్ల మంథని ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులుగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# రైతుసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**భూషణ్‌రావుపేట నూతన చైర్మన్, పాలకవర్గ సభ్యుల అభినందన సభలో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



కథలాపూర్ (జనంసాక్షి): రైతులకు అవసరమైన సేవలను అందిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి సింగిల్ విండో సహకార సంఘాలు వారధిగా నిలవాలని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం కథలపూర్ మండల పరిధిలోనీ భూషణ్ రావు పేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన అధ్యక్ష కార్యవర్గ సభ్యుల అభినందన సభలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మాట్లాడుతూ సింగిల్ విండో సంఘాలు రైతులు పండించిన పంటలను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కొనుగోలు చేసే ప్రక్రియలో సహకరించాలని సూచించారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, ఇతర వ్యవసాయ సంబంధిత వస్తువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించడంతో పాటు వారి ప్రయోజనాలను కాపాడాలని, ప్రభుత్వానికి, రైతులకు మధ్య వారధిగా పనిచేయాలని సూచించారు. సంఘం నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. దేశానికి పట్టెడన్నం పెట్టే రైతన్నకు మేలు చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, రైతును రాజుగా చూడాలన్నదే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని దండగ నుంచి పండుగగా మార్చాలన్న లక్ష్యంతో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని ఆది శ్రీనివాస్ గుర్తుచేశారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం చేసి రైతాంగానికి అండగా నిలిచారని పేర్కొన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించడం ద్వారా రైతులకు సాగు ఖర్చుల భారం తగ్గించే దిశగా కీలక నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసే విధానం కూడా గతంలోనే ప్రారంభమైందని, నేటికీ కొనసాగుతోందని తెలిపారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర, వ్యవసాయానికి అవసరమైన వనరులు, సాగునీరు, నాణ్యమైన విద్యుత్ అందించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యతగా పేర్కొన్నారు. రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న ఆది శ్రీనివాస్, గతంలో కేంద్రంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా, రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు రుణమాఫీతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయని తెలిపారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసి, దాదాపు రూ. 20,650 కోట్లను వెచ్చించినట్లు వివరించారు. ఇంతటి ఆర్థిక ఒత్తిడి ఉన్నప్పటికీ గత ప్రభుత్వం అమలు చేసిన పథకాలను కొనసాగిస్తూ, కొత్త సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం, రైతులకు అండగా నిలవడం, నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రతిపక్షాలు గత 75 ఏళ్ల కాంగ్రెస్ పాలనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని, అలాగే ప్రస్తుత ప్రభుత్వం వెయ్యి రోజులకు పైగా పాలనలో ఏం చేసిందని అడుగుతున్నాయని చెప్పారు. వాటికి సమాధానంగా రైతు సంక్షేమం, రుణమాఫీ, సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాలకు భవనాలు వంటి కార్యక్రమాలను ప్రజల ముందుంచుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన ఫ్యాక్స్ చైర్మన్ స్వామి రెడ్డి, గ్రామ సర్పంచ్ బద్దం మహేందర్ రెడ్డి ఫ్యాక్స్ డైరెక్టర్లు, ఏ ఏం సి చైర్మన్, డైరెక్టర్లు, మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు సిరికొండ గంభీర్పూర్ ఫ్యాక్టరీ చైర్మన్ డైరెక్టర్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు

# పుష్కరాల పనులు వేగవంతంగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**బోధన్, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** గోదావరి పుష్కరాల పనులను వేగవంతం చేయాలని ప్రత్యేక అధికారి, రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు సూచించారు. శుక్రవారం ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు ఇతర అధికారులతో కలిసి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన నిజామాబాద్ జిల్లా కందకుర్తి పుష్కర ఘాట్ ను సందర్శించారు. దేవాదాయ, నీటిపారుదల, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను పరిశీలించి అధికారులకు కీలక సూచనలు చేశారు. పుష్కరాల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, పుణ్య స్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండాలన్నారు. ఒక్కో శాఖ వారీగా చేపట్టిన పనుల వివరాలు సమీక్షించి, మార్పులు చేర్పులకు సంబంధించి దిశా నిర్దేశం చేశారు. ఆలయాల అభివృద్ధి, నవీకరణ, నూతన పుష్కర ఘాట్ల నిర్మాణం, ఘాట్ల మరమ్మతులు, రోడ్ల నిర్మాణం, తాగునీటి వసతి, పార్కింగ్, వీ.ఐ.పీ ఘాట్ నిర్మాణం తదితర పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అన్నారు. గత పుష్కరాల సమయంలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడ్డాయా అన్నది తెలుసుకుని, ప్రస్తుతం అలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. పుష్కర ఘాట్లకు ఇరువైపులా ర్యాంప్ లు నిర్మించాలన్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున భద్రతా చర్యల్లో భాగంగా వాచ్ టవర్, చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, జిల్లాలోని కందకుర్తి, యంచ తదితర గోదావరి పరీవాహక పుణ్యక్షేత్రాల వద్ద పుష్కరాలు నిర్వహించే అన్ని ప్రాంతాల్లో పనులు వేగవంతంగా పూర్తి చేస్తామని అన్నారు. ప్రముఖులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న కందకుర్తి పుణ్యక్షేత్రం వద్ద పుష్కరాల పనులను క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. కందకుర్తి వద్ద గోదావరిలో నీటి ప్రవాహం ఉన్నందున కొత్త పుష్కరఘాట్ నిర్మాణానికి మరికొంత సమయం పడుతుందని అన్నారు. నీటి మట్టం తగ్గిన మీదట పుష్కర ఘాట్ పనులు చేపట్టి రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. మిగితా పనులను వెంటదివెంట చేపట్టి, మైల్ స్టోన్ ప్రకారం పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని, మార్చి నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తయ్యేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్తున్నామని అన్నారు. స్పెషల్ ఆఫీసర్ వెంట బోధన్ ఆర్డీఓ విజయకుమారి, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, ఎండోమెంట్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.



# ప్రత్యామ్నాయ పంటల సాగు శ్రేయస్కరం

**అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు**

**బోధన్, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** ఎల్‌నినో కారణంగా ఏర్పడిన ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో వరికి బదులుగా రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం ఎంతో శ్రేయస్కరం అని అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావులు సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు వాస్తవ పరిస్థితుల గురించి తెలియజేసేందుకు వీలుగా శుక్రవారం బోధన్ నియోజకవర్గానికి సంబంధించి బోధన్ పట్టణంలోని లయన్స్ క్లబ్ హాల్ లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులలో అదనపు కలెక్టర్లు సంబంధిత శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం లోటు, భూగర్భ జలాల తగ్గుదల వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని, తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించుకుంటూ, నీటి సంరక్షణ చర్యలు చేపట్టాలని, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో తగిన మార్పులు చేసుకోవడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవడంతో పాటు రైతులు మెరుగైన ఆదాయం పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వరి సాగు చేస్తే సాగు నీటి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సదస్సులలో బోధన్ ఆర్డీఓ విజయ కుమారి, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, డీఎస్ఓ శ్రీకాంత్, జిల్లా సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, పశు సంవర్ధక, ఉద్యానవన, విద్యుత్, భూగర్భ జలాలు, నీటి పారుదల, గ్రామీణ నీటి సరఫరా, మిషన్ భగీరథ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం
- రెండో విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 23 (జనం సాక్షి) :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో మంజూరైన అటికెల భూమయ్య, గణేష్‌లకు శుక్రవారం మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు సొంతింటి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టి, పనుల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకొని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ దామోదర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఎంపీడీవో నాగేశ్వర్, తహశీల్దార్ ఉమలత, ఏఈలు సురేష్, విష్ణువర్ధన్, సుధాకర్, ఏపీ ఓ ధర్మారెడ్డి, సర్పంచ్ కిషన్ యాదవ్, ఉప సర్పంచ్ మధుకర్, పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఇంటర్ డిపార్ట్మెంటల్ క్రికెట్ పోటీలు



**గోదావరిఖని, జనంసాక్షి :**
సింగరేణి ఆర్జీ.1 జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఇంటర్ డిపార్ట్మెంటల్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రామగుండం ఏరియా -1 ఆద్వర్యంలో శుక్రవారం జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో ఇంటర్ డిపార్ట్మెంటల్ క్రికెట్ పోటీలను ఆర్జీ.1 ఎస్.ఓ టు జీఎం చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్.ఓ టు జీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ, క్రీడలు ఆడటం వలన ఉద్యోగుల్లో శారీరక దృఢత్వం పెంపొందుతుందని, కావున క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తితో, క్రమశిక్షణతో అత్యుత్తమ ప్రతిభను కనబరిచి విజయం సాధించాలని తెలిపారు. సింగరేణి సంస్థ క్రీడలకు ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తుందని, రామగుండం ఏరియా నుండి ప్రతిభావంతులైన క్రీడాకారులు జాతీయ స్థాయిలో, ముఖ్యంగా కోల్ ఇండియా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి ఆర్జీ 1 ఏరియాకు పేరు తీసుకురావాలని తెలిపారు. ఈ పోటీల్లో ఆర్.జి-1 పరిధిలోని వివిధ గనులు, విభాగాలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో డబ్ల్యూ పిఎస్ అండ్ జిఏ గౌరవ కార్యదర్శి హనుమంతరావు, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ గాండ్ల రాజయ్య, కెప్టెన్ హరి కిషన్, కెనెడి, భరత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పే అప్‌గ్రేడేషన్ సర్క్యులర్ విడుదలపై సింగరేణి అధికారుల సంఘం హర్షం

- పీఆర్‌పీ బకాయిలను త్వరగా చెల్లించాలి సంఘం నాయకుల విజ్ఞప్తి

**యైటింక్లైన్ కాలనీ,అక్టోబర్ 23 (జనంసాక్షి) :** సింగరేణి అధికారుల దీర్ఘకాలిక న్యాయమైన డిమాండ్ అయిన పే అప్‌గ్రేడేషన్ సర్క్యులర్ విడుదల కావడంపై అఖిల భారత బొగ్గు గనుల అధికారుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎయిట్ ఇంక్లైన్ కాలనీలోని ఎన్ సి ఓ ఏ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నాయకులు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జూలై 13న ఇచ్చిన హామీ మేరకు దసరా పండుగ సందర్భంగా పే అప్‌గ్రేడేషన్ సర్క్యులర్ విడుదల కావడం సంతోషకరమని పేర్కొన్నారు. అధికారుల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించేందుకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కోల్‌బెల్ట్ ప్రాంత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే మక్కన్ సింగ్‌తో పాటు సింగరేణి యాజమాన్యానికి సంఘం తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.




**పీఆర్‌పీ బకాయిలను త్వరగా చెల్లించాలి**

సింగరేణి అధికారులకు గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్‌పీ చెల్లింపుల విషయంలో ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించడం ఆశాజనక పరిణామమని నాయకులు పేర్కొన్నారు. పీఆర్‌పీ బకాయిల చెల్లింపుల కోసం సింగరేణి యాజమాన్యానికి ఆదేశాలు ఇస్తామని ఉప ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో, అవసరమైన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి అధికారులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని యాజమాన్యాన్ని కోరారు. పే అప్‌గ్రేడేషన్ సమస్య పరిష్కారానికి కృషి చేసిన ప్రభుత్వ పెద్దలు, ప్రజాప్రతినిధులు, సింగరేణి యాజమాన్యానికి మరోసారి ధన్యవాదాలు తెలియజేశారు.

అదేవిధంగా అధికారుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి యాజమాన్యం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో అధికారుల సంఘం అధ్యక్షుడు టి. లక్ష్మీపతి గౌడ్, జనరల్ సెక్రటరీ పెద్ది నర్సింహులు, వైస్ ప్రెసిడెంట్ పొనుగంటి శ్రీనివాస్, అర్జీ-2 అధ్యక్షుడు రాముడు, అర్జీ-2 ఏరియా సెక్రటరీ సంజీవ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ జనార్ధన్, ట్రెజరర్ విశాల్, జాయింట్ ట్రెజరర్ భాస్కరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ భవన్‌లో విద్యార్థినిని అభినందించిన కేటీఆర్.. అండగా ఉంటానని భరోసా

**ముస్తాబాద్ అక్టోబర్ 23 (జనం సాక్షి) :**
ముస్తాబాద్ మండలం నామాపూర్ జెడ్‌పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని గూడెపు వంశిక జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో వంశికను కలిసిన ఆయన, ఆమెను ప్రత్యేకంగా అభినందించి, జాతీయ స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వంశిక క్రికెట్‌లో సాధించిన విజయాలు, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తీరు, భవిష్యత్తు లక్ష్యాల గురించి కేటీఆర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న గ్రామీణ ప్రాంత విద్యార్థినులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, వంశికకు అన్ని విధాలా అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. అక్టోబర్ 10 నుంచి 13వ తేదీ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో వంశిక అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలతో కూడిన ఉమ్మడి జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన ఆమె, తన నాయకత్వ ప్రతిభతో జట్టును సెమీఫైనల్స్‌కు చేర్చడంలో కీలక పాత్ర పోషించింది. బౌలింగ్‌లోనూ ప్రతిభ కనబరిచి ప్రశంసలు అందుకుంది.
వచ్చే నవంబర్ మొదటి వారంలో జమ్మూ కాశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో వంశిక తెలంగాణ తరపున తన ప్రతిభను చాటనుంది. గ్రామీణ ప్రాంత పాఠశాలలో చదువుకుంటూ జాతీయ స్థాయికి ఎంపిక కావడం పాఠశాలతో పాటు నామాపూర్ గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. వంశిక సాధించిన విజయానికి కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు కుంట శ్రీనివాస్‌ను, ఆమెకు ప్రోత్సాహం అందించిన పాఠశాల ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందిస్తున్నారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ వంశిక విజయాలు సాధించి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు చిట్టి వెంకట నర్సింగరావు, గాద్చర్ల దేవయ్య, ఉన్నారు



# నేల సంరక్షణతోనే సుస్థిర వ్యవసాయం

**రైతు వేదికలో అవగాహన సదస్సు**

**గన్నేరువరం, అక్టోబరు 23 (జనంసాక్షి):** రైతుల్లో సుస్థిర వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించేందుకు గన్నేరువరం మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం 'ఖేత్ బచావో అభియాన్' సదస్సు నిర్వహించారు. అక్టోబరు 22 నుంచి నవంబరు 30 వరకు చేపట్టనున్న ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారులు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు అందించారు. మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నేల పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని, పప్పు, నూనెగింజల సాగును ప్రోత్సహించాలని సూచించారు. పంట వ్యర్థాలను కాల్చకుండా నేల సారాన్ని కాపాడాలని, సేంద్రియ ఎరువుల వినియోగం, నీటి సంరక్షణపై దృష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు రంగనవేణి లచ్చినర్సు, కటకం తిరుపతి, తహసీల్దార్ ఇప్ప నరేందర్, ఏఈవో వంశీకృష్ణరెడ్డి, ఆయిల్‌పామ్ ఫీల్డ్ ఆఫీసర్ ఏసుమని, రైతులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుతో కదలిక.. ఫిజియోథెరపీ మిషన్‌కు మరమ్మతులు!

**గంభీరావుపేట, అక్టోబరు 23 (జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయకుండా నిలిచిపోయిన ఫిజియోథెరపీ మిషన్‌కు మరమ్మతులు పూర్తయ్యాయని ప్రభుత్వ వైద్యాధికారి ధనరాజ్ తెలిపారు. మరో రెండు రోజుల్లో రోగులకు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. లింగన్నపేటకు చెందిన కిషన్‌రావు ఆగస్టులో ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా రెండు నెలలుగా సమస్య పరిష్కారం కాకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. వివిధ గ్రామాల నుంచి చికిత్స కోసం వచ్చే రోగులు ఫిజియోథెరపీ సేవలు అందక ఇబ్బందులు పడుతున్న విషయంపై అధికారులు స్పందించి మరమ్మతులు పూర్తి చేశారు.

# మంథని బస్టాండ్ ముందు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి

**లమంత్రులు శ్రీధర్ బాబు, పొన్నంలకు వినతి పత్రాల అందజేత**

**మంథని, అక్టోబర్ 23, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా మంథని పట్టణ అభివృద్ధిలో భాగంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు ఎల్లెంకి వంశీధర్ తో కలిసి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ని, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎండీ వై. నాగిరెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. మంథని పట్టణంలోని బస్టాండ్ ముందు రోడ్డు వెడల్పు లో భాగంగా చిరు వ్యాపారులకు సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్ పోతున్నందున అట్టి షాపింగ్ కాంప్లెక్స్ ను తిరిగి నిర్మించడానికి ఆర్టీసీ బస్టాండ్ కు సంబంధించిన కొంత స్థలాన్ని కేటాయించాలని ఈ సందర్భంగా వారిని కోరారు. మంథని పట్టణంలోని బస్టాండ్ ముందు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఆవశ్యకతను వారి దృష్టికి తీసుకెళ్లారు. మంథని పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ప్రయాణికులు, వ్యాపారులు, పట్టణ ప్రజలకు అవసరమైన సదుపాయాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని వివరించారు. ఈ ప్రాంతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడం ద్వారా వ్యాపార కార్యకలాపాలకు అనుకూలమైన వసతులు కల్పించడంతో పాటు, పట్టణ వాణిజ్య అభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే, షాపింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి వస్తే రోడ్డు విస్తరణలో భాగముగా షాపులు కోల్పోతున్న స్థానిక వ్యాపారులకు తిరిగి దుకాణా లు ఏర్పాటు చేసుకునే అవకాశం కలుగుతుందని, ప్రయాణికులకు, ప్రజలకు సౌకర్యవంతముగా ఉంటుందని వివరించారు. ఈ నిర్మాణం ద్వారా బస్టాండ్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి, స్థానికంగా ఉపాధి అవకాశాల పెంపునకు కూడా దోహదపడే అవకాశం ఉందని తెలిపారు. మంథని పట్టణ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకొని, ప్రజలకు, వ్యాపార వర్గాలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.



# అంతర్గాం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**అంతర్గాం, జనంసాక్షి :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అంతర్గాం పోలీస్ స్టేషన్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఐ ఉదయ్ కిరణ్‌తో మాట్లాడి, ఆన్‌లైన్‌లో కేసుల నమోదు, ఈ-సాక్ష్య, ఈ-సమన్ల అమలు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసుల పురోగతిని పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి, అవి నిరంతరం సక్రమంగా పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు. నిర్వహించనున్న దుర్గామాత విగ్రహాల నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, బందోబస్తు మరియు భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేసి, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సిబ్బందికి సూచించారు.

# ఎల్‌నినో దెబ్బ - ఎండిపోతున్న పంటలు

- రుద్రంగి మండలంలో తీవ్ర వర్షాభావం
- అన్నదాతల కంట కన్నీరు - ఆదుకోవాలని రైతుల వేడుకోలు



**రుద్రంగి అక్టోబర్ 23 (జనం సాక్షి) :**
రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలంలో ఎల్-నినో ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ఏర్పడిన ఎల్-నినో వల్ల ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు బలహీనపడ్డాయి. దీంతో మండల వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. 40 శాతం తక్కువ వర్షపాతం మండలంలో ఈ సీజన్‌లో ఇప్పటివరకు సాధారణం కంటే దాదాపు 40 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు తెలుస్తోంది. జూన్, జూలై నెలల్లో కురవాల్సిన వర్షాలు కురవకపోవడంతో తొలకరి పనులు ఆలస్యమయ్యాయి. ఆగస్టు, సెప్టెంబర్‌లో కూడా వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరువులు ఖాళీ.. బోర్లలో నీరు అడుగంటు రుద్రంగి, ఉమ్మడి మానాల తదితర గ్రామాల్లోని చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయాయి. వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు వట్టిపోతున్నాయి. తాగునీటికి కూడా ఇబ్బందులు తలెత్తే పరిస్థితి నెలకొంది. పంటలపై తీవ్ర ప్రభావం మండలంలో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేస్తున్నారు. వర్షాభావం వల్ల వరి నాట్లు ఎండిపోతున్నాయి. పత్తి, మొక్కజొన్న పంటలు పెరుగుదల లేక రాలిపోతున్నాయి. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులకు నష్టం తప్పడం లేదు. ఓ రైతు మాట్లాడుతూ... ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టాం, వర్షం లేక పంట మొత్తం ఎండిపోయింది, ప్రభుత్వమే ఆదుకోవాలి అని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఏమంటున్నారు అంటే ఎల్-నినో ప్రభావం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని, రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని, పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడంతో పాటు, ఇన్ పుట్ సబ్సిడీ, పంటల బీమా అందించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# కరీంనగర్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- మత్తు పదార్థాల సరఫరాపై ఉక్కుపాదం
- విద్యాసంస్థలు, మెడికల్ షాపుల వద్ద నిఘా
- గంజాయి చాక్లెట్ల విక్రయాలపై కఠిన చర్యలు
- బాధితులకు చికిత్స, కౌన్సెలింగ్ అందించాలి : జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా




**కరీంనగర్ బ్యూరో, అక్టోబరు 23 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లాను డ్రగ్స్, గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. మత్తు పదార్థాల సరఫరా, విక్రయాలు, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగించాలని స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో నమోదైన కేసులు, తనిఖీలు, నియంత్రణ చర్యలు, బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను సమీక్షించారు.
విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వ్యాసరచన, ఉపన్యాస పోటీల ద్వారా మాదకద్రవ్యాల దుష్పరిణామాలను వివరించాలన్నారు. డ్రగ్స్ సరఫరాదారులు, విక్రేతలను గుర్తించేందుకు పోలీసులు తనిఖీలు ముమ్మరం చేయాలని, విద్యాసంస్థలు, మెడికల్ షాపులు, బస్టాండ్ల వద్ద నిఘా పెంచాలని ఆదేశించారు. సాధారణ చాక్లెట్ల రూపంలో గంజాయి విక్రయాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. ఇటీవల కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద 168 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకుని, ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాభవాని వివరించారు. ఇలాంటి విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మత్తు పదార్థాలకు బానిసైన వారికి వైద్య చికిత్స, కౌన్సెలింగ్ అందించి సాధారణ జీవనంలోకి తీసుకురావాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, డీఆర్వో స్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# అధ్వానంగా పరండోలి ఘాట్ రహదారి

- సరిహద్దు గ్రామాల ప్రజలకు నరకయాతన
- బిటి రోడ్డుకు అటవీ అడ్డంకులు

**కెరమెరి, అక్టోబర్ 23 (జనంసాక్షి) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో ఉమ్రి క్రాస్ రోడ్ నుంచి పరండోలికి వెళ్లే రహదారి పరిస్థితి దయనీయంగా మారింది. వర్షాకాలంలో ఘాట్ రహదారీ పూర్తిగా కోతకు గురై గుంతలు, రాళ్లు, రప్పలు తేలి వాహనాల రాకపోకలకు పనికిరాకుండా పోయింది. దీంతో ఆ మార్గంలోని 6 సరిహద్దు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదిలాబాద్ డిపో నుంచి పరండోలి, ముఖదంగూడ గ్రామాలకు నడవాల్సిన ఆర్టీసీ బస్సు రోడ్డు అధ్వానంగా ఉండడంతో ఉమ్రి గ్రామం వరకే పరిమితమైంది. దీంతో పరండోలి, కోట, లేండిజాల, శంకర్ లోది, ముకదంగూడ, మహారాజుగూడ గ్రామాల ప్రజలు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉమ్రి గ్రామానికి ఆటోల్లో, నడిచి వచ్చి బస్సు ఎక్కాల్సిన దుస్థితి నెలకొంది.

గతంలో ఈ రహదారిపై బీటీ రోడ్డు మంజూరైనప్పటికీ అటవీ శాఖ అనుమతులు లేవనే కారణంతో ఉట్నూర్ అటవీశాఖ అధికారులు పనులను అడ్డుకున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఆదివాసీల ఆరాధ్య దైవం జంగు భాయి దేవస్థానానికి వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడంతో ఏటా పుష్య మాసం జాతర సమయంలో వేలాది మంది భక్తులు రహదారి వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గతం నుంచి ఎన్నోసార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు రహదారిపై బీటి రోడ్డు సమస్యను విన్నవించిన పట్టించుకునే దాఖలాలు లేకపోలేదు. అధికారులు వెంటనే స్పందించి ఉమ్రి క్రాస్ రోడ్ నుంచి పరండోలి వరకు కోతకు గురైన రహదారిని మరమ్మత్తు చేసి, ఆర్టీసీ బస్సును తిరిగి పరండోలి వరకు నడిపేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

**రాథోడ్ విజయ్, మహారాజుగూడా గ్రామం**

ఉమ్రి క్రాస్ రోడ్ నుంచి పరండోలి రోడ్డు పూర్తిగా పాడైపోయింది. వర్షాలకు రోడ్డు అంతా కోతకు గురై పెద్దపెద్ద రాళ్లు తేలుతున్నాయి. అంబులెన్స్ కూడా రావడానికి అవకాశం లేదు. ఆదిలాబాద్ నుంచి ముకదంగూడ వచ్చే బస్సు ఉమ్రి వరకే నడుపుతున్నారు. మాపిల్లలు, ముసలివాళ్లు 5 కిలో మీటర్లు ఆటోలో లేదా నడిచి ఉమ్రికి వెళ్లి బస్సు ఎక్కాల్సి వస్తుంది. ఇదే రోడ్డులో జంగుబాయి గుడికి కూడా వెళ్తారు, భక్తులకు చాలా కష్టంగా ఉంది. గతంలో బీటీ రోడ్డు మంజూరై కంకర రాళ్లు పోశారు పనులు సాగే సమ యంలో అటవీశాఖ అధికారులు రోడ్డు పనిని ఆపేశారు. ప్రభుత్వం వెంటనే మారోడ్డు బాగు చేసి బస్సు మా గ్రామం వరకు తిప్పాలని కోరుతున్నాం.”



## స్నానానికి వెళ్లి గుంతలో పడి పంచాయతీ కార్యదర్శి మృతి

**టేకుమట్ల అక్టోబర్ 23 జనంసాక్షి :**
రామగిరి: రోడ్డుపై తవ్విన గుంతలో పడి పంచాయతీ కార్యదర్శి మృతి చెందిన విషాద ఘటన ఓడేడు వాగు వద్ద చోటుచేసుకున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. సురాయపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శనిగరపు జయపాల్ రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎక్స్ రోడ్ పెట్రోల్ బంకు ఎదురు గా నివాసం ఉంటున్నారు. ఆయన భార్యతో కలిసి టేకుమట్లలోని అత్తగారింటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఓడేడు వాగు వద్దకు చేరుకున్నారు. అక్కడ రోడ్డుపై తవ్విన పెద్ద గుంతలో నీరు నిలిచి ఉండటంతో స్నానం చేస్తుండగా ప్రమాద వశాత్తు గుంతలో పడి జయపాల్ మృతి చెందిన ట్లు సమాచారం. ఈ ఘటనలో ఆయన భార్యను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కరీంనగర్ ఏఎంసీ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు ప్రారంభం

**ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ ఆకుల నర్సన్న పటేల్**



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) మార్కెట్‌లో శుక్రవారం పత్తి కొనుగోళ్లు, పత్తి జిన్నింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల నర్సన్న పటేల్, సెక్యూరిటీ సయ్యద్ అలీ, పత్తి కొనుగోలుదారులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ ఆకుల నర్సన్న పటేల్ మాట్లాడుతూ మార్కెట్‌కు పత్తిని తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. పత్తి కొనుగోళ్ల ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు తమ పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చే సమయంలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, కొనుగోళ్లకు సంబంధించి అవసరమైన నిబంధనలను అనుసరించాలని సూచించారు. రైతులకు మద్దతు ధర అందేలా పత్తి కొనుగోళ్ల ప్రక్రియను సక్రమంగా నిర్వహించడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. మార్కెట్‌కు పత్తిని తీసుకువచ్చే రైతులకు అవసరమైన సహకారం అందించాలని, కొనుగోళ్ల సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పత్తి కొనుగోళు ప్రారంభం కావడంతో రైతులు తమ పంటను మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయించేందుకు అవకాశం ఏర్పడింది. పత్తి కొనుగోళ్లు, జిన్నింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది సహకరించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల నర్సన్న పటేల్, సెక్యూరిటీ సయ్యద్ అలీతో పాటు పత్తి కొనుగోలుదారులు, రైతులు పాల్గొన్నారు.

## వారసత్వ సంపదను భావితరాలకు అందించాలి

- సమ్మక్క-సారలమ్మ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి శ్రీనివాస్
- రామప్పలో ప్రారంభమైన ప్రపంచ వారసత్వ స్వచ్ఛంద సేవా శిబిరం



**వెంకటాపూర్ (రామప్ప), అక్టోబర్ 23 (జనం సాక్షి):** చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదపై యువత అవగాహన పెంచుకొని, వాటి ప్రాధాన్యాన్ని ఇతరులకు తెలియజేయాలని సమ్మక్క-సారలమ్మ కేంద్రీ య గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి శ్రీనివాస్ సూచించారు. తెలంగాణ పర్యాటక శాఖ సౌజన్యంతో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామప్ప లో నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ స్వచ్ఛంద సేవా శిబిరం-2026 ప్రారం భోత్సవ కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా పర్యాటక నోడల్ అధికారి డాక్టర్ ఎ. ధర్మానాయక్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేశంలోని 10 రాష్ట్రాలకు చెందిన 35 మంది స్వచ్ఛంద సేవకులు ఈ 12 రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొనున్నారు.

ఈ సందర్భంగా ఉపకులపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పర్యాటకం, సంస్కృతి, వారసత్వం, భూగర్భ శాస్త్రం వంటి పలు అంశాలను తెలుసుకునేందుకు ఈ శిబిరం విద్యార్థులకు ఉపయోగపడుతుందని అన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నేర్చుకున్న విషయాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు. అదేవిధంగా జిల్లా పర్యాటక నోడల్ అధికారి డాక్టర్ ఎ. ధర్మానాయక్ మాట్లాడుతూ.. శిబిరం నిర్వహణకు పర్యాటక శాఖ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని, పర్యాటక పోలీసుల ద్వారా భద్రత కల్పిస్తామని పేర్కొన్నారు. రామప్పకు ప్రపంచ వారసత్వ గుర్తింపు లభించినప్పటి నుంచి వరుసగా ఐదో ఏడాది ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధి ప్రొఫెసర్ పాండురంగారావు, శిబిర సమన్వయకర్త శ్రీధర్ రావు, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ పరిరక్షణ సహాయకుడు భార్గవ్, పర్యాటక శాఖ సహాయ పర్యాటక ప్రోత్సాహక అధికారి డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, ఆలయ పూజారులు ఉమాశంకర్, హరిశంకర్, పర్యాటక శాఖ సిబ్బంది, పర్యాటక పోలీసులు, దేవస్థానం సిబ్బంది, పర్యాటక మార్గదర్శకులు, వివిధ రాష్ట్రాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కరీంనగర్ మలబార్‌లో ‘ఆర్టిస్ట్రీ’ ఆభరణాల ప్రదర్శన ప్రారంభం

**నవంబర్ 15 వరకు వజ్రాలు, అన్‌కట్, రత్నాభరణాలపై 30 శాతం వరకు తగ్గింపు**



**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 23 (జనం సాక్షి) :** మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కరీంనగర్ షోరూంలో ‘ఆర్టిస్ట్రీ--బ్రాండెడ్ జ్యువెలరీ షో’ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథి చొప్పారి జయశ్రీ ప్రదర్శనను ప్రారంభించి, ప్రత్యేక డిజైన్లతో రూపొందించిన ఆభరణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కరీంనగర్ వినియోగదారులు ఈ ప్రత్యేక ప్రదర్శనను సందర్శించి తమ అభిరుచికి అనుగుణంగా బంగారు, వజ్రాలు, అన్‌కట్, జాతిరత్నాలతో రూపొందిం చిన విభిన్న డిజైన్ల ఆభరణాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. సంస్థ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రదర్శన సందర్భంగా అన్‌కట్, రత్నాభరణాల తరుగు ఛార్జీలపై, వజ్రాల విలువపై 30 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు అందిస్తున్నారు. ఈ ఆఫర్ నవంబర్ 15, 2026 వరకు మాత్రమే వర్తించనుంది. అదేవిధంగా బంగారు ఆభరణాలపై బీఐఎస్ హాల్‌మార్క్, హెచ్‌యూఐడీ ధ్రువీకరణ, జీవితకాల ఉచిత నిర్వహణ, పాత బంగారం మార్పిడిపై నిబంధనల ప్రకారం విలువ నిర్ణయించడం, వజ్రాభరణాలకు ధ్రువీకరణ వంటి సేవలను వినియోగదారులకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం హెడ్ ఫవాజ్ కబీర్, వివేక్, మేనేజర్ సిద్ధాంత్, సోబే, మార్కెటింగ్ ప్రతినిధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గన్నేరువరం - ఎలగందుల బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలి: సిపిఐ

**గన్నేరువరం, అక్టోబర్ 23 (జనంసాక్షి):**
గన్నేరువరం నుంచి ఎలగందులకు వెళ్లే మార్గంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.77 కోట్లు మంజూరై ఏడాది గడుస్తున్నా శంకుస్థాపనకు నోచుకోకపోవడంపై సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం గన్నేరువరం మండల కేంద్రంలో బ్రిడ్జి శంకుస్థాపన కోసం ఏర్పాటు చేసిన గద్దె వద్ద నిరసన చేపట్టారు. బ్రిడ్జి నిర్మాణానికి గద్దె ఏర్పాటు చేసి మర్చిపోయారని, వాయిదాల మీద వాయిదాలు వేస్తూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. రోడ్డు, బ్రిడ్జి సౌకర్యం లేక ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ వెంటనే స్పందించి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాంతాల అంజి రెడ్డి,కూన మల్లయ్య, బోయిని మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టీపీసీ -తెలంగాణకు సేఫ్టీ ఇన్నోవేషన్ అవార్డు

**గోదావరిఖని, జనంసాక్షి :** ఎన్‌టీపీసీ తెలంగాణకు సేఫ్టీ ఇన్నోవేషన్ అవార్డు 2026 లభించింది రామగుండం: అక్టోబర్ 23, 2026న న్యూఢిల్లీలోని లోధి రోడ్‌లో గల ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో ఐఈఐ-ఎస్క్యూఎఫ్ నిర్వహించిన 23వ అంతర్జాతీయ భద్రతా సదస్సు 2026లో, ఎన్‌టిపిసి తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు సేఫ్టీ ఇన్నోవేషన్ అవార్డు 2026 లభించింది. ఈ అవార్డును ఎన్‌టిపిసి తెలంగాణ తరఫున ఏజీఎం (ఈఎండీ) రజనీష్ చంద్ర సన్యాల్, సీనియర్ మేనేజర్ (సేఫ్టీ) ఎ.వి.ఎన్. రెడ్డి స్వీకరించారు. ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు, భద్రతలో అత్యుత్తమ ప్రమాణాలు, వినూత్న భద్రతా పద్ధతులు, తమ కార్యకలాపాలన్నింటిలో బలమైన భద్రతా సంస్కృతిని నిరంతరం ప్రోత్సహించడం పట్ల ఎన్‌టిపిసి తెలంగాణకు ఉన్న అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. సురక్షితమైన, భద్రమైన పని వాతావరణాన్ని నిర్ధారించడంలో బృందం యొక్క సమిష్టి కృషిని ఈ విజయం హైలైట్ చేస్తుంది.

ఈ గుర్తింపు ఎన్‌టిపిసి తెలంగాణకు గర్వకారణం, “భద్రతే ప్రథమం - ఎల్లప్పుడూ మరియు ప్రతిచోటా” అనే సూత్రానికి దాని నిబద్ధతను బలపరుస్తుంది.

# అడుగంటిన భూగర్భ జలాలు

## సాగునీరు లేదు.. సక్రమంగా కరెంటు లేదు

- ఎండిన పొలంలో బైక్ చక్కర్లు!
- నీళ్లు లేవని.. కళ్లకు కట్టినట్లు చూపిన యువరైతు..
- ఎల్‌నినో ప్రభావం.. వర్షాభావ పరిస్థితులతో పెరుగుతున్న నీటి ఎద్దడి?
- మూడు ఎకరాల్లో ఎండుతున్న వరి..
- ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ రైతు ఆవేదన..



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):**

పొలంలో నీళ్లు ఉంటే బురదలో బైక్ తిరగడం కష్టం.. అదే నీళ్లు లేకపోతే పొలంలోనూ బైక్ సాఫీగా తిరుగుతుంది..! సాగునీరు లేక ఎండిపోతున్న తన వరి పొలాన్ని చూపించేందుకు ఓ యువరైతు ఎంచుకున్న వినూత్న నిరసన ఇది.. పంటకు నీళ్లు అందడం లేదని చెప్పడానికి మాటలకే పరిమితం కాకుండా.. తన ద్విచక్ర వాహనాన్ని స్టార్ట్ చేసి, ఎండిన పొలంలోనే చక్కర్లు కొడుతూ ప్రభుత్వానికి తన గోడు వినిపించే ప్రయత్నం చేశాడు. ‘నా పొలంలో నీళ్లు లేవు.. అందుకే బైక్ తిరుగుతోంది.. పంటను కాపాడేదెలా?’ అంటూ అతడు చేసిన నిరసన అన్నదాతల దుస్థితికి అద్దం పడుతోంది.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గొల్లపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటన సాగునీటి ఎద్దడి, విద్యుత్ సమస్యలు, పడిపోతున్న భూగర్భ జలమట్టాలపై చర్చకు తెరలేపింది..

**- నీళ్లు లేవు.. అందుకే బైక్ ఎక్కింది!**

గొల్లపల్లి గ్రామానికి చెందిన యువరైతు ప్రవీణ్ తనకున్న మూడు ఎకరాల్లో వరి సాగు చేశాడు. పంట చేతికొచ్చే సమయంలో నీటి కొరత అతడిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సాగునీరు అందక.. మరోవైపు సక్రమంగా విద్యుత్ సరఫరా లేక మోటార్ల ద్వారా నీటిని తోడుకునే పరిస్థితి లేకపోవడంతో పంట కళ్లముందే ఎండిపోతోంది. అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటను కాపాడుకునేందుకు మార్గం కనిపించకపోవడంతో వినూత్నంగా నిరసన తెలిపాడు. సాధారణంగా నీటితో నిండిన పొలంలో బైక్ నడపడం కష్టమే. కానీ, తన పొలంలో నీరు లేకపోవడంతో బైక్ సులభంగా తిరుగుతోందని చూపిస్తూ.. సాగునీటి సమస్య తీవ్రతను కళ్లకు కట్టినట్లు వివరించాడు. పంటకు నీళ్లు అందించాల్సిన పొలంలో బైక్ తిరగడం.. అన్నదాతకు ఎదురైన దయనీయ పరిస్థితికి నిదర్శనంగా నిలిచింది.

**- అడుగంటుతున్న భూగర్భ జలాలు!**

వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడం, సాగునీటి వనరుల్లో నీటి లభ్యత తగ్గడం, బోర్లపై ఆధారపడే రైతులకు భూగర్భ జలాలు అందుబాటులో లేకపోవడం వంటి పరిణామాలు వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెడుతున్నాయి. ఎల్‌నినో ప్రభావం, వర్షపాతం లోటు వంటి వాతావరణ పరిస్థితులు కూడా వర్షాల తీరుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే, ప్రస్తుత నీటి ఎద్దడికి ఎల్‌నినోనే ప్రధాన కారణమని నిర్ధారించాలంటే వాతావరణ శాఖ, భూగర్భ జలాల శాఖ గణాంకాలను పరిశీలించాల్సి ఉంది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బోర్లపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులకు నీటి లభ్యత తగ్గితే పంటలను కాపాడుకోవడం మరింత కష్టంగా మారుతుంది. చెరువులు, కుంటలు, ఇతర సాగునీటి వనరుల్లో నీటి నిల్వలు, భూగర్భ జలమట్టాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**- కరెంటు కష్టాలు.. రైతుకు కన్నీళ్లు!**

సాగునీటి వనరులు అందుబాటులో ఉన్నా, మోటార్లకు అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా లేకపోతే రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. నీరు తోడుకునేందుకు సరిపడా కరెంటు అందకపోవడంతో పంటలను కాపాడుకోవడం కష్టమవుతోందని ప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇప్పటికే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులతో భారంగా మారిన సాగులో.. చివరి దశలో నీటి కొరత ఏర్పడితే రైతు పెట్టిన పెట్టుబడి మొత్తం నష్టపోయే ప్రమాదం ఉంది. చేతికొచ్చే సమయంలో పంట ఎండిపోతుంటే రైతు పడే బాధ వర్ణనాతీతం.

**- ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యం!**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రైతులు సాగునీరు, విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేశాడు. తన మూడు ఎకరాల పంటను కాపాడుకు నేందుకు ప్రభుత్వం, సంబంధిత అధికా రులు వెంటనే స్పందించాలని కోరాడు. సాగునీరు, విద్యుత్ అందించి పంటను రక్షించాలని విజ్ఞప్తి చేశాడు. లేకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ తన ఆవేదనను వెళ్లగక్కాడు. రైతు ప్రాణాల మీదకు వచ్చేంతటి పరిస్థితులు ఏర్పడకుండా అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

**- అధికారుల స్పందన ఏదీ?**

ఒకవైపు సాగు ఖర్చులు పెరుగుతుండగా.. మరోవైపు నీటి కొరతతో పంటలు ఎండిపోతే రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. గొల్లపల్లిలో యువరైతు చేసిన బైక్ నిరసనను ఒక వ్యక్తి సమస్యగా మాత్రమే చూడకుండా.. నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్న రైతుల పరిస్థితికి సంకేతంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. సంబంధిత వ్యవసాయ, విద్యుత్, నీటిపారుదల, భూగర్భ జలాల శాఖల అధికారులు గ్రామాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితిని అంచనా వేయాలి.

అందుబాటులో ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకునే మార్గాలను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి. ఎండిన పొలంలో బైక్ తిరగడం కేవలం నిరసన కాదు.. రైతుకు నీరు అందడం లేదనే చేదు వాస్తవాన్ని చాటుతున్న దృశ్యం! ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అన్నదాతలను ఆదుకుంటుందా? అనేది ప్రశ్నగా మారింది.

## పంచాయతీ కార్యదర్శుల ఇష్టారాజ్యం

- విధులకు పంచాయతీ కార్యదర్శులు డుమ్మా..
- కార్యాలయాల చుట్టూ తిరగలేక.. ప్రజలకు ఇక్కట్లు!
- ధ్రువీకరణ పత్రాలు, ఇతర పనుల్లో జాప్యం
- ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ప్రజల డిమాండ్



**తాండూర్, అక్టోబరు 23 (జనంసాక్షి):** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు సమయపాలన పాటించడం లేదని, విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కార్యాలయాల్లో వారు అందుబాటులో లేకపోవడంతో ధ్రువీకరణ పత్రాలు, ఇంటి నిర్మాణ అనుమతులు, ప్రభుత్వ పథకాల దరఖాస్తుల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గంటల తరబడి వేచి చూసినా పనులు కాకపోవడంతో నిరాశతో వెనుదిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర గ్రామాల నుంచి వచ్చే రైతులు, కూలీలు తమ పనులు మానుకుని రావాల్సి వస్తోందని, దీనివల్ల సమయం, ఆదాయం కోల్పోతున్నారని పేర్కొంటున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన కార్యదర్శుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా, మండల స్థాయి అధికారులు స్పందించి పంచాయతీ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## అంబులెన్స్‌ను ఢీకొన్న లారీ.. తల్లీకూతుళ్లు మృతి

**మరో నలుగురికి తీవ్ర గాయాలు.. కడ్తాల్ శివారులో ఘటన**

**సోన్, అక్టోబర్ 23,(జనంసాక్షి ):** వేగంగా వచ్చిన లారీ అంబులెన్స్‌ను ఢీకొట్టడంతో తల్లీకూతుళ్లు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నిర్మల్ జిల్లా సోన్ మండలం కడ్తాల్ గ్రామ శివారులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడకు చెందిన మెస్రం సరస్వతి (22) అనారోగ్యంతో ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో వైద్యులు ఆమెను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించాలని సూచించారు. దీంతో ఐటీడీఏ ఏర్పాటు చేసిన అంబులెన్స్‌లో కుటుంబ సభ్యులు ఆమెను తీసుకుని గురువారం రాత్రి ఆదిలాబాద్ నుంచి బయలుదేరారు. రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో కడ్తాల్ శివారుకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన లారీ అంబులెన్స్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సరస్వతితో పాటు ఆమె తల్లి మెస్రం పారుబాయి (55) తీవ్రంగా గాయపడ్డారు. ఆసుపత్రికి తరలించే క్రమంలో ఇద్దరూ మృతి చెందారు. అంబులెన్స్ డ్రైవర్ కనక సాయికిరణ్‌తో పాటు కుటుంబ సభ్యులు కనక గీత, తూమురం శైలూ, మెస్రం సోముకు గాయాలయ్యాయి. వీరు నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతురాలి సోదరుడు సోము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సోన్ ఎస్సై కె. గోపి తెలిపారు.

## అత్తాపూర్లో ఎక్సైజ్ దాడులు రూ.4 లక్షల విలువైన మాదకద్రవ్యాలు ఆయుధాలు స్వాధీనం

**రాజేంద్రనగర్,అక్టోబర్23(జనంసాక్షి) :** అత్తాపూర్ సిఖ్ చౌనిలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి గంజాయి, పాపీ స్ట్రా, తుపాకులు, బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎ. శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో జరిగింది.ఆయన వివరాల ప్రకారం విశ్వసనీయ సమాచారం ప్రకారం శుక్రవారం నిర్వహించిన దాడుల్లో సర్దార్ రాజా సింగ్ (39) వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి, 1.13 కిలోల పాపీ స్ట్రా, ఒక రివాల్వర్, రెండు పిస్టళ్లు, ఐదు బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.4 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. నిందితుడు మంగళ్‌హాట్‌కు చెందిన రాహుల్ సింగ్ వద్ద గంజాయి కొనుగోలు చేయగా, నాందేడ్‌కు చెందిన గుర్తుతెలియని వ్యక్తి నుంచి పాపీ స్ట్రా తెచ్చినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడు లోన్ రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తూ, మాదకద్రవ్యాలను ఇతరులకు విక్రయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తుపాకులు, బుల్లెట్లకు సంబంధించిన వివరాలపై విచారణ కొనసాగుతోందని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

# పకడ్బందీగా ఖేలో ఇండియా గేమ్స్

- గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారుల గుర్తింపు
- డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ఖేలో ఇండియా పోటీలు
- 27 క్రీడాంశాల్లో ప్రతిభావంతుల ఎంపిక




హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు అండ్ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఖేలో ఇండియా పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, క్రీడాకారుల ఎంపిక, స్టేడియాల సిద్ధత, శిక్షణ తదితర అంశాలపై శుక్రవారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఖేలో ఇండియా పోటీలు నిర్వహించే క్రీడా వేదికలు, స్టేడియాలను గుర్తించి, వాటిలో అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా పరికరాలు, ఇతర ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పోటీల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. క్రీడాకారుల శారీరక దృఢత్వం, సామర్థ్యం పెంపొందించేందుకు నాణ్యమైన శిక్షణతోపాటు పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని ప్రభుత్వ పరంగా అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, వైద్య సహాయం, వసతి, రవాణా వంటి సదుపాయాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా గేమ్స్ దేశానికే దిక్సూచిగా నిలిచేలా ఏర్పాట్లు ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. క్రీడాకారులకు అత్యుత్తమ వసతులు కల్పిస్తూ, పోటీల నిర్వహణలో ఎక్కడా లోపాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని చెప్పారు. ఈ పోటీలు తెలంగాణ క్రీడా రంగానికి కొత్త దిశానిర్దేశం చేయడంతోపాటు రాష్ట్ర యువతలో క్రీడల పట్ల ఆసక్తిని మరింత పెంచేలా ఉండాలని పేర్కొన్నారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు, తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, ప్రవీణ్ కుమార్ మల్లారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, రవితేజ, అశోక్, శ్రీనివాస్, ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సరాకా ల్యాబరేటరీస్‌లో గ్యాస్ లీకేజీ

## ఇద్దరు కార్మికులు దుర్మరణం

- యాజమాన్య నిర్లక్ష్యం కారణమంటూ మృతుల కుటుంబ సభ్యుల ఆరోపణలు
- సరాకా ల్యాబొరేటరీస్ మూసివేతకు ఆదేశాలు




జిన్నారం, అక్టోబర్ 24 (జనంసాక్షి) : సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని పారిశ్రామిక ప్రాంతంలో విషాదం చోటుచేసుకుంది. సరాకా ల్యాబరేటరీస్ పరిశ్రమలో గ్యాస్ లీకేజీ జరిగినట్లు వచ్చిన సమాచారం కలకలం రేపింది. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయారు. పరిశ్రమలోని ప్రొడక్షన్ బ్లాక్-2లో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత కార్మికులు విధులు నిర్వహిస్తున్న సమయంలో గ్యాస్ పైపులైన్ నుంచి క్లోరోఫామ్ వాయువు లీకైనట్లు ప్రాథమిక సమాచారం. ఈ క్రమంలో విధుల్లో ఉన్న పంగ సుదర్శన్‌రావు (43), కీలపర్తి బాలాజీ (29) అస్వస్థతకు గురై కుప్పకూలినట్లు తెలిసింది. వెంటనే స్పందించిన పరిశ్రమ సిబ్బంది వారిని అంబులెన్స్‌లో సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఇద్దరూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం.

కార్మికుల ఇద్దరు స్థానికేతరులు చింతల్‌లో నివాసం స్వస్థలాలు వేర్వేరు. మృతులిద్దరూ హైదరాబాద్‌లోని చింతల్‌లో నివాసం ఉంటున్నట్లు తెలిసింది. సుదర్శన్‌రావు స్వస్థలం శ్రీకాకుళం కాగా, బాలాజీ విజయనగరం జిల్లాకు చెందినవారని సమాచారం. ఈ ఘటనతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. ప్రమాదంపై సమాచారం అందుకున్న జిన్నారం పోలీసులు ఘటనాస్థలికి సంబంధించిన వివరాలను సేకరించి విచారణ చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. అసలు గ్యాస్ లీకేజీ ఎలా జరిగింది పైపులైన్‌లో లోపం ఉందా పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలు చేస్తున్నారా అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు, ఇతర వివరాలు అధికారిక విచారణ అనంతరం వెల్లడికావాల్సి ఉంది

### సరాకా ల్యాబొరేటరీస్ మూసివేతకు ఆదేశాలు

గడ్డపోతారం సరాకా ల్యాబొరేటరీస్‌లో క్లోరోఫామ్ లీకై ఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటనపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ప్రొడక్షన్ బ్లాక్--2లో రియాక్టర్ నుంచి రిసీవర్‌కు క్లోరోఫామ్ బదిలీ చేసే సమయంలో లీకేజీ జరిగినట్లు పరిశ్రమ అధికారులు వివరించారు. ప్రమాద తీవ్రత దృష్ట్యా ముందస్తు విచారణ అవకాశం ఇవ్వకుండానే పరిశ్రమ మూసివేతకు టీజీపీసీబీ ఆదేశాలు జారీ చేసింది. విద్యుత్ సరఫరా నిలిపివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది.

# గౌడ కుటుంబాలపై గ్రామ బహిష్కరణ వేటు!

- డబ్బులు ఇవ్వలేదని సాంఘిక బహిష్కరణ..
- మాట్లాడినా, వస్తువులిచ్చినా రూ.5 వేల జరిమానా!
- తిర్మాణ్‌పల్లి వీడీసీ పై కఠిన చర్యలు తీసుకోవాలి..
- తహసీల్దార్‌కు గౌడ సంఘాల వినతి



సదాశివనగర్, అక్టోబర్ 23 (జనంసాక్షి): గ్రామంలోనే పుట్టి పెరిగిన గౌడ కుటుంబాలపై సాంఘిక బహిష్కరణ విధించడం తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది. డబ్బులు ఇవ్వలేదనే కారణంతో కల్లు గీత కార్మిక కుటుంబాలను గ్రామ బహిష్కరణ చేశారని, వారితో ఎవరైనా మాట్లాడినా, వారికి వస్తువులు విక్రయించినా రూ.5 వేల జరిమానా విధిస్తామని గ్రామంలో చాటింపు వేయించారని గౌడ సంఘాల నాయకులు ఆరోపించారు. సదాశివనగర్ మండలం తిర్మాణ్‌పల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనపై సంబంధిత గ్రామ కమిటీ (వీడీసీ)పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సదాశివనగర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ లింగా గౌడ్, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సైదగౌని వెంకట్ గౌడ్, జైగౌడ జిల్లా అధ్యక్షుడు మురళి గౌడ్ మాట్లాడుతూ.. మూడు రోజుల క్రితం గ్రామ కమిటీ గౌడ కులస్తులను డబ్బులు డిమాండ్ చేసిందని, వారు ఇవ్వకపోవడంతో సాంఘిక బహిష్కరణకు పాల్పడినట్లు ఆరోపించారు.

### గ్రామంలోనే ఉన్నా.. వెలివేతేనా?

గ్రామ బహిష్కరణ పేరుతో కుటుంబాలను సామాజికంగా ఒంటరి చేయడం, వారితో మాట్లాడవద్దని ఆంక్షలు విధించడం, నిత్యావసర వస్తువులు కూడా అందకుండా అడ్డుకుంటామని హెచ్చరించడం అన్యాయమని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలపై ఆంక్షలు విధిస్తూ సమాంతర వ్యవస్థను నడిపే ప్రయత్నం చేస్తున్న గ్రామ కమిటీపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రామా గౌడ్, తిర్మాణ్‌పల్లి గీత కార్మికులు స్వామి గౌడ్, మైసా గౌడ్, మల్లా గౌడ్, శ్రావణ్ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, చిన్న మైసా గౌడ్, మహేష్ గౌడ్, బాలా గౌడ్, మండల గౌడ సంఘం నాయకులు సాయి గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో గుండెపోటుతో తెలంగాణ యువతి మృతి



ఖమ్మం (జనం సాక్షి) : ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన యువతి గుండె పోటుతో మరణించింది. ఖమ్మంకు చెందిన నల్లమల అక్షిత అనే యువతి ఎంఎస్ పూర్తిచేసి ఉద్యోగం చేసేందుకు అమెరికాకు వెళ్లింది. ప్రస్తుతం ఆమె ఉద్యోగ ప్రయత్నంలో ఉండగా శుక్రవారం తెల్లవారుజామున గుండె పోటు రావడంతో మరణించింది. అక్షిత తండ్రి ఆనంద్ ఖమ్మం వాణిజ్య మండలి ఎగుమతుల విభాగానికి అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. కూతురు మరణవార్తతో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అక్షిత కుటుంబం ఖమ్మంలోని మమతా రోడ్డులో నివాసం ఉంటుండగా అక్కడ సైతం విషాదకర వాతావరణం నెలకొంది. ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగం సాధించాలని పట్టుదలతో వెళ్లిన కూతురు తిరిగిరాని లోకాలకు వెళ్లిందని కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.



# సామాజిక సమస్యలను కళాత్మకంగా మలచిన కేఎల్

- కేఎల్ జీవితాన్ని పాఠ్యాంశాలలో చేర్చాలి
- మిర్యాలగూడ కేఎల్ సభలో జూలూరు

మిర్యాలగూడ (జనంసాక్షి) : సామాజిక సమస్యలను జీవితంలోని బహు ముఖాలను కళాత్మకంగా మలిచి విస్తృత రచనలు చేసినతెలుగు జాతినాటక రంగ జెండాగా నిలిచిన కేఎల్‌ఓ నరసింహారావు జీవితాన్ని, రచనలను పాఠ్యాంశాల్లో చేర్చి భావితరాలకు అందించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ ప్రముఖ కవి జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. కేఎల్ నరసింహారావు రచనల్లో తెలంగాణ మట్టి పౌరుషాన్ని, తెలంగాణ జీవన విధానాన్ని నాటకాల్లో సజీవ పాత్రలుగా చిత్రీకరించారని పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మునగాల పరగణ రేపాల గ్రామం నుంచి ప్రారంభించిన కేఎల్ నాటక రచన ప్రదర్శనలు ఈ నేలలో జరిగిన అనేక రకాల సామాజిక ఉద్యమాలకు సజీవ తార్కాణంగా నిలుస్తాయని చెప్పారు. మిర్యాలగూడెంలో శుక్రవారం టి యుటిఎఫ్ కార్యాలయంలో వేముల వెంకటేశ్వర్లు రచించిన"నాటక రంగ శిఖరం" కేఎల్ నరసింహారావు పుస్తకాన్ని జూలూరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలమే ఆయుధంగా, కళా రంగమే ఊపిరిగా, సమాజ సేవే జీవితంగా జనం కోసం జీవిత కాలాన్ని అంకితం చేసిన రంగస్థలం యోధుడిగా కేఎల్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. 150 కి పైగా నాటికలు నాటకాలను రచించిన కేఎల్ కృషిని భావితరాలకు అందించేందుకు పాలకులు కృషి చేయాలని జూలూరు గౌరీ శంకర్ పేర్కొన్నారు. తెలంగాణ మట్టి గర్వించదగ్గ కేఎల్ నరసింహారావు వంటి మహా రచయితపై పుస్తకం రావడం ఆహ్వానించదగిందని మిర్యాలగూడ మున్సిపల్ కౌన్సిలర్ నూకల కవిత వేణుగోపాల రెడ్డి, కౌన్సిలర్ జేసిడి శేఖర్ రెడ్డి, తడకమళ్ళ రామచంద్రరావు, కోదాటి సాయి సుజిత నరసింహారావు రచయిత చకోనా, బోయినపల్లి వెంకటరమణారావు, పులి కృష్ణమూర్తి తదితరులు మాట్లాడారు. పుస్తక రచయిత అధ్యాపకులు వేముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కే ఎల్ వంటి సుప్రసిద్ధ నాటక రచయిత పుస్తకాన్ని వెలువరించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ సభకు మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం అధ్యక్షులు పరిమి రామావతారం అధ్యక్షత వహించారు.

# పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు

**ముఖ్యమంత్రి,మంత్రి జూపల్లికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



హైదరాబాద్ (జనంసాక్షి) : పానగల్‌లోని చారిత్రక ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేయడం పట్ల రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిన ఛాయా సోమేశ్వరాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. ప్రపంచస్థాయిలో ఎక్కడ లేని విధంగా "వందల ఏళ్ల క్రితమే శిల్పులు కాంతి, నీడ, నిర్మాణ శాస్త్రాన్ని సమన్వయం చేసి శివలింగంపై నిరంతర ఛాయ కనిపించేలా నిర్మించిన ఛాయా సోమేశ్వరాలయం తెలంగాణ శిల్పకళా వైభవానికి, ప్రాచీన నిర్మాణ విజ్ఞానానికి అద్భుత నిదర్శనమన్నారు. ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో చారిత్రక వారసత్వాన్ని కాపాడటంతో పాటు మరింత పర్యాటక ప్రాధాన్యత తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. మంత్రి చొరవతో ఆలయ అభివృద్ధి నిధులు విడుదల కావటంలో భక్తులు,స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రామగుండం ఎన్‌టీపీసీకి జాతీయ భద్రతా పురస్కారం




గోదావరిఖని (జనంసాక్షి) : పారిశ్రామికంగా కీలకమైన రామగుండం ప్రాంతానికి మరో జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. రామగుండంలోని ఎన్టిపిసి తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు ప్రతిష్ఠాత్మక సేఫ్టీ ఇన్నోవేషన్ అవార్డు–2026 దక్కింది. విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాల్లో భద్రతా ప్రమాణాలు, వినూత్న భద్రతా విధానాలు, సురక్షిత పని వాతావరణం కల్పించడంలో సంస్థ చూపుతున్న నిబద్ధతకు ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచింది. న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో శుక్రవారం (అక్టోబర్ 23) ఐఈఐ-ఎస్‌క్యూఎఫ్ నిర్వహించిన 23వ అంతర్జాతీయ భద్రతా సదస్సు–2026 లో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఎన్టిపిసి తెలంగాణ తరఫున ఏజీఎం (ఈఎండీ) రజనీష్ చంద్ర సన్యాల్, సీనియర్ మేనేజర్ (సేఫ్టీ) ఎ.వి.ఎన్. రెడ్డి పురస్కారాన్ని అందుకున్నారు.

# అత్తాపూర్‌లో డ్రగ్స్ దందా గుట్టురట్టు..



రాజేంద్రనగర్ (జనంసాక్షి) : అత్తాపూర్‌లో గంజాయి, పాపీ స్ట్రాతో పాటు తుపాకులు, బుల్లెట్లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ మాదకద్రవ్యాల విక్రయాలపై నిర్వహించిన దాడుల్లో సర్దార్ రాజా సింగ్ (39) అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు గ్రేటర్ హైదరాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఏ. శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం రాజేంద్రనగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను వెల్లడించారు.నిందితుడు సర్దార్ రాజా సింగ్ పాపీ స్ట్రాను నాందేడ్‌కు చెందిన ఓ వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని తెలిపారు. గంజాయిని మంగళ్‌హాట్‌కు చెందిన రాహుల్ సింగ్ వద్ద కొనుగోలు చేసినట్లు పోలీసుల విచారణ తెలిసింది.అయితే, రివాల్వర్, పిస్టళ్లు, బుల్లెట్లను ఎక్కడి నుంచి సేకరించాడనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని తెలిపారు.నిందితుడు నుండి 1.5 కిలోల ఎండు గంజాయి, 1.130 కిలోల పాపీ స్ట్రా, ఒక రివాల్వర్, రెండు పిస్టళ్లు, ఐదు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.4 లక్షలుగా అంచనా ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో రాజేంద్రనగర్ ఎక్సైజ్ సీఐ నజీర్ పాషా, దూల్‌పెట్ సీఐ ప్రవీణ్ కుమార్, వెంకన్న, విప్లవ రెడ్డి, విజయ్, జనార్ధన్, లేఖ సింగ్, ప్రసాద్ రావు, సాబీర్, శీను తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులను ఆదుకుంటాం

- సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి
- సీఎం ప్రజావాణిలో 103 దరఖాస్తులు



హైదరాబాద్ (జనంసాక్షి) : వివిధ కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులకు తిరిగి విధుల్లోకి తీసుకునే విషయంలో ఆర్టీసీ ఎండీ, సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపించేందుకు చర్యలు తీసుకుంటామని, ఆర్టీసీ కార్మికులకు ఆదుకుంటాం అని సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి హామీనిచ్చారు. వివిధ కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున శుక్రవారం జరిగిన సీఎం ప్రజావాణికి వచ్చి గద్వాల్ విజయలక్ష్మి దృష్టికి సమస్యలు వివరించారు. కొంత కాలం క్రితం 317 మంది ఆర్టీసీ కార్మికులకు తిరిగి ఉద్యోగాలు ఇప్పించామని, మిగతా 180 మందికి కూడా ఆదుకునేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని విజయలక్ష్మి పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన 263వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 103 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి దరఖాస్తులు స్వీకరించి ఎండార్స్ మెంట్స్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. రెవెన్యూ శాఖకు 27, బీసీ సంక్షేమ శాఖకు 18, మున్సిపల్ శాఖకు 14, ఇతర శాఖలకు 44 దరఖాస్తులు అందాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎయిర్ ఇండియా విమానానికి తప్పిన ప్రమాదం

హైదరాబాద్ (జనంసాక్షి) : శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో శుక్రవారం ఎయిర్ ఇండియా విమానానికి పెద్ద ప్రమాదం తప్పింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుండి ప్రయాణికులతో బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానంలో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే తీవ్ర సాంకేతిక లోపం తలెత్తింది. టేకాఫ్ అయిన కేవలం 5 నిమిషాల వ్యవధిలోనే విమానంలో సాంకేతిక సమస్యను గమనించిన పైలట్, వెంటనే అప్రమత్తమయ్యారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన పైలట్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అధికారులకు సమాచారం అందించి విమానాన్ని తిరిగి శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు. అనంతరం విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ ప్రమాద సమయంలో విమానంలో మొత్తం 109 మంది ప్రయాణికులు ఉన్నారు. పైలట్ చాకచక్యంగా విమానాన్ని ల్యాండ్ చేయడంతో ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370